సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 227
మంగళవారం 2-5-2023
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



లక్నో సూపర్ ఫ్లాప్
ఐపీఎల్ మ్యాచ్‌లో 18 పరుగుల తేడాతో గెలిచిన బెంగళూరు - 12లో



జేపీ మోర్గాన్ చేతికి ఫస్ట్ రిపబ్లిక్
బ్యాంక్ డిపాజిట్లు, అసెట్లలో అధిక భాగం జేపీ మోర్గాన్‌కు విక్రయం - 13లో


మూడు ఉచిత సిలిండర్లు
కర్ణాటకలో మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని బీజేపీ ప్రకటించింది.
వివరాలు 6లో ▸


బీఎస్పీ ఎంపీపై అనర్హత వేటు
కిడ్నాప్, హత్య కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష పడిన బీఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీపై అనర్హత వేటు పడింది.
వివరాలు 6లో ▸


దేశ ద్రోహం చట్ట సవరణకు సిద్ధం
భారత శిక్షాస్మృతిలోని 124ఏ సెక్షన్ సవరణకు సిద్ధమని.. సంప్రదింపుల ప్రక్రియ కీలక దశలో ఉందని కేంద్రం సుప్రీంకు తెలిపింది.
వివరాలు 6లో ▸


ఎవరిదో 'రాజ'ధాని!
బెంగళూరు పరిధిలోని 28 నియోజకవర్గాల్లో అత్యధిక స్థానాలు నెగ్గి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ, కాంగ్రెస్ శ్రమిస్తున్నాయి.
వివరాలు 6లో ▸

'ఉన్నత' వైద్యం

వైద్యులు, సిబ్బంది, మందులకు కొరత లేకుండా చర్యలు

ఆస్పత్రుల్లో మానవ వనరులపై నిరంతర ఆడిట్

విలేజ్ క్లినిక్స్ నుంచి బోధనాస్పత్రుల దాకా అన్ని స్థాయిల్లో నిర్వహణ

- రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఎప్పటికప్పుడు ఖాళీల భర్తీ
- 23 రోజుల్లో 20.25 లక్షల మందికి ఫ్యామిలీ డాక్టర్ల సేవలు
- గ్రామాలకు వెళ్లే తేదీలను ముందుగానే వెల్లడిస్తూ విస్తృత ప్రచారం.. రక్తహీనతను ఎదుర్కొనేందుకు గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం
- సమస్యను అధిగమించేలా వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ద్వారా పర్యవేక్షణ
- వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు
- మూడున్నరేళ్లలో 48 వేలకుపైగా పోస్టుల భర్తీ.. వైద్య ఆరోగ్య రంగంలో రికార్డు
- ఐదు కొత్త మెడికల్ కాలేజీల్లో ఈ ఏడాదే తరగతులు ప్రారంభించేలా సన్నద్ధం



పెట్టుబడులు పెట్టండి
ఎలాంటి సహాయ సహకారాలైనా అందిస్తాం
భారత్‌లో యూఏఈ రాయబారి అబ్దుల్ నాసర్ అల్షాలితో సీఎం జగన్
- వివరాలు 2లో

యూఏఈ రాయబారి అబ్దుల్ నాసర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ కనీవినీ ఎరుగని రీతిలో 48 వేలకుపైగా వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతోపాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో గ్రామాల్లోనే వైద్య సేవలందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మానవ వనరుల కొరత అనే ప్రశ్నే ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు వివరాలను సేకరించడంపై దృష్టి సారించింది. ప్రభుత్వాస్పత్రుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్యులు, సిబ్బంది కొరతకు తావులేకుండా ఒక్కో ఆస్పత్రిని యూనిట్‌గా తీసుకుని క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. గ్రామాల్లోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నుంచి బోధనాస్పత్రుల వరకూ అన్ని స్థాయిల్లో మానవ వనరులపై ఆడిట్ చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల పురోగతి, కరోనా తాజా పరిస్థితులను పరిశీలించి

మిగతా 2వ పేజీలో ▶


నంద్యాల జిల్లా నాయినపల్లె సమీపంలో వర్షపు నీటితో నిండిన కదిరి కుంట

కుండపోత

ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వానలు

- ఆరు జిల్లాల్లో భారీగా.. ఉపరితల ఆవర్తనం ప్రభావమే కారణం
- మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం
- శ్రీకాళహస్తిలో పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి
- వాగులో చిక్కుకున్న ముగ్గురు.. రక్షించిన పోలీసులు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: తీవ్రమైన ఎండలు మండే మే నెలలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రమంతా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి అనేక జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి, నంద్యాల, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీవర్షాల కారణంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలో సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు ఓ గొర్రెల కాపరి ముచ్చువోలు శ్రీనివాసులు (57)అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఓ ఎద్దు కూడా ఇదే కారణంగా మరణించింది. వేసవిలో రెండు, మూడ్రోజులు అకాల వర్షాలు పడడం సాధారణమే అయినా ఇప్పుడు ఏకంగా రోజుల తరబడి అది కూడా భారీ వర్షాలు కురుస్తుండడం వాతావరణంలో మార్పుల ప్రభావమేనని నిపుణులు చెబుతున్నారు.


అత్యధిక వర్షపాతం నమోదైన జిల్లాలివే..

గత 24 గంటల వ్యవధిలో అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సగటున 44.98 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా సగటున 43.61 మిమీ, పశ్చిమ గోదావరి జిల్లాలో 42.76, నంద్యాల జిల్లాలో 42.50, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 42.22, ఏలూరు జిల్లాలో 41.88..

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

తుని రైలు దహనం కేసు కొట్టివేత



తుని రైల్వేస్టేషన్ సమీపంలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు దహనం కేసులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతో పాటు 41 మందిని నిర్దోషులుగా పేర్కొంటూ విజయవాడ రైల్వే న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు వారిపై పెట్టిన కేసును కొట్టి వేస్తున్నట్లు ప్రకటించారు.
వివరాలు 2లో ▸

నేత్రపర్వం.. సత్యదేవుని దివ్యకల్యాణం



కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యనారాయణస్వామి, శ్రీఅనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. అర్చకుల మంత్రోచ్చారణల నడుమ మంగళ సూత్రధారణ, తలంబ్రాలు, వేదాశీస్సులతో కల్యాణోత్సవం కమనీయంగా సాగింది.
వివరాలు 5లో ▸

వెంటనే విడాకులు.. 'సుప్రీం' సంచలన తీర్పు



వివాహ బంధం పునరుద్ధరించలేనంతగా దెబ్బ తింటే దంపతులు పరస్పర అంగీకారంతో తక్షణం విడాకులు తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. ఇలాంటి సందర్భాల్లో ఆరు నెలల తప్పనిసరి వెయిటింగ్ పీరియడ్ వర్తించదని స్పష్టం చేసింది.
వివరాలు 14లో ▸

'బ్రిజ్‌భూషణ్‌ను రక్షించే ప్రయత్నమిది'

సిద్ధూ విమర్శ
12 లో

ఇదండీ సంగతి



ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

ఒక డీఏ మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- 2022 జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన డీఏ 2.73 శాతం మంజూరు
- పెంచిన డీఏ జులై 1 నుంచి.. ఆగస్టు 1న జీతంతో నగదు రూపంలో చెల్లింపు
- బకాయిలు మూడు సమాన వాయిదాల్లో జీపీఎఫ్‌కు జమ
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ



సాక్షి, అమరావతి: ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఇచ్చిన మాట మేరకు ఉద్యోగులు, పెన్షనర్లకు ఒక డీఏను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 2022 జనవరి నుంచి ఇవ్వాల్సిన డీఏను 2.73 శాతం మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులకు డీఏను మంజూరు చేస్తూ జీవో 66ను, పెన్షనర్లకు డీఏను మంజూరు చేస్తూ జీవో-67ను రావత్ జారీ చేశారు. పెంచిన డీఏ 2.73 శాతాన్ని ఈ ఏడాది జులై 1వ తేదీ నుంచి అమలు చేస్తూ.. ఆగస్టు 1వ తేదీ వేతనాలతో కలిపి

మిగతా 3వ పేజీలో ▶

వర్షంలోను జోరుగా పింఛన్ల పంపిణీ

- 53.21 లక్షలమందికి అందిన రూ.1,468.04 కోట్లు
- తొలిరోజే 84.02 శాతం మందికి చేరిన పింఛను

- వివరాలు 2లో


విశాఖ జిల్లా పెదజాలారిపేటలో దువ్వి అప్పయ్యమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కట్ట శివ

గ్యాంబ్లింగ్ డెన్‌ను పరిశీలిస్తున్న థాయ్‌లాండ్ పోలీసులు


థాయ్‌లాండ్‌లో చిక్కిన చీకోటి

- పటాయాలో అక్రమంగా గ్యాంబ్లింగ్ డెన్ నిర్వహిస్తుండగా పట్టుకున్న థాయ్ పోలీసులు
- చీకోటి, అతని ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి సహా ఆరుగురి అరెస్ట్
- పేకాట ఆడుతున్న 83 మంది భారతీయులు అదుపులోకి.. జరిమానా అనంతరం విడుదల
- రూ.16 లక్షల భారత కరెన్సీ, రూ. 20 కోట్ల విలువైన గేమింగ్ చిప్స్ స్వాధీనం
- పట్టుబడ్డ వారిలో మెదక్ డీసీసీబీ చైర్మన్ సహా తెలంగాణ, ఏపీకి చెందిన ప్రముఖులు

2 లో

'పెండింగ్'కు 'మధ్యవర్తిత్వం' చక్కటి పరిష్కారం

భరించలేని భారమైతే వ్యవస్థ దెబ్బతింటుంది
- తెలంగాణ హైకోర్టు జడ్జిలు.. మీడియేషన్‌ను ప్రోత్సహించాలి
- 'మధ్యవర్తిత్వం'పై చర్చలో హైకోర్టు సీజే


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, జస్టిస్ నవీన్‌రావు

సాక్షి, హైదరాబాద్: భరించలేనంత భారం మోపితే ఏ వ్యవస్థ అయినా దెబ్బతింటుందని.. ఆ ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యామ్నాయం అవసరం అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో వివాద పరిష్కారంలో మధ్యవర్తిత్వం అమలు విధానంపై చర్చా కార్యక్రమాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ నవీన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ.. ' ఏటికేడు పెరిగిపోతున్న పెండింగ్ కేసులతో న్యాయవ్యవస్థపై విపరీత భారం పడుతోంది. న్యాయమూర్తులపై కూడా తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. దీనికి చక్కని పరిష్కారమే 'మధ్యవర్తిత్వం' అని వెల్లడించారు.

అవగాహన పెంచుకోవాలి..

'హైకోర్టు న్యాయమూర్తులు కూడా మధ్యవర్తిత్వ విధానంపై మరింత అవగాహన పెంచుకోవాలి. దేశంలో దాదాపు 5 కోట్లు, రాష్ట్రంలో 10 లక్షల కేసుల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయమూరులు రోజూ ఎన్ని కేసులు పరిష్కరిస్తున్నారో.. అంతకు రెట్టింపు స్థాయిలో కేసులు నమోదవుతున్నాయి. ఇక ప్రజలకు సత్వర న్యాయం ఎలా అందుతుంది? ఈ పరిస్థితులను అధిగమించేందుకు మధ్యవర్తిత్వం తోడ్పడుతుంది.'' అని జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ' జిల్లాస్థాయిల్లోనూ మీడియేషన్ సెంటర్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం. కుటుంబ వివాదాలు, భూ సమస్యలు, భార్యభర్తల గొడవలకు అక్కడే పరిష్కారం చూపిస్తే.. పెండింగ్ కేసుల భారం తగ్గే అవకాశం ఉంది' అని జస్టిస్ నవీన్‌రావు అభిప్రాయపడ్డారు. సింగపూర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ సెంటర్ చైర్మన్ జార్జి లిమ్ వర్చువల్‌గా మాట్లాడారు. అనంతరం జస్టిస్ చిల్లకూర్ సుమలత, జస్టిస్ అనుపమ చక్రవర్తి, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ వినోద్‌కుమార్‌లు అడిగిన ప్రశ్నలకు జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, జార్జి లిమ్ సమాధానం చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు, లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి(జడ్జి) గోవర్ధన్ రెడ్డి, జడ్జి రాధిక, హై కోర్టు రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు పాల్గొన్నారు.

రైతులెవరో తెలియదా రామోజీ?

మరీ ఇంత విషమా? వాస్తవాలు బయటికొస్తాయనే భయం కూడా లేదా రామోజీ రావు గారూ? మిల్లు ఆవరణలో వ్యాపారులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని కూడా... రైతుల దైన్యంగా మార్చేయగల దౌర్భాగ్యపు పాత్రికేయం ఇంకా ఈ రాష్ట్రానికి అవసరమా? ''మొద్దు నిద్ర'' అంటూ సోమవారం మీరు పతాక శీర్షికల్లో ప్రచురించిన వార్తలో నిజమెంత? ఆ ఫోటోలు నిజంగా రైతులవా? వాస్తవానికది పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లలోని కాశీ అన్నపూర్ణ రైసుమిల్లు ఆవరణలోని డ్రయింగ్ ప్లాట్‌ఫారమ్ ఫొటో. ధాన్యం వ్యాపారులు బొడ్డు మహేష్, మైలవరపు సాంబయ్య రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని ఇక్కడ ఆరబెట్టుకున్నారు. దీన్లో కొంత తడిసింది. దాన్ని డ్రయర్లో ఆరబెట్టుకుంటారు కూడా. అలాంటిది ఈ ఫొటోలు తీసి రైతులు ఆరబెట్టుకున్నట్లుగా... ప్రభుత్వమేమీ పట్టించుకోనట్లుగా రాసిన రాతలను ఏమనుకోవాలి? ఇక్కడి రైతులు రబీలో సాగుచేసే అంకూర్ సోనం, హెచ్ఎంటీ లాంటి ఫైన్ వెరైటీల 75 కిలోల బస్తా రూ.2 వేలకు పైగా పలుకుతోంది. వీటికి పొరుగు రాష్ట్రాల్లోనూ డిమాండ్ ఉంది. ఇద్దరు వ్యాపారులు కొని మిల్లు ఆవరణలోని ఆరబెట్టుకుంటే... తడిసినా ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ దుష్ప్రచారం చేయటాన్ని ఏమనుకోవాలి? మీ కథల్ని జనం నమ్మే రోజులు పోయాయని చిత్రపురి కోటలో కూర్చున్న మీకెప్పుడు తెలుస్తుంది? ఇంకెన్నాళ్లీ మొద్దునిద్ర రామోజీ!!

ఫ్యాక్ట్ చెక్
- వ్యాపారులు రైసు మిల్లు ఆవరణలో ఆరబెట్టుకుంటే ఏంటీ రాతలు?
- నిజాలు తెలిసి కూడా విస్మరిస్తూ ఇంకెన్నాళ్లు ఈ మొద్దునిద్ర?

3 లో


చల్లగుండ్లలోని రైసుమిల్లు ఆవరణలో ఉన్న డ్రయింగ్ ప్లాట్‌ఫారమ్‌పై వ్యాపారులు ఉంచిన ధాన్యాన్ని.. రైతులవిగా ప్రచారం చేసిన 'ఈనాడు'

దుర్గమ్మకు రూ.7.50 లక్షల ఆభరణాల సమర్పణ

- నిత్యాన్నదానానికి చెన్నై వాసి రూ.5 లక్షల విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు రూ.7.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు సమర్పించారు. హైదరాబాద్ ఏఎస్‌రావు నగర్‌కు చెందిన డి.వెంకట సత్యవాణి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి 104 గ్రాముల బంగారపు లక్ష్మీకాసుల హారం, 29 గ్రాముల బంగారపు పచ్చల నక్లెస్, 391 గ్రాముల వెండి పళ్లెం దేవస్థానానికి సమర్పించారు. వీటిని అమ్మవారి ఉత్సవాలలో ఉపయోగించాలని దాత కోరారు. కాగా, దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి చెన్నై ఇందిరానగర్‌కు చెందిన భోగరం వెంకట మార్కండేయ శర్మ కుటుంబం రూ.5 లక్షల విరాళాన్ని ఆలయ ఈవో భ్రమరాంబకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.


బంగారు ఆభరణాలను అర్చకులకు అందజేస్తున్న దాత వెంకట సత్యవాణి కుటుంబం


వైఎస్సార్ జిల్లా కడపలోని బాలాజీనగర్‌లో జాన్‌పాల్‌కు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ స్వర్ణకుమారి


కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీ-2లో దివ్యాంగుడు రంగన్నకు పింఛను అందజేస్తున్న వలంటీర్ అరుణజ్యోతి


తూర్పు గోదావరి జిల్లా పెదరాయవరంలో సుశీలకు పింఛను అందిస్తున్న వలంటీర్ కిషోర్


విజయనగరం కమ్మవీధిలో లక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ ఆదిలక్ష్మి


శ్రీకాకుళంలో హేమంత్‌కుమార్‌కు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ వేణుగోపాల్

వర్షంలోనూ జోరుగా పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం జోరు వర్షంలోనే పింఛన్ల పంపిణీ కొనసాగింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. సోమవారం తొలిరోజే 53,21,048 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, వివిధ రకాల చేతివృత్తిదారులు, పలు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.1,468.04 కోట్లను పింఛన్ల రూపంలో వలంటీర్లు అందజేశారు. మే ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 63,33,349 మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.1,747.38 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో పలుచోట్ల జోరుగా వర్షాలు కురుస్తున్నా ఒకటో తేదీనే 84.02 శాతం మందికి పంపిణీ పూర్తిచేసినట్లు సెర్ప్ అధికారులు చెప్పారు. విజయనగరం, చిత్తూరు జిల్లాల్లో తొలిరోజే 90 శాతం మందికి పంపిణీ పూర్తికాగా.. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 57.8 శాతం మందికి పంపిణీ పూర్తయినట్లు తెలిపారు. మరో నాలుగురోజులు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని వారు పేర్కొన్నారు.


తిరుపతి 27వ డివిజన్‌లో దివ్యాంగురాలు అరుణకు పింఛను అందజేస్తున్న వలంటీర్ మానస


ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో విజయదుర్గకు పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్ కుమారి


ఏలూరు కోటదిబ్బలో సూర్యకాంతమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ సుధారాణి


ఒంగోలులో కొండమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ శ్రావణి


అనంతపురం జిల్లా వెంకటాంపల్లి పెద్దతండాలో ఉపాధి పనుల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము ఇస్తున్న గ్రామ వలంటీర్ నాగరాజునాయక్


గుంటూరులో కావమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వార్డు వలంటీరు గీత

ఆ ఆనందమే ఆశీర్వచనం: మంత్రి వేణు

రామచంద్రపురం: ఓ పక్క జోరుగా వర్షం కురుస్తున్నా అవ్వాతాతలకు, ఇతర లబ్ధిదారులకు ఒకటో తేదీనే పింఛన్లు అందించడానికి.. తాను పాలకుడిని కాదు సేవకుడినని చెప్పే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ఆయన అందించిన సేవాసైన్యం వలంటీర్లే కారణమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో సోమవారం వైఎస్సార్ పింఛను కానుకను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీనే పింఛను సొమ్ము అందిస్తున్నప్పుడు లబ్ధిదారుల కళ్లలో కనిపించే ఆనందమే ముఖ్యమంత్రికి ఆశీర్వచనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్ కేతా శ్రీను, కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ నాయకులు గాధంశెట్టి శ్రీధర్, మల్లిడి సత్తిరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో పింఛన్ అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ


నెల్లూరు నగరం ఫత్తేఖాన్‌పేటలో శ్రీదేవమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ కార్తీక్

పెట్టుబడులు పెట్టండి

- భారత్‌లో యూఏఈ రాయబారి అబ్దుల్ నాసర్ అల్షాలితో సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, ప్రభుత్వం తరఫున ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారత్‌లో యూఏఈ రాయబారి అబ్దుల్‌నాసర్ అల్షాలికి చెప్పారు. భారత్‌లో యూఏఈ రాయబారి అబ్దుల్‌నాసర్ అల్షాలి సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల అవకాశాలపై ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామికంగా అనుసరిస్తున్న పారదర్శక విధానాలను సీఎం జగన్ వివరించారు. రాష్ట్రంలో సుశిక్షితులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫుడ్ పార్క్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, టూరిజం, హాస్పిటాలిటీ, గ్రీన్ హైడ్రోజన్, పోర్ట్‌లు, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లు, మౌలిక సదుపాయాల కల్పన వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి యూఏఈ రాయబారి తెలిపారు. ఏపీని పెట్టుబడులకు లీడ్ స్టేట్‌గా పరిగణిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే పెట్టుబడుల సదస్సులో చర్చించిన అంశాలపై ముందు ప్రభుత్వం తరఫున తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సీఎం స్పెషల్ సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, యూఏఈ రాయబార కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు మాతృ వియోగం

- నివాళులర్పించిన సీఎం వైఎస్ జగన్




ఎమ్మెల్యే మల్లాది విష్ణును పరామర్శిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఇన్‌సెట్లో) బాలాత్రిపుర సుందరమ్మ

సాక్షి,అమరావతి/గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాతృమూర్తి బాలాత్రిపురసుందరమ్మ (82) సోమవారం కన్నుమూశారు. ఆదివారం స్వల్ప అస్వస్థతకు గురైన ఆమెను నగరంలో ఆంధ్ర ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాసవిడిచారు. సీఎం వైఎస్ జగన్ విజయవాడ లబ్బీపేటలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని బాలాత్రిపురసుందరమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణును, కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. సీఎం వెంట మంత్రి జోగి రమేష్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఉన్నారు. ఎమ్మెల్యే మాతృమూర్తికి నివాళులర్పించిన వారిలో మంత్రి మేరుగు నాగార్జున, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీలు ఎండీ రుహుల్లా, మర్రి రాజశేఖర్, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కలెక్టర్ ఢిల్లీ రావు తదితరులున్నారు.

వలంటీర్‌పై టీడీపీ కార్యకర్తల దాడి

పథకాల గురించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాడని కక్ష.. పల్నాడు జిల్లా వినుకొండలో ఘటన


ఆస్పత్రిలో షేక్ అష్రాఫ్

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాడని కక్షగట్టిన టీడీపీ కార్యకర్తలు వలంటీర్‌పై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో అప్రమత్తంగా ఉండటంతో వలంటీర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి పల్నాడు జిల్లా వినుకొండలో జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వినుకొండ 5వ వార్డులో వలంటీర్ షేక్ అష్రాఫ్ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. దీన్ని సహించలేని టీడీపీ కార్యకర్తలు సీఎంను కించపరుస్తూ పోస్టులు పెట్టారు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదని వలంటీర్ అష్రాఫ్ టీడీపీ కార్యకర్తలకు సూచించాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు అతడితో సోషల్ మీడియాలోనే వాగ్వాదానికి దిగారు. ఆదివారం రాత్రి వలంటీర్ అష్రాఫ్, అతడి మిత్రుడు ఇమ్రాన్‌ఖాన్ మసీదుకు వెళ్లి వస్తుండగా టీడీపీ కార్యకర్తలు.. ఇమ్రాన్, షఫీ, సిద్దు, ఫారూఖ్, ఫరీద్, ఖాజాలు అష్రాఫ్ పై దాడికి దిగారు. షఫీ కత్తితో దాడి చేయడంతో వలంటీర్‌కు గాయాలయ్యాయి. అతడి మిత్రులు అష్రాఫ్‌ను వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఉన్నత' వైద్యం


వైద్య, ఆరోగ్య శాఖపై ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఆ వివరాలివీ..

సిబ్బందిపై ప్రతి సమీక్షలోనూ వివరాలివ్వాలి..

ప్రభుత్వాస్పత్రులను నాడు – నేడు ద్వారా తీర్చిదిద్దడం ద్వారా ప్రజల్లో భరోసా ఏర్పడింది. రోగుల తాకిడికి సరిపడా నియామకాలను చేపడితే సగం సమస్యలకు తెర పడుతుంది. మానవ వనరులపై ఆడిట్ నిర్వహించిన అనంతరం గుర్తించిన ఖాళీలను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా వెంటనే భర్తీ చేయాలి. అవసరం మేరకు డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. దీంతోపాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తూ ఎప్పటికప్పుడు మందులు సరిపడా స్టాక్ ఉండేలా చర్యలు చేపట్టాలి. సిబ్బంది ఎంతమంది ఉన్నారు? ఎన్ని ఖాళీలు ఉన్నాయి? అనే అంశాలపై ప్రతి సమీక్షలోనూ నాకు వివరాలు అందచేయాలి.

పకడ్బందీగా 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) అత్యంత పకడ్బందీగా అమలు కావాలి. నిర్దేశించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) మేరకు వైద్యులు గ్రామానికి వెళ్లి సేవలు అందించాలి. జీవనశైలి జబ్బుల బాధితులను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఫ్యామిలీ డాక్టర్ ఫలానా గ్రామానికి ఫలానా రోజు వస్తారనే వివరాలను ముందుగానే వెల్లడించాలి. ఆయా తేదీల్లో గ్రామానికి డాక్టర్ వస్తున్నట్లు ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రజలందరికీ తెలియచేయాలి. దీనివల్ల డాక్టర్ వద్దకు వచ్చి వైద్య సేవలు పొందగలుగుతారు. ఎఫ్‌పీసీని మెరుగ్గా ముందుకు తీసుకెళ్లేలా జిల్లాల్లో సమర్థులైన అధికారుల సేవలను వినియోగించుకోవాలి.

మూడున్నరేళ్లలో ప్రజారోగ్యం బలోపేతం ఇలా..

వైద్య సిబ్బంది	పోస్టుల భర్తీ
స్పెషలిస్ట్ వైద్యులు	3,899
మెడికల్ ఆఫీసర్లు	2,088
స్టాఫ్ నర్సులు	5,777
ఏఎన్‌ఎంలు	13,540
ఎంఎల్‌హెచ్‌పీలు	10,032
పారా మెడికల్ సిబ్బంది	9,751
డీఈవోలు	249
ఇతరులు	3,303

రక్తహీనత నివారణ.. నేత్ర పరీక్షలు

గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించడం ద్వారా రక్తహీనత సమస్యను ఎదుర్కోవాలి. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ద్వారా ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలి. రక్త హీనతతో బాధపడే గర్భిణులను గుర్తించి తప్పనిసరిగా పౌష్టికాహారం అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. విలేజ్ క్లినిక్స్ స్థాయిలోనే క్రమం తప్పకుండా కంటి పరీక్షలు కూడా నిర్వహించాలి. ఈ మేరకు కంటి డాక్టర్లకు షెడ్యూల్ రూపొందించి నెల, రెండు నెలలకు ఒకసారి నేత్ర పరీక్షలు చేయాలి. దృష్టి సంబంధిత సమస్యలున్న వారికి కంటి అద్దాలు ఇవ్వాలి.

ఎమర్జెన్సీ సీపీఆర్‌పై శిక్షణ

విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను (సీహెచ్‌వో) విధి నిర్వహణలో సుశిక్షితులుగా తయారు చేయాలి. ఇందుకోసం ప్రత్యేక కరిక్యులమ్‌ను సిద్ధం చేయాలి. సీహెచ్‌వోలకు సరఫరా చేసే వైద్య పరికరాల వినియోగంపై బోధనాసుపత్రుల్లో శిక్షణ ఇవ్వాలి. వాటిని సక్రమంగా వినియోగిస్తున్నారో లేదో సమీక్షించాలి. దంత సంరక్షణ, ఈఎన్‌టీ, వృద్ధాప్య సమస్యలతోపాటు సీపీఆర్ లాంటి అత్యవసర పరిస్థితుల్లో ఎలా వైద్య సేవలు అందించాలో శిక్షణ ఇప్పించాలి. వీటితోపాటు గ్రామాల్లో పాము కాట్లకు సంబంధించి వెంటనే చికిత్స అందించేలా శిక్షణ ఉండాలి.

పూర్తిగా అదుపులో కోవిడ్

రాష్ట్రంలో కరోనా పూర్తిగా అదుపులో ఉందని, గత వారం రోజుల్లో నమోదైన పాజిటివ్ కేసులను బట్టి దేశంలో 23వ స్థానంలో ఉందని అధికారులు తెలిపారు. 24 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా ఫీవర్ సర్వేను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విలేజ్ క్లినిక్‌లో 20 ర్యాపిడ్ టెస్ట్ కిట్‌లను అందుబాటులో ఉంచామన్నారు. 14 ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లు పని చేస్తున్నాయన్నారు. విదేశాల నుంచి వచ్చే వారికి ఎయిర్‌పోర్టుల్లో టెస్టులు చేస్తున్నామని, మందులు, మాస్కులు, పీపీఈ కిట్‌లు, ఆక్సిజన్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని వెల్లడించారు. సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిర ప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ మురళీధర్‌రెడ్డి, ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్, డీఎంఈ డాక్టర్ నరసింహం, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, నాడు–నేడు టెక్నికల్ డైరెక్టర్ మనోహరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23 రోజుల్లో 20.25 లక్షల మందికి వైద్య సేవలు

ఏప్రిల్ 6వ తేదీన ఫ్యామిలీ డాక్టర్ విధానం పూర్తి స్థాయిలో ప్రారంభం కాగా గత నెల 28 నాటికి గ్రామాల్లో 20,25,903 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. రక్తపోటుతో 4.86 లక్షల మంది, మధుమేహంతో 2.70 లక్షల మంది బాధ పడుతుండగా 4.43 లక్షల మంది ఈ రెండు రకాల సమస్యలు ఎదుర్కొంటున్నట్లు గుర్తించి ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వైద్యం, మందులు అందజేస్తున్నామన్నారు. నోటి క్యాన్సర్ బాధితులు 4,649 మంది, ఛాతీ క్యాన్సర్ బాధితులు 1,761 మంది, గర్భాశయ క్యాన్సర్ బాధితులు 7,042 మంది గ్రామాల్లోనే వైద్య సేవలు పొందినట్లు వెల్లడించారు.

5 కొత్త మెడికల్ కాలేజీలు ఈ ఏడాదే

రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుపై సీఎం జగన్ తాజాగా సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,185 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో ఏకంగా మరో 2,100 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి రానున్నట్లు అధికారులు వివరించారు. 2023–24 విద్యాసంవత్సరంలో విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలోని కొత్త మెడికల్ కళాశాలల్లో తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. తద్వారా 750 సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. 2024–25లో మరో 350 మెడికల్ సీట్లు అదనంగా రాబట్టేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. 2025–26 విద్యా సంవత్సరంలో పిడుగురాళ్ల, బాపట్ల, మదనపల్లె, పెనుకొండ, పాలకొల్లు, మార్కాపురం, నర్సీపట్నం, అమలాపురం, పార్వతీపురంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల్లో తరగతులు మొదలయ్యేలా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. తద్వారా మరో 1,000 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు.

కార్మికుల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

కార్మిక సోదరులకు సీఎం జగన్ మే డే శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: కార్మికుల సంక్షేమం మన ప్రభుత్వ లక్ష్యం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నిరంతరం సమాజ హితమే ధ్యేయంగా శ్రమించే కార్మిక సోదరులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక సోదరులారా.. మీ శ్రమ అమూల్యం. మీరు సేవానిధులు. ఒక దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే మీరే కీలకం.. అంటూ సోమవారం ఆయన ట్వీట్ చేశారు.

తుని రైలు దహనం కేసు కొట్టివేత

ముద్రగడ పద్మనాభంతో పాటు 41 మందికి ఊరట

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తుని రైల్వే స్టేషన్ సమీపంలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు దహనం కేసులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతో పాటు 41 మందిని నిరపరాధులుగా పేర్కొంటు ఆర్‌పీఎఫ్ పోలీసులు వారిపై పెట్టిన కేసును కొట్టివేస్తున్నట్లు విజయవాడ రైల్వే న్యాయమూర్తి తీర్పువెలువరించారు. 2016 జనవరి 31న ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో తునిలో తలపెట్టిన కాపు గర్జన బహిరంగ సభ హింసాత్మకంగా మారింది. ఆ సమయంలో అటుగా వస్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును కొంత మంది నిలిపివేసి దహనం చేశారు. ఈ ఘటనపై ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేసి ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాతో పాటు మొత్తం 41 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారు 24 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ముద్దాయిలు నేరం చేసినట్లు ఎక్కడా ఆధారాలతో నిరుపించలేకపోవడంతో వారిని నిరపరాధులుగా భావించి కేసును డిస్మిస్ చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ముగ్గురు తుని ఆర్‌పీఎఫ్ అధికారులు సరైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని తీర్పులో వెల్లడించారు.

యువకుడికి రూ.లక్ష ఆర్థిక సాయం


గత నెల 26న అనంతపురంలో సీఎంను కలిసిన హర్షవర్ధన్


హర్షవర్ధన్‌కు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఎం.ప్రేమహర్షవర్ధన్‌కు కలెక్టర్ ఎల్.శివశంకర్ రూ.లక్ష చెక్కు అందజేశారు. హర్షవర్ధన్ గత నెల 26న అనంతపురంలో సీఎం జగన్ నిర్వహించిన జగనన్న వసతి దీవెన సభకు వెళ్లి ముఖ్యమంత్రిని కలిసి తాను పడుతున్న ఇబ్బందులను వివరించి ఆదుకోవాలని వేడుకున్నాడు. స్పందించిన ముఖ్యమంత్రి బాధితుడ్ని ఆదుకోవాలని, వైద్యసేవలు అందేలా చూడాలని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వివరాలను పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి తక్షణ సాయంగా రూ.లక్ష చెక్కును బాధితుడికి సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. హర్షవర్ధన్ గుండెలో పేస్‌మేకర్ అమర్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూఅధికారి కె.వినాయకం, జిల్లా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్. సునీల పాల్గొన్నారు.

థాయ్‌లాండ్‌లో చిక్కిన చీకోటి

పటాయాలో అక్రమంగా గ్యాంబ్లింగ్ డెన్ నిర్వహిస్తుండగా పట్టుకున్న థాయ్ పోలీసులు

- లకోటి, అతని ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి సహా ఆరుగురి అరెస్ట్
- పేకాట ఆడుతున్న 83 మంది భారతీయులు అదుపులోకి.. జరిమానా అనంతరం విడుదల
- రూ.16 లక్షల భారత కరెన్సీ, రూ. 20 కోట్ల విలువైన గేమింగ్ చిప్స్ స్వాధీనం
- పట్టుబడ్డ వారిలో మెదక్ డీసీసీబీ చైర్మన్ సహా తెలంగాణ, ఏపీకి చెందిన ప్రముఖులు


చీకోటి ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్/సిద్దిపేట: థాయ్‌లాండ్‌లోని పటాయాలో అక్రమంగా కెసినో నిర్వహిస్తున్న ఆరోపణలపై హైదరాబాద్‌కు చెందిన చీకోటి ప్రవీణ్‌తోపాటు అతడి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డిని అక్కడి చోన్బూరీ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అలాగే ఈ దందాకు సహకరించిన థాయ్ మహిళ సిత్రానన్ కొల్వర్‌తోపాటు మరో ముగ్గురినీ కటకటాల్లోకి పంపారు. పటాయాలోని బంగ్ లమూంగ్ జిల్లా చోన్బూరీ ప్రావెన్సీలో ఉన్న ఆసియా హోటల్‌లోని ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై అక్కడి పోలీసులు సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో (అక్కడి కాలమానం ప్రకారం) దాడి చేశారు. మొత్తం 94 మందిని అదుపులోకి తీసుకోగా వారిలో చీకోటి ప్రవీణ్, మాధవరెడ్డితోపాటు మరో 83 మందిని భారతీయులుగా గుర్తించారు. వారిలో అత్యధికులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారేనని, 14 మంది మహిళలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కెసినో నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ప్రవీణ్, మాధవరెడ్డి, సిత్రానన్ సహా ఆరుగురిని మాత్రమే అరెస్టు చేశారని, పేకాట రాయుళ్లకు కౌన్సెలింగ్ చేసి, జరిమానా వేసి పంపినట్లు థాయ్ మీడియా ప్రకటించింది.

ఒక్కొక్కరి నుంచి రూ. 4 లక్షలు వసూలు చేసి...

థాయ్‌లాండ్‌లో కెసినోల నిర్వహణకు అనుమతి ఉన్నప్పటికీ ఒకేసారి పెద్ద మొత్తంలో ఆర్జించాలని భావించిన చీకోటి, మాధవరెడ్డి... థాయ్ మహిళ సిత్రానన్‌తో కలసి అక్రమంగా కెసినో నిర్వహణకు పథకం వేశారు. అనేక మంది పేకాటరాయుళ్లతో (పంటర్లు) ఒప్పందాలు కుదుర్చుకొని వారి నుంచి హైదరాబాద్‌లో ప్రాథమిక మొత్తంగా రూ. 4 లక్షల చొప్పున వసూలు చేశారు. గత నెల 26న హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో తీసుకువెళ్లిన వారికోసం పటాయాలోని ఆసియా హోటల్‌లో గత నెల 27 నుంచి సోమవారం వరకు గదులు బుక్ చేశారు. అదే హోటల్‌లో శాంపోయ్ పేరుతో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌ను అద్దెకు తీసుకున్నారు. అందులోనే అక్రమంగా కెసినో కేంద్రం ఏర్పాటు చేశాడు. దీని నిర్వహణకు సిత్రానన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ప్రవీణ్... ఒక్కో పంటర్‌కు రూ. 50 వేలు చెల్లించాడు. హైదరాబాద్ నుంచే తీసుకువెళ్లిన గేమింగ్ చిప్స్ అందించి పేకాట ఆడిస్తున్నాడు. ఈ క్యాంప్ ముగిశాక హైదరాబాద్ వచ్చాకే నగదు లావాదేవీలు చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇలా చేస్తే ఫెమా వంటి సెక్షన్ల కింద నమోదయ్యే ఈడీ కేసుల నుంచి తప్పించుకోవచ్చని ప్రవీణ్ పథకం వేశాడు. ఐదు రోజులపాటు జరిగిన ఈ పేకాట శిబిరంలో రూ. కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలిసింది. సోమవారం దాడి చేసిన పోలీసులు రూ. 16 లక్షల విలువైన భారత కరెన్సీ, రూ. 20 కోట్ల విలువైన గేమింగ్ చిప్స్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పట్టుబడిన పంటర్లలో మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నట్లు తెలిసింది. థాయ్‌లాండ్‌లో ప్రవీణ్ అండ్ గ్యాంగ్ అరెస్టు విషయం తెలిసిన హైదరాబాద్ పోలీసులతోపాటు నిఘా వర్గాలు, ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

క్లుప్తంగా...

కళలు, సంప్రదాయాలతో జాతీయ సమగ్రత

గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



గవర్నర్‌ను సన్మానిస్తున్న గుజరాత్, మహారాష్ట్ర సమాజ్‌ల ప్రతినిధులు

సాక్షి, అమరావతి: 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్' అనే నినాదం దేశ సమగ్రతను మరింతగా పెంపొందించేందుకు దోహదపడుతుందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆవిర్భావ దినోత్సవాలను దేశంలోని ప్రతి రాజ్‌భవన్‌లో నిర్వహించాలనే నిర్ణయం ముదావహమన్నారు. గుజరాత్, మహారాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు రాష్ట్రాల మధ్య వారధిగా వ్యవహరిస్తూ సమగ్రతను పటిష్టం చేస్తున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుజరాతీలు, మహారాష్ట్ర వాసులు రాష్ట్ర అభివృద్ధి, సామాజికసేవ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని గవర్నర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజరాత్, మహారాష్ట్ర సమాజ్‌ల ప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్‌గా లక్ష్మీషా



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్‌గా లక్ష్మీషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీగా పనిచేస్తున్న లక్ష్మీషాను ప్రభుత్వం ఇటీవల గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతల్లో నియమించిన విషయం తెలిసిందే. అదనపు డైరెక్టర్ భావన వశిష్ట నుంచి లక్ష్మీషా బాధ్యతలు స్వీకరించారు.

పబ్లిక్ సర్వీసు కమిషన్ సభ్యురాలిగా సెలీనా

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా గుంటూరుకు చెందిన డాక్టర్ బీఎస్ సెలీనాను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. సెలీనా గుంటూరు ఏసీ కాలేజీ పూర్వపు ప్రిన్సిపాల్ బి.చంద్రపాల్ కుమార్తె. ఆమె డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అకడమిక్ విభాగంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇంగ్లిషులో డాక్టరేట్ డిగ్రీ కలిగి ఉన్నారు. తనను కమిషన్ సభ్యురాలిగా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సెలీనా కృతజ్ఞతలు తెలిపారు.

ఇది కార్మిక పక్షపాత ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా కార్మిక దినోత్సవం



కార్మికురాలికి కేక్ తినిపిస్తున్న అప్పిరెడ్డి

సాక్షి, అమరావతి: తమది కార్మిక పక్షపాత ప్రభుత్వమని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్మికులతో కలిసి అప్పిరెడ్డి కేక్ కట్ చేశారు. కార్మికులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పేరులోనే శ్రామికులను చేర్చిన ఘనత తమ పార్టీదని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా శ్రమకు తగిన వేతనాలు అందేలా సీఎం జగన్ పెద్ద మనసుతో నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు నత్తా యోనారాజు, రవికుమార్, పరిశపోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రభుత్వం

కార్మిక శాఖ కమిషనర్ శేషగిరిబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతోందని కార్మిక శాఖ కమిషనర్ ఎం.వి.శేషగిరిబాబు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం 'మే' డేను పురస్కరించుకుని రాష్ట్రంలోని కార్మికులకు శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని కోట్ల మంది కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం పునరంకితం అవుతోందన్నారు. మే డే ఒక చరిత్రాత్మక చైతన్య దినమని కొనియాడారు.

'రైతుల నుంచి అంకూర్ సోనం రకం 400 బస్తాల ధాన్యాన్ని రెండు నెలల క్రితం కొన్నా. రైసు మిల్లు ఆవరణలో ఆరబెట్టుకుంటే ఫొటోలు తీసి రైతులవి అంటూ ఈనాడు పత్రికలో వేయటాన్ని చూసి ఆశ్చర్యపోయాం. వర్షాలకు పైపొర మాత్రమే తడిసింది. బస్తాల్లోకి ఎక్కించి సురక్షిత ప్రాంతాలకు పంపించాం. డ్రయ్యర్‌లో వేస్తాం. మాకు ఇబ్బందేమీ లేదు. ఉందని ఎవరితోనూ చెప్పలేదు కూడా!' – బొడ్డు మహేష్‌రెడ్డి, ధాన్యం వ్యాపారి

'100 బస్తాలు కొని రైసు మిల్లు ఆవరణలోని డ్రైయింగ్ ప్లాట్‌ఫారమ్ వద్ద కూలీల సాయంతో ఆరబెట్టాం. ఆరబెట్టేందుకు బస్తాకు రూ.15 చొప్పున అద్దె చెల్లించాం. 10 శాతమే తడిసింది. డ్రయ్యర్‌లో వేస్తాం. ఇందుకోసం బస్తాకి రూ.100 ఖర్చవుతుంది. మేం నష్టపోయే పరిస్థితులైతే లేవు' – మైలవరపు సాంబయ్య, ధాన్యం వ్యాపారి

రైతులెవరో తెలియదా రామోజీ?

వ్యాపారులు రైసు మిల్లు ఆవరణలో ఆరబెట్టుకుంటే ఏంటీ రాతలు?

నిజాలు తెలిసి కూడా విస్మరిస్తూ ఇంకెన్నాళ్లు ఈ మొద్దునిద్ర?

- ఐదేళ్లలో రైతులకు చంద్రబాబు ఎగ్గొట్టింది రూ.5,942 కోట్లు
- దానిపై ఏనాడూ ఒక్క అక్షరం కూడా రాయని 'ఈనాడు'
- ఒక్క ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలే రూ.2,558 కోట్లు
- వైఎస్సార్ సీపీ వచ్చాక రూ.2,890.85 కోట్ల బకాయిలు చెల్లింపు
- నాలుగేళ్లలో 22.22 లక్షల మందికి రూ.1,911 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ
- సీజన్ ముగియకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదే
- గత నెలలో అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులకు ఈ నెలలోనే పరిహారం
- రాష్ట్రంలో ఎక్కడా కిలో రూ.6కి తగ్గని టమోటా
- కనీస మద్దతు ధర కంటే మిన్నగానే మొక్కజొన్న
- అయినా సరే... అబద్ధాలను నిజాలుగా చూపిస్తూ ఎల్లో దుష్ప్రచారం



వ్యాపారులు బొడ్డు మహేష్‌రెడ్డి, సాంబయ్యలు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం అరబెట్టుకునేందుకు పల్నాడు జిల్లా నకరికల్ మండలం చల్లగుండ్లలో అద్దెకు తీసుకున్న కాశీ అన్నపూర్ణ రైస్ మిల్లు ఆవరణలోని డ్రయింగ్ ప్లాట్‌ఫారం



రైతుల ధాన్యం తడిసిపోయిందని ఈనాడులో ప్రచురించిన ఫొటో

సాక్షి, అమరావతి: నిన్న వర్షం కురిస్తే.. ఈ రోజుకల్లా నష్ట పరిహారం ఇవ్వాలంటూ గగ్గోలు పెడుతోంది ఈనాడు! పంట నష్టం అంచనాలతో పనిలేకుండా క్షణాల్లో పరిహారం ఇవ్వాలంటూ తప్పుడు కథనాలు ప్రచురించటాన్ని... అసలు వర్షం కురవడమే ఈ ప్రభుత్వ వైఫల్యం అన్నట్లుగా బురద జల్లటాన్ని ఏమనుకోవాలి? వర్షాలు, వరదలు, తుపాన్లు.. విపత్తు ఏదైనా ఆగమేఘాలపై స్పందిస్తూ నష్ట పోయిన ప్రతి ఎకరాకు, దెబ్బతిన్న ప్రతీ రైతన్నకూ సీజన్ ముగియకుండానే పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. పైసా కూడా బకాయి పెట్టకుండా అర్హులెవరైనా మిగిలిపోతే వెతికి మరీ లబ్ధి చేకూరుస్తోంది.

లెక్క తెలియదా రామోజీ?.. 37,371 మందికి రూ.34.25 కోట్లు

పంట నష్ట పరిహారాన్ని (ఇన్‌పుట్ సబ్సిడీ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిర్ణయాన్ని బట్టి పంటల వారీగా నిర్ణయిస్తారు. ఏదైనా వైపరీత్యం సంభవిస్తే తొలుత పంటల వారీగా ప్రాథమిక అంచనా వేస్తారు. తర్వాత క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం నిబంధనల మేరకు 33 శాతానికి పైగా మునిగిపోయి దెబ్బతిన్న పంటలను పరిగణనలోకి తీసుకొని తుది అంచనాలను రూపొందిస్తారు. అదే కరువు కాటకాల వేళ.. వర్షపాతం, డ్రై స్పెల్స్, భూగర్భ జలాలు, రిజర్వాయర్ల నీటి నిల్వల సూచిక, పంట దిగుబడి, పంట నష్టం లాంటి ప్రామాణికాల ఆధారంగా కరువు మండలాలను ప్రకటించి తదనుగుణంగా పరిహారాన్ని లెక్కిస్తారు. ఇప్పుడు రబీ పంటలు చేతికొచ్చే వేళ అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఇది ఎవరూ ఆపలేని వాస్తవం! గత నెలలో వర్షాల వల్ల నష్టపోయిన 37,371 మంది రైతులకు మే నెలలో రూ.34.25 కోట్లు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంట నష్టాన్ని అంచనా వేసేందుకు బృందాలు రంగంలోకి దిగాయి.

బాబు ఎగ్గొట్టిన బకాయిలు రూ.5,942 కోట్లు

చంద్రబాబు హయాంలో కరువొచ్చినా.. వరదలొచ్చినా.. అకాల వర్షాలతో రైతులు పంట నష్టపోతే రెండేళ్ల తర్వాత కానీ పరిహారానికి దిక్కులేని దుస్థితి. 2014–15లో కర్నూలు జిల్లాలో అక్టోబర్, డిసెంబర్‌లో వర్షాలు కురిస్తే 2016 జూలైలో అంటే దాదాపు రెండేళ్ల తర్వాతగానీ కరుణించలేదు. అది కూడా అరకొరగానే పంట నష్టపరిహారం అందించారు. 2014లోనే కర్నూలు జిల్లాలో కరువు వస్తే 2017లో కరువు భృతినిచ్చారు. 2015 ఏప్రిల్‌లో అకాల వర్షాలు పడితే ఏడాది తర్వాత అంటే 2016 ఆగస్టులో పరిహారాన్నిచ్చారు. 2015లో కరువు వస్తే నవంబర్ 2016లో భృతినందించారు.

అనంతపురం జిల్లాలో 2018 ఖరీఫ్‌లో భారీగా పంట నష్టం జరిగితే పూర్తిగా ఎగ్గొట్టారు. ఐదేళ్లలో 24.80 లక్షల మందికి రూ.2,558.07 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఎగ్గొట్టిన ఘన చరిత్ర చంద్రబాబుది. ఒక్క ఇన్‌పుట్ సబ్సిడీనే కాకుండా బాబు ఐదేళ్ల పాలనలో సబ్సిడీ విత్తనాలకు సంబంధించి రూ.282.71 కోట్లు, సున్నా వడ్డీ పంట రుణ రాయితీ రూ.1,180.66 కోట్లు, పంటల బీమా పరిహారం రూ.715.84 కోట్లు, ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.23.70 కోట్లు, యాంత్రీకరణ కోసం రూ.221.07 కోట్లు, ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.960 కోట్లు కలిపి ఏకంగా రూ.5,942.05 కోట్లు ఎగ్గొడితే ఈనాడు సింగిల్ కాలం వార్త రాసిన పాపాన పోలేదు. ఈ బకాయిల్లో ఇప్పటికే 46.17 లక్షల మంది రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2,890.85 కోట్లు చెల్లించింది. వీటితో పాటు చంద్రబాబు ఎగ్గొట్టిన వ్యవసాయ విద్యుత్ బకాయిలు రూ.8,845 కోట్లు కూడా ఈ ప్రభుత్వం వచ్చాకే చెల్లించింది.

టమాటా క్వింటాల్ రూ.530 పైమాటే

టమాటాలకు ధర లేక రైతులు గగ్గోలు పెడుతున్నారంటూ ఈనాడు కుళ్లు రాతలు రాస్తోంది. రాష్ట్రంలో ప్రధాన మార్కెట్లైన కలికిరి, వాల్మీకిపురం, ములకలచెరువు, మదనపల్లి, పలమనేరు, వి.కోట, పుంగనూరు మార్కెట్లలో తాజాగా టమాటా కనిష్ట ధర క్వింటా రూ.530 – రూ.540 ఉండగా గరిష్ఠంగా రూ.670 – రూ.700 పలుకుతోంది. ఉల్లిపాయలు కూడా కనిష్ఠంగా క్వింటాల్ రూ.540 ఉండగా గరిష్ఠంగా రూ.780 పలుకుతోంది. గత నెల రోజులుగా ఏ మార్కెట్‌లోనూ ఫైన్ క్వాలిటీ టమాటాను కిలో రూ.2 చొప్పున అమ్ముకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ధరలు పతనమైన ప్రతీసారి మార్కెట్‌లో జోక్యం చేసుకుంటూ రూ.1.28 కోట్ల విలువైన 1,425 టన్నుల టమాటాను సేకరించింది. మొక్కజొన్న గత మూడేళ్లుగా ఎమ్మెస్పీకి మించి ధర పలుకుతోంది. క్వింటా ఎమ్మెస్పీ రూ.1,962 కాగా ప్రస్తుతం మార్కెట్‌లో ఫైన్ క్వాలిటీ మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,500 పలుకుతోంది. మార్కెటింగ్ శాఖ నిత్యం సీఎం యాప్ ద్వారా ధరలను పర్యవేక్షిస్తోంది. ఈ ఏడాది 16.63లక్షల టన్నుల దిగుబడులు అంచనా వేయగా ఇప్పటికే 60 శాతానికి పైగా మార్కెట్‌లోకి వచ్చింది. టీడీపీ హయాంలో రూ.427.10 కోట్ల విలువైన 3.19 లక్షల టన్నుల మొక్కజొన్న మాత్రమే సేకరించగా, గత నాలుగేళ్లలో ఏకంగా రూ.2,020.52 కోట్ల విలువైన 9.13 లక్షల టన్నులు సేకరించడం గమనార్హం. ఇప్పటికే ఎమ్మెస్పీ కంటే తక్కువగా ఉన్న శనగలు కొనుగోలు చేస్తుండగా పసుపు కొనుగోలుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి.

టీడీపీ హయాంలో ఎగ్గొట్టిన ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.కోట్లలో)

సంవత్సరం	రైతులు	ఇన్‌పుట్ సబ్సిడీ
2014-15	23,333	27.10
2015-16	3,63,998	268.36
2016-17	27,547	10.31
2017-18	12,934	13.73
2018-19	20,52,173	2,238.57
మొత్తం	24,79,985	2,558.07

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చెల్లించిన ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.కోట్లలో)

విపత్తు సమయం	చెల్లించిన సమయం	రైతులు (లక్షల్లో)	చెల్లించిన ఇన్‌పుట్ సబ్సిడీ
2019-20 (వరదలు, భారీ వర్షాలు)	26-04-2020	1.57	123.70
2020 ఏప్రిల్- సెప్టెంబర్ (వరదలు-భారీ వర్షాలు)	27-10-2020	1.74	146.20
2020 అక్టోబర్ (వరదలు-భారీ వర్షాలు)	17-11-2020	1.97	132.60
2020 నవంబర్ (నివర్ తుపాన్)	29-12-2020	8.34	646
2021 సెప్టెంబర్ (గులాబ్ తుపాన్)	16-11-2021	0.35	22.1
2021 నవంబర్ (వరదలు-భారీవర్షాలు)	15-02-2022	5.97	542.10
2022 ఆగస్టు-సెప్టెంబర్ (వరదలు-భారీ వర్షాలు)	28-11-2022	0.46	39.40
2022 డిసెంబర్ (మాండూస్ తుపాన్	28-02-2023	0.91	77.00
పాత బకాయిలు 2018 అక్టోబర్ (తిత్లీ తుపాన్ బాధితులకు అదనపు పరిహారం)	28-06-2022	0.91	182.60
మొత్తం		22.22	1,911.81

జగన్ పాలనలో ఏ సీజన్ లో పరిహారం.. ఆ సీజన్‌లోనే

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి పరిహారాన్ని అదే సీజన్ ముగిసేలోగా అంటే రెండు నెలల వ్యవధిలోనే అందిస్తున్నారు. 2019లో వరదలొస్తే ఏప్రిల్ 2020లో రైతులకు పరిహారం అందించారు. 2020 ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు అదే ఏడాది అక్టోబర్‌లో పరిహారాన్ని జమ చేశారు. అక్టోబర్ 2020లో కురిసిన వర్షాలకు సంబంధించి నవంబర్‌లో చెల్లించారు. 2020 నవంబర్‌లో నివర్ తుపాన్ వల్ల దెబ్బతిన్న రైతులకు డిసెంబర్‌లో పరిహారం అందించారు. తిత్లీ తుపాన్ సమయంలో సంభవించిన నష్టపరిహారాన్ని చంద్రబాబు ఎగ్గొడితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి ప్రభుత్వ పరంగా రూ.182 కోట్లు రైతులకు పంపిణీ చేశారు. 2022 డిసెంబర్‌లో మాండూస్ తుపాన్ బాధిత రైతులకు 2023 ఫిబ్రవరిలో పరిహారం అందించారు. టీడీపీ సర్కారు ఎగ్గొట్టిన బకాయిలతో కలిపి ఈ నాలుగేళ్లలో వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న 30.86 లక్షల ఎకరాలకు సంబంధించి 22.22 లక్షల మంది రైతులకు రూ.1,911.81 కోట్లు చెల్లించింది. రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.6,684.84 కోట్ల పరిహారం అందించిన ఘనత ఈ ప్రభుత్వానిదే.

కుండపోత

▶ మొదటి పేజీ తరువాయి

వైఎస్సార్ జిల్లాలో 36.91, తూర్పు గోదావరి జిల్లాలో 35.47, ప్రకాశం జిల్లాలో 34.44, మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

- నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని ముత్తుకూరు, ఇందుకూరుపేట, కావలి, ఆత్మకూరు, అనంతసాగరం, కలువాయి తదితర మండలాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది.
- ఉమ్మడి విశాఖ జిల్లా అంతటా కూడా సోమవారం వర్షాలు కురిశాయి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కుండపోత కురిసింది. పాడేరు, అరకులోయ ప్రాంతాలలో మ.12 గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. అల్లూరి జిల్లా వ్యాప్తంగా 182.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. విశాఖ నగరం, అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూడా మధ్యాహ్నం వరకు వర్షాలు కురిశాయి.

ఎక్కువ వర్షం కురిసిన మండలాలు..

ఆదివారం దర్శి, త్రిపురాంతకం, కర్నూల్ అర్బన్, ప్రొద్దుటూరు, మాచర్ల, విస్సన్నపేట, వీరులపాడు, చెన్నూరు, గాలివీడు, చాగలమర్రి, నంబులిపులికుంట, పొదిలి, శ్రీశైలం, గుడివాడ, కర్నూలు రూరల్, బుట్టాయగూడెం, జుపాడు బంగ్లా, అమలాపురం, నందికొట్కూరు, పెదపారుపూడి, కొయ్యలగూడెం, ఎ.కొండూరు, కొనకనమిట్ల, కృష్ణగిరి, హనుమంతుపాడు మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైంది. ప్రకాశం జిల్లా దర్శి మండలంలో 24 గంటల్లో 172.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లాలో ఒక్క పెద్దకడుబూరు మినహా అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా వివిధ ప్రాంతాల్లోని పంట పొలాల్లో నీళ్లు నిలిచాయి. దిగుబడులు కాపాడుకునేందుకు పట్టాలు కప్పి రైతులు జాగ్రత్తపడుతున్నారు. కాగా, అనంతపురం జిల్లాలో పెద్దవడుగూరులోని పందుల వాగులో ముగ్గురు చిక్కుకున్నారు. తెల్లవారుజాము రెండు గంటల ప్రాంతంలో వీరు ఆటోలో ప్రయాణిస్తుండగా భారీ వర్షాలకు పొంగిపొర్లుతున్న ఈవాగులో ఆటో మొరాయించింది. దీంతో ఆటో కొట్టుకుపోతుండగా ఆ ముగ్గురూ నీటిలోకి దూకారు. వారూ కొట్టుకుపోతుండగా మధ్యలో ఓ కంపచెట్టు అందడంతో దానిని పట్టుకుని నిల్చుండిపోయి స్నేహితులకు సమాచారమిచ్చారు. జేసీబీ సాయంతో పోలీసులు గంటన్నరపాటు శ్రమించి వారిని రక్షించారు.

మరో 3 రోజులు భారీ వర్షాలు



నెల్లూరు నగరంలో కురుస్తున్న వర్షం

తూర్పు విదర్భ నుండి ఉత్తర తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంవల్లే ఈ వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో మరో మూడ్రోజులు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇక మంగళవారం పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశమున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు.

రజనీకాంత్‌ను విమర్శించడం తగదు: చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ శతజయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయనతో తనకున్న అనుభవాలను పంచుకున్న రజనీకాంత్‌పై వైఎస్సార్‌సీపీ చేస్తున్న విమర్శలు అభ్యంతరకరమని ప్రతిపక్ష నేత చంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంలో ఎంతో గౌరవం ఉండే రజనీకాంత్ వంటి లెజెండరీ పర్సనాలటీపైన నీచవ్యాఖ్యలు అందరికీ బాధ కలిగిస్తున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ గురించి ఆయన చిన్న విమర్శ కూడా చేయలేదని, ఎవరినీ చిన్నమాట అనలేదని, పలు అంశాలపై ఆయన అభిప్రాయాలు మాత్రమే పంచుకున్నారని పేర్కొన్నారు. అయినా ఆయనపై చేస్తున్న అర్థంలేని విమర్శలను తెలుగు ప్రజలు సహించరని తెలిపారు. శిఖరం లాంటి వ్యక్తిత్వం కలిగిన రజనీ క్యారెక్టర్‌పై విమర్శలు ఆకాశంపై ఉమ్మి వేయడమేనని పేర్కొన్నారు. జరిగిన దానికి క్షమాపణ చెప్పి తమ తప్పు సరిదిద్దుకోవాలని కోరారు. కాగా, వర్షాల కారణంగా చంద్రబాబు తిరుపతి జిల్లా పర్యటన వాయిదా పడింది. తిరుపతి జిల్లాలో మంగళవారం నుంచి 3 రోజులు జరగాల్సిన పర్యటనను 4, 5, 6 తేదీలకు వాయిదా వేసినట్లు టీడీపీ నేతలు తెలిపారు.

రైతులను అడ్డం పెట్టి రామోజీ గలీజు రాతలు

- అకాల వర్షాలు తగ్గిన తర్వాత నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకుంటాం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'ఈనాడు రామోజీరావు రైతుల పేరుతో గలీజు రాతలు రాసి తన నిజస్వరూపాన్ని ప్రదర్శించుకుంటున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాయడం రామోజీకి ఆనవాయితీగా మారింది.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో వ్యవసాయాన్ని ప్రధానంగా గుర్తించి రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో రైతులకు అన్ని రకాలుగా దాదాపు రూ.5,942 కోట్లు ఎగవేశారని చెప్పారు. బాబు హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న 474 రైతు కుటుంబాలకు రూ.23.70 కోట్లు ఎగ్గొట్టిపోతే, సీఎం వైఎస్ జగన్ మానవతా దృక్పథంతో ఆ మొత్తాన్ని అందించి ఆయా రైతుల కుటుంబాలను ఆదుకున్నారని వివరించారు. బాబు హయాంలో కరువు వచ్చినా, వరదలొచ్చినా అకాలవర్షాలు కురిసి పంట నష్టపోయినా ఆ సీజన్ ముగిసేలోపు ఎప్పుడూ పరిహారం ఇవ్వలేదని, రెండేళ్ల తర్వాత పరిహారం అందించేవారన్నారు. తమ ప్రభుత్వం ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి ఆ సీజన్‌లోనే పరిహారం అందజేస్తోందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో అకాలవర్షాలు కురుస్తున్నాయని, తగ్గాక ప్రభుత్వ యంత్రాంగం పంట నష్టాన్ని పరిశీలించి అంచనాలు తయారు చేస్తుందన్నారు. ఆ వెంటనే రైతులను ఆదుకుంటామని స్పష్టంచేశారు. బాబును భుజాన వేసుకుని మోస్తున్న పచ్చమీడియా ఇప్పటికైనా కళ్లు తెరిచి వాస్తవాలను రాస్తే బాగుంటుందని హితవుపలికారు.

ఇప్పుడేమంటావ్ చంద్రబాబూ..

- ఎస్సీ సంక్షేమంలో ఏపీ నంబర్ వన్ అని కేంద్ర గణాంకాలు తేల్చాయి
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: 'ఎస్సీ సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే ఎదురు లేదనే విషయం నిరూపణ అయింది. ఈ విషయాన్ని స్పష్టం చేసిన కేంద్ర గణాంకాల నివేదికపై ఇప్పుడేమంటావ్ చంద్రబాబూ..' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ప్రశ్నించారు. అంబేద్కర్ ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారనడానికి ఇదే గొప్ప నిదర్శనమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా అన్ని రాష్ట్రాలు కలిపి ఎస్సీలకు చేస్తున్న సాయం కంటే.. ఒక్క ఆంధ్రప్రదేశ్ చేస్తున్న సాయమే అత్యధికంగా ఉందనే విషయాన్ని కేంద్ర గణాంకాలు నిరూపించాయన్నారు. కేంద్రం తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం.. గత ఆర్థిక ఏడాది మూడో త్రైమాసికం (2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్)లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కలిసి ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా 34,68,986 కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించాయని తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలు కలిపి 1.11 లక్షల ఎస్సీ కుటుంబాలకు సాయం చేస్తే.. ఒక్క ఏపీలోనే 33.57 లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం గర్వకారణమన్నారు.

కేంద్ర గణాంకాలు వారికి చెంపపెట్టు

రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధిని గాలికి వదిలేశారంటూ అవాస్తవాలు, అభూత కల్పనలను పచ్చమీడియా ద్వారా ప్రచారం చేస్తున్న చంద్రబాబు, ఆయనకు వత్తాసు పలుకుతున్న విపక్షాలకు కేంద్ర గణాంకాలు చెంపపెట్టు అని మంత్రి నాగార్జున అభిప్రాయపడ్డారు. ఇకనైనా వాస్తవాలను మరుగుపరిచి తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

'బీఆర్‌ఎస్ నేతలూ.. మీ సంగతి చూసుకోండి'

బీఆర్‌ఎస్ నేతలు ఆంధ్రప్రదేశ్‌పై విమర్శలు మాని, తెలంగాణలో వారి సంగతి చూసుకోవాలని మంత్రి నాగార్జున హితవు పలికారు. పోలవరంపై తెలంగాణ మంత్రి మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి స్పందిస్తూ.. ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను.. అక్కడ ఉన్న రూ.వేల కోట్ల ఏపీ ఆస్తులను కేసులకు భయపడి వదిలేసి పారిపోయి వచ్చిన అసమర్థ చంద్రబాబు బీఆర్‌ఎస్ నేతల విమర్శలకు బదులివ్వాలని మంత్రి డిమాండ్ చేశారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

▶ మొదటి పేజీ తరువాయి

నగదు రూపంలో చెల్లించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనవరి 2022 నుంచి ఈ ఏడాది జూన్ వరకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలను ఈ ఏడాది సెప్టెంబర్, డిసెంబర్, వచ్చే ఏడాది మార్చిలో మూడు సమాన వాయిదాల్లో ఉద్యోగుల జీపీఎఫ్‌లో జమ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

22.75 శాతానికి చేరిన డీఏ

ఇప్పుడు మంజూరు చేసిన డీఏతో కలిపి ఉద్యోగుల, పెన్షనర్ల మొత్తం డీఏ 22.75 శాతానికి చేరింది. ఈ సమయంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెంచిన డీఏ బకాయిలను పదవీ విరమణ బెనిఫిట్స్‌లో కలిపి చెల్లించనున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. డీఏ పెంపు జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ, మునిసిపల్ కార్పొరేషన్, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సమితి, 2022లో సవరించిన రెగ్యులర్ స్కేళ్లు పొందుతున్న వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగులకు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2022లో సవరించిన రెగ్యులర్ స్కేళ్లు పొందుతున్న ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్స్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎయిడెడ్ పాలిటెక్నిక్, యూనివర్సిటీ సిబ్బంది, ఎన్.జి.రంగా వ్యవసాయ యూనివర్సిటీ, జేఎన్‌టీయూ, వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి డీఏ పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

చెప్పిన మాట మేరకు ఉద్యోగులకు ఒక డీఏ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇప్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి సోమవారం కృతజ్ఞతలు తెలిపారు.

డీఏ విడుదలపై సీఎం జగన్‌కు ఉపాధ్యాయ సంఘాల కృతజ్ఞతలు

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, జాక్టో చైర్మన్ కేశవరపు జాలిరెడ్డి సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు 2022 జనవరి నుంచి ఇవ్వాల్సిన డీఏను మంజూరు చేయటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.



ప్రపంచంలో నువ్వు కోరుకుంటున్న మార్పు ముందు నీతో మొదలవ్వాలి.
- మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, 2 మే 2023

నూరు మాసాల మాట

మాటలు మంచివే. అందులోనూ మాటల్లో మనసు పరిచి, ప్రజలతో పంచుకోవడం ప్రజాస్వామ్య లక్షణం. పాలకులకు వన్నె తెచ్చే విషయం. ప్రధాని మోదీ గడచిన తొమ్మిదేళ్ళ పాలనాకాలంలో ప్రతి నెలా రేడియో వేదికగా పంచుకున్న 'మన్ కీ బాత్' (ఎంకేబీ) విశిష్టమైనది అందుకే. 2014 అక్టోబర్ 3న మొదలైన ఈ నెలవారీ ప్రసంగాలు ఈ ఏప్రిల్ 30తో వరుసగా 100 నెలలు, 100 భాగాలు పూర్తి చేసుకున్నప్పుడు అదొక మహోత్సవమైంది. ఏకంగా 20 దేశాల్లో 200 చోట్ల, న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో, దేశవ్యాప్తంగా బీజేపీ ఏర్పాటు చేసిన 4 లక్షల వేదికల్లో ఈ వందో ఎపిసోడ్ వినే వసతులు కల్పించడమే అందుకు నిదర్శనం. రాజ్‌భవన్లలో ఎంకేబీ శతమాసోత్సవాన్ని ఆహ్వానితుల ముంగిట సంబరంగా చేసుకోవడం కనీవినీ ఎరుగని ఘట్టం. ఇది కోట్లాది భారతీయుల మనోవాణి అని అధికార పక్షం అంటుంటే, ప్రజాసమస్యలపై మోదీ మౌనం వహిస్తున్నందున ఇది వట్టి 'మౌన్ కీ బాత్' అని ప్రతిపక్షాల విమర్శ. అసలు నిజం ఈ రెంటికీ మధ్య ఉందనేది విశ్లేషణ.

రాజకీయ రంగస్థలిపై ప్రత్యర్థుల్ని చిత్తుచేసే పాత్రలో పేరు తెచ్చుకున్న మోదీ తెలివిగా ఎంకేబీని జనంతో సంభాషణగానే మొదటి నుంచి మలిచారు. 'స్వచ్ఛ భారత్', 'హర్ ఘర్ తిరంగా', 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' లాంటి ఉద్యమాలను ఈ ప్రసంగాలతో ముందుకు నడిపారు. ఉన్నత లక్ష్యాలకు అంకితమైన ఉదాత్త పాలన, పాలకుడనే భావన కలిగించడంలో కృతకృత్యులయ్యారు. ఇది తొమ్మిదేళ్ళుగా ఆయన పెంచుకున్న పెట్టుబడి. పైకి రాజకీయ ప్రస్తావనలేమీ లేకుండానే సాగినా ఈ ప్రసంగ పరంపర ఇప్పుడు చేసుకున్న శతమాసోత్సవ ప్రచార పటాటోపంలో మాత్రం అస్సలు రాజకీయాలు లేవని అనలేం. వంద రూపాయల ప్రత్యేక నాణెం, సమాచార ప్రసారశాఖ సంపాదకీయ వ్యాఖ్యలు, ఎంకేబీ వింటున్న మంత్రుల ఫోటోలు – ఇలా దేశమంతా ఓ సంరంభం. తిరుగులేని నాయకుడి మనోధర్మ వాణి ఆసరాగా, ప్రజల్ని తమ వైపు తిప్పుకోవాలన్న కమలనాథుల ఆశ అర్థం చేసుకోదగినదే. అధికారంలో ఎవరున్నా కాస్త హెచ్చుతగ్గులుగా ఇది చేసే పనే. అదే సమయంలో ఈ ప్రసంగ పరంపరతో సమాజంలో సానుకూల ఫలితాలే లేవనుకోవడమూ తప్పే.

ఎంకేబీలో ప్రస్తావించిన అనేక అంశాలు, సామాన్యుల విజయగాథలు శ్రోతలకు విజ్ఞానాన్నీ, విశేషంగా స్ఫూర్తినీ అందించాయి. నెలకోసారి అలాంటి అంశాలనూ, వ్యక్తులనూ ఎంపిక చేయడానికి ప్రభుత్వ శాఖలు, పార్టీ యంత్రాగం ఎంతటి శ్రమ, క్షేత్రపరిశీలన చేస్తున్నాయో ఊహించవచ్చు. నిజానికి, వార్తల నుంచి వ్యవసాయ సలహాల దాకా అన్నిటికీ రేడియోనే ఆధారమై, రచ్చబండ వద్ద ఊరంతా రేడియోల ముందు పోగైన రోజుల నుంచి ఇవాళ సమాజం చాలా మారింది. దూరదర్శన్, ప్రైవేట్ కేబుల్ టీవీలు, శాటిలైట్ టీవీ ఛానల్స్, ఇప్పుడు ఓటీటీ దాకా కొత్త వేదికలతో 1990ల నుంచి రేడియో ప్రాచుర్యం తగ్గుతూ వచ్చింది. అలాంటి వేళ 2014లో మోదీ రేడియో మాధ్యమాన్ని ఎంచుకోవడం ఆశ్చర్యంతో పాటు ఫలితంపై అనుమానాలూ పెంచింది. కానీ, 501 ప్రసార కేంద్రాలతో, 23 భాషల్లో కార్యక్రమాలతో దేశంలో భౌగోళికంగా 90 శాతాన్నీ, జనాభాలో 98 శాతాన్నీ చేరుతున్న రేడియోను బలంగా వినియోగించుకున్నారు. గ్రామీణ, దిగువ మధ్యతరగతి జనానికి దగ్గరవుతూ, వారిదైన భాషలో మోదీ సమాచార ప్రసారం చేయగలిగారు. లేఖలతో వారినీ ఇందులో భాగస్వాముల్ని చేశారు. వెరసి, ఎంకేబీని కీలక ప్రసార, ప్రచారోద్యమంగా మలుచుకున్నారు.

ఇది కేవలం బీజేపీ కార్యకర్తలు వినే కార్యక్రమమని విమర్శలు వచ్చాయి. కానీ, ఎంకేబీలోని అంశాలతో సామాన్య జనం మమేకమయ్యేలా, ఆకాశవాణి, దూరదర్శన్ సహా ప్రైవేట్ టీవీ ఛానళ్ళలో, మర్నాటి పత్రికల్లో అవి ప్రధాన వార్తలుగా మారేలా తీర్చిదిద్దిన రూపకర్తల దూరదృష్టినీ, వ్యూహ చతురతనూ కొట్టిపారేయలేం. ఇంటి పెద్ద మిగతా కుటుంబ సభ్యులతో తన భావాలు పంచుకుంటున్న పద్ధతిలో సాగడం ఎంకేబీ విజయసూత్రం. ప్రసారభారతి సీఈఓ విడుదల చేసిన ఐఐఎం–రోహ్‌తక్ తాజా నివేదిక 10 వేల మందిని సర్వే చేసి, ఇప్పటికి 100 కోట్ల మంది ఈ కార్యక్రమం విన్నారని పేర్కొంది. 96 శాతానికి ఎంకేబీ గురించి తెలుసనీ, 23 కోట్ల మంది క్రమం తప్పక వింటున్నారనీ తెలిపింది. సదరు ఐఐఎం డైరెక్టర్ వివాదచరిత అటుంచితే, ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్తలున్న సీఎస్‌డీఎస్ సంస్థ నిరుడు నవంబర్‌లో విడుదల చేసిన నివేదిక మాత్రం దేశంలో అయిదింట మూడొంతులు ఎన్నడూ ఎంకేబీ వినలేదంటోంది. లెక్కలెలా ఉన్నా... సాక్షాత్తూ ఉపరాష్ట్రపతి సైతం వదలకుండా ప్రతి నెలా ఎంకేబీ వింటానన్నారు. ఇలాంటి వీరవిధేయ శ్రోతలు తక్కువేమీ కాదు.

మోదీ 'ఆధ్యాత్మిక ప్రయాణం'గా పేర్కొన్న ఈ కార్యక్రమం ఎంతగా ప్రభుత్వ అండ ఉన్నా, ఇంతకాలం శ్రోతల ఆసక్తిని నిలబెట్టుకోవడం విశేషమే. రేడియో పునర్వైభవానికీ తోడ్పడుతున్న ఈ ప్రసార ఉద్యమం అక్కడి కన్నా ఆన్‌లైన్‌లో, టీవీలో ఎక్కువమందిని ఆకర్షిస్తోంది. దేశంలో పెరిగిన డిజిటలీకరణకు కొండగుర్తుగా నిలుస్తోంది. ప్రజల మనసుకు దగ్గరైన అంశాలతో, 'బేటీ బచావో బేటీ పఢావో' లాంటి నినాదాలతో మోదీ మంత్రముగ్ధం చేస్తున్నారు. ఇప్పటి దాకా ఒక్కసారైనా పూర్తిస్థాయి విలేఖరుల సమావేశం జరపని తొలి భారత ప్రధాని అన్న విమర్శలకు వెరవకుండా నిత్యం జనంలో ఉంటూ, వారిని ఉద్దేశించి మాట్లాడుతూ కమ్యూనికేషన్ కింగ్ అనిపించుకున్నారు. ఎంకేబీతో కొత్త వాతావరణం సృష్టించారు. మనోవాణిని తెలపడం మంచిదైనా, ఏకపాత్రాభినయ స్వగతం కన్నా స్వేచ్ఛాయుత మీడియా సంభాషణలు ప్రజాస్వామ్యానికి మరింత మేలు. మౌనం కన్నా మాట ప్రభావమే ఎక్కువని 'మన్ కీ బాత్' శతమాసోత్సవం సైతం నిరూపిస్తోంది.

బౌద్ధ వైభవ చిహ్నం తొలగించడమా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

చరిత్రలో హేతువాదాన్ని వ్యాప్తి చేయడంలో అగ్రగామి, బౌద్ధ ధర్మం. సర్వమానవ సమానత్వాన్ని కాంక్షించినది, యజ్ఞ యాగాదులను నిరసించినది కూడా ఇదే ధర్మం. అలాంటి మహత్తర ధర్మాన్ని తెలుగు నేల ఇరు చేతులా హత్తుకుంది. దేశంలోని ఏ బౌద్ధ స్థావరం నుంచి దొరకని ఆనవాళ్లు తెలుగు నేలలో దొరికాయి. అలాంటి తెలుగు నేల విశిష్ట బౌద్ధ వారసత్వపు చిహ్నంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో 'పూర్ణఘటాన్ని' నెలకొల్పారు. కానీ కొత్తగా ప్రారంభమైన తెలంగాణ సచివాలయంలో ఆ ఆనవాళ్లను చెరిపేశారు. భారత దళిత ప్రజా బాహుళ్య విమోచనకు ఏ బౌద్ధ సౌభ్రాతృత్వ ధర్మాన్ని అంబేడ్కర్ ప్రబోధిస్తూ వచ్చాడో అదే అంబేడ్కర్ పేరిట ఏర్పాటైన సచివాలయంలో బౌద్ధ చిహ్నాన్ని కూల్చేశారు.

భారత సెక్యులర్ రాజ్యాంగ నిర్మాత, బౌద్ధ సంస్కృతీ ప్రియుడైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరిట తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయ ఆవిష్కరణ జరిగిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికీ, ప్రజలకూ శుభాభినందనలు తెలుపుతున్నాను; కానీ ఈ సందర్భంలోనే సెక్రటేరియట్‌లో ఉండవలసిన, ఉమ్మడి తెలుగు బౌద్ధ సంస్కృతీ వైభవ ప్రతీకగా అంతకుముందు నుంచీ ఉన్న విశిష్ట శాశ్వత కట్టడాన్ని తొలగించినందుకు విచారం వెలిబుచ్చక తప్పడం లేదు.


వైఎస్ రాజశేఖరరెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో (2008) ఆయన ఆధ్వర్యాన తెలుగు ప్రజల ఉమ్మడి బౌద్ధ సంస్కృతీ వైభవ చిహ్నంగా ఆ కట్టడం నాలుగు భాషల ఉద్దీపనతో వెలిసింది. ఎంతోమంది పర్యాటకుల్ని ఆకర్షించిన బౌద్ధ సంస్కృతీ చిహ్నమది (ఘనాకారపు గ్రానైట్ రాయి మీద తొలిచిన పూర్ణఘట ప్రతిరూపం). కానీ నేటి సెక్రటేరియట్ ఆవరణలో ఆ విశిష్ట చిహ్నం ఆనవాళ్ళు 'కలికానికైనా' కానరావు. ఇంతకూ ఆ బౌద్ధ ధర్మ సంస్కృతీ వైభవ కట్టడం ఏమైనట్టు? భారత దళిత ప్రజా బాహుళ్య విమోచనకు ఏ బౌద్ధ సౌభ్రాతృత్వ ధర్మాన్ని అంబేడ్కర్ ప్రబోధిస్తూ వచ్చాడో ఆ చిహ్నాన్నే కూల్చేశారు. ఏ యజ్ఞయాగాదులకు దూరంగా జరిగి సర్వ మానవ సమానత్వం లక్ష్యంగా అంబేడ్కర్ ముందుకు సాగాడో – అందుకు విరుద్ధంగా యజ్ఞయాగాదులతో 'బీఆర్ఎస్' నాయకుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన అంబేడ్కర్ సచివాలయ ప్రవేశం చేశారు.

విశేషమేమంటే, 'బౌద్ధ ధర్మ చక్ర ప్రశస్తి' శాసనం మన దేశం మొత్తం మీద ఏ బౌద్ధ స్థావరం నుంచీ ఇంతవరకూ వెలుగు చూడనందుననే తెలంగాణలోని 'ఫణిగిరి' ధర్మ చక్ర ప్రశస్తి శాసనానికి చారిత్రక ప్రాధాన్యం లభించింది. ప్రాకృత భాషను, పాలీ లిపిని, 'బ్రాహ్మీ' లిపిని ప్రేమించి, ప్రోత్సహించిన ధర్మం కూడా బౌద్ధానిదేనని మరచిపోరాదు. క్రీ.పూ. 3 – క్రీ.శ. 18 శతాబ్దాల మధ్య వెలువడిన వేలాది శాసనాలను ఉమ్మడి తెలుగువారి సొత్తుగా భావించి ఈ విశేషాలన్నింటినీ ఆవిష్కరించిన ప్రసిద్ధ స్థపతి ఈమని శివనాగిరెడ్డి ఒకరు. ఈయనే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయ ప్రాంగణంలో తెలుగువారి బౌద్ధ సంస్కృతిని ప్రతిబింబించే అత్యున్నత కట్టడ నిర్మాణంలో పాలు పంచుకున్నారు. సరిగ్గా ఆ కట్టడం ఆనవాళ్లే కనపడకుండా చేసింది కేసీఆర్ పాలన. కాక పోతే అంబేడ్కర్ పేరును ఒక ముసుగుగా వాడుకోవడం పాలకుల కొత్త 'సంస్కృతి'!

కొండా శ్రీనివాసులు, అవధానం ఉమామహేశ్వరి సంపాదకులుగా శివనాగిరెడ్డి తెలుగు సంస్కృతీ వైభవాన్ని కళ్లకు కట్టి చూపే 'మీరూ శాసనాలు చదవొచ్చు' అన్న అమూల్య గ్రంథాన్ని అందించారు. ఇందులో ఆయా కాలాల్లో హైందవ, బౌద్ధ మతాలకు మధ్య జరిగిన భావ సంఘర్షణలు, లిపిలో వచ్చిన మార్పులు వగైరా చరిత్ర ఉంది. ఈ పరిణామ క్రమానికి శాశ్వత నిలువుటద్దంగా నిలిచిన, సెక్రటేరియట్ ఆవరణలో స్థాపితమైన ఉమ్మడి బౌద్ధ సంస్కృతీ వైభవ అమూల్య చారిత్రక కట్టడాన్ని ఎందుకు తొలగించారో సమాధానం కావాలి. హేతువాదాన్ని వ్యాప్తి చేయడంలో స్థిర చిత్తంతో ముందుకు దూసుకు వెడుతున్న బౌద్ధ ధర్మాన్నీ, దాని తాలూకు ప్రచార సంస్థలనూ ఎదుర్కొంటున్న దశలో హైందవంలోని ఛాందసులు బౌద్ధారామాల్ని కూల్చకుండా ఉంటారా అని మహాపండితులు రాహుల్ సాంకృత్యాయన్, తిరుమల రామచంద్ర పదేపదే ప్రశ్నించవలసి వచ్చిందని మరవరాదు.

హైదరాబాద్‌లో మూసీ తీరాన ఉన్న క్రీ.శ. 4వ శతాబ్ది నాటి బౌద్ధారామాన్ని కాస్తా 30 ఏళ్ల క్రితమే కొనగండ్ల నరసింహస్వామి ఆలయంగా మార్చేశారని శాసనాల చరిత్రలో పేర్కొన్నారు. అహోబిలం, మంగళగిరి, భీమునిపట్నం (పావురాళ్ల కొండ), సింహాచలం మున్నగు నరసింహ క్షేత్రాలన్నీ ఒకనాటి బౌద్ధ స్థావరాలేనంటారు. హైదరాబాద్‌లో లభించిన ప్రాకృత బౌద్ధ శాసనం క్రీ.శ. 4వ శతాబ్ది నాటిది. ప్రముఖ శాసన పరిశోధకులు పీవీ పరబ్రహ్మ శాస్త్రి దానిని

రెండో మాట



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఏర్పాటైనది ఈ బౌద్ధ పూర్ణ ఘట ప్రతీక

ధ్రువీకరించారు. బౌద్ధానికి విస్తారంగా రాజాదరణ లభించిన విష్ణుకుండినుల కాలంలో (క్రీ.శ. 6వ శతాబ్ది) విష్ణుకుండి మొదటి గోవింద వర్మ పట్టపురాణి పరమభట్టారిక మహా దేవి నల్గొండ జిల్లా తుమ్మల గూడెంలో తన పేర ఒక మహా విహారాన్ని నిర్మించి, సర్వ జీవరాసుల హితాన్ని కోరే బౌద్ధం పట్ల తన మక్కువను తెలియజేసింది. ఇక క్రీ.శ. 14–17 శతాబ్దుల్లో విజయనగర శాసనాలు బౌద్ధ ధర్మాన్ని తలదాల్చి యశస్సు గడించినవే. కాకతీయుల తరువాత మొత్తం తెలుగునేలను పాలించిన కుతుబ్‌షాహీలు తెలుగును ప్రోత్సహించినవాళ్లే. సుప్రసిద్ధ నాణేల పరిశోధకులు డాక్టర్ దేమె రాజారెడ్డి కోటిలింగాల తవ్వకాల్లో అనేక పేర్లున్న నాణేలపై గల లిపి క్రీ.పూ. 3వ శతాబ్ది నాటిదనీ, రాజుల పేర్లు తెలుగులో ఉన్నాయనీ నిర్ధారించారు. తెలుగు లిపి ఆవిర్భావ, వికాసాల గురించి పీవీ పరబ్రహ్మశాస్త్రి, డా.ఎస్. రామచంద్రమూర్తి అనేక విషయాలు వెల్లడించారు. ఇంత చరిత్ర సంస్కృతి ఉభయ ప్రాంతాలలోని తెలుగు వారికి ఉండగా, ఉమ్మడి బౌద్ధ సంస్కృతీ వైభవాన్ని వెలార్చిన సాధికార నిర్మాణ రూపాన్ని సెక్రటేరియట్‌లో నామరూపాలు లేకుండా చేయడం దుర్మార్గం. పాలకుల స్థాయికి మించిన దుశ్చర్యగా పరిగణించక తప్పదు.

ఇంతకూ 'జీవతత్వం' ఎక్కడుందన్న ప్రశ్నకు వేమన్నను అడిగితే చెబుతాడు:

"తనువులోన జీవతత్వ మెరుంగక
వేరెకలడటంచు వెదుక నేల,
భానుదుండ దివ్వెపట్టి వెదుకు రీతి?!"

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పెళ్లిళ్ల సీజన్



సుప్రీంకోర్టులో ఈ నెలంతా పెళ్లిళ్ల వాసన – వివాహ సమానత్వం, వైవాహిక అత్యాచారం, పునరిద్ధరించలేనంతగా పాడైన వివాహ బంధాలు. – ఇందిరా జైసింగ్, న్యాయవాది

సా..గ..దీస్తుంది



ఒక సమస్యను పరిష్కరించకుండా చేయడానికి ఉత్తమమైన మార్గం, ఆ సమస్యను నివారించడానికి ప్రత్యేకంగా ఒక శాశ్వత సంస్థను ఏర్పాటు చేయడం! – సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

పునర్జన్మ



నా కూతురు నిఘాత్ నస్రీన్‌కు పదకొండు నెలల క్రితం అకస్మాత్తుగా రెండ్రోజుల వ్యవధిలో కాలేయం మొత్తం పాడైంది. ఢిల్లీలోని ఐఎల్‌బీఎస్‌లో కాలేయ మార్పిడి జరిగిన తర్వాత మళ్లీ శ్రీనగర్‌లో తన ఉద్యోగ బాధ్యతల్లో చేరింది. ఆమెకు రెండో జీవితం ప్రసాదించిన దేవుడు, కాలేయ దాత, వైద్యులు, ఇతర ఆసుపత్రి బృందం, రక్తం, ప్లాస్మా దాతలు, స్నేహితులు, సహచరులు, శుభం కోరిన అందరికీ ధన్యవాదాలు.
– అహ్మద్ అలీ ఫయాజ్, జర్నలిస్ట్

దక్షిణ దేశం



ఎన్నికలు, చట్టాల్లోని లొసుగులు, వ్యాజ్యాలు, శత్రువులను జైళ్లలో పెట్టడం ద్వారా బీజేపీ విన్నరించలేని రాజకీయ శక్తిగా మారింది. ఇదిలాగే కొనసాగితే, ఢిల్లీ రహితంగా ఎందుకు ఉండకూడదని దక్షిణాది అడగొచ్చు. సౌత్ ఇండియా రిపబ్లిక్ అనే ఆలోచన మొత్తంగానే కొట్టిపారేయదగినదేమీ కాదు.
– మనూ జోసెఫ్, రచయిత

తాగమంటారా?



అత్యధిక కెఫీన్ ఉండే డ్రింకుల వాణిజ్య ప్రకటనల్లో నటిస్తున్న ఈ సోకాల్డ్ సూపర్‌స్టార్లందరూ ఆ ప్రకటనల్లో చూపిస్తున్నట్టుగా నీరసంగా ఉన్నప్పుడు వాటిని తాగుతారా? తమ ఎదిగిన పిల్లలకు, ఎదిగే వయసులో ఉన్న చిన్న పిల్లలకు కూడా వాటిని తాగమని చెబుతారా?
– గుత్తా జ్వాల, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

మనసులో మాట వినరా?



'మన్ కీ బాత్' వందో ఎపిసోడ్ పూర్తయినందుకు మోదీజీకి అభినందనలు. కానీ, నిరసన చెబుతున్న రెజ్లర్ల 'మన్ కీ బాత్' కూడా వినండి. వాళ్ల బాధను అర్థం చేసుకోవడానికి మన ప్రధాని సిద్ధంగా ఉన్నారని నిరూపితం అవుతుంది.
– కపిల్ సిబాల్, రాజ్యసభ ఎంపీ

సమాన పిలుపు




రాజవంశీయులతో నేను ఎప్పుడు సమావేశమైనా, 'యువర్ హైనెస్' అనలేక పోయాను. అది నా నాట్లోంచి రాదు. అది నా డీఎన్ఏలో లేదు. (బ్రిటన్ రాకుమారులు) విలియమ్, హ్యారీలను కలిసినప్పుడు ఇద్దరినీ మేట్ (సహవాసి) అని సంబోధించాను. అలాగని వాళ్ల పట్ల నాకు మర్యాద లేదని కాదు. – రసెల్ క్రో, నటుడు

ఇన్‌బాక్స్

విశ్వదాత విశ్వఖ్యాతి

స్వాతంత్ర్య సమరయోధుడిగా, పాత్రికేయుడిగా, వ్యాపారవేత్తగా, రాజకీయ నేతగా, విద్యాదాతగా, వితరణ శీలిగా వినుతికెక్కిన విశ్వదాత.. కాశీనాథుని నాగేశ్వరరావు. ఆయన 1867 మే 1వ తేదీన కృష్ణా జిల్లా పామర్రు సమీప ఎలకుర్రు గ్రామంలో జన్మించారు. వివేకవర్ధని పత్రికలో కందుకూరి వీరేశలింగం రాసిన వ్యాసాలతో స్ఫూర్తిపొందారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో తెలుగు వారికి సొంత భాషలో సమాచారం ఇవ్వాలనే లక్ష్యంతో 1908లో 'ఆంధ్రపత్రిక'ను బొంబాయి నుంచి వారపత్రికగా ప్రారంభించారు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో విశ్వవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను వెనువెంటనే అందించాలనే ఉద్దేశంతో 1914 ఏప్రిల్ 1న మద్రాసులో దినపత్రికను నెలకొల్పారు. ఇవికాక సాహితీప్రియుల కోసం 'భారతి' పత్రికను తీసుకొచ్చారు. 1926లో 'ఆంధ్ర గ్రంథ మాల' పేరిట ప్రచురణ సంస్థను స్థాపించి ఎందరో మహనీయుల పుస్తకాలను ప్రచురించారు. గ్రంథాలయ ఉద్యమానికి తన వంతు ఊపిరులూదారు. ఆ విధంగా తెలుగు భాషకు విశేష సేవలందించిన మహానుభావుడు నాగేశ్వరరావు పంతులు. తెలుగువారంతా కలిసి ఆయనను 'దేశోద్ధారక' బిరుదుతో సత్కరించారు.



కాశీనాథుని నాగేశ్వరరావు

1893లో 'అమృతాంజన్ లిమిటెడ్'ను స్థాపించి అమృతాంజనాన్ని ప్రజలకు అందించారు. కాశీనాథుని చేతికి ఎముకే లేదని చెప్పుకునేవారంటే అతిశయోక్తి కాదు. ఆయన దాతృత్వాన్ని చూసిన మహాత్మాగాంధీ 'విశ్వ దాత'గా కితాబిచ్చారు. ఆ పేరుతోనే ఆయన కుటుంబీకులు ప్రతి ఏటా ఇప్పుడు ఓ అవార్డు ఇస్తున్నారు.

– చెన్నాప్రగడ వీఎస్సెస్ శర్మ, విశ్రాంత జర్నలిస్టు
(మే 3న 'విశ్వదాత' అవార్డుల ప్రదానోత్సవం)

మనుషులు కాదోయ్ మాటలోయ్!

కామెంట్



కరణ్ థాపర్

ఇప్పటికే చదివి ఉండనందుకు చింతిస్తూ నేనొక పుస్తకం చదువుతూ ఉన్నాను. 'బిట్వీన్ హోప్ అండ్ డెస్పైర్' అనే పుస్తకం సమకాలీన భారతదేశంపై రాజీవ్ భార్గవ ప్రతిఫలింపజేసిన నైతికతల సమాహారం. వాటిలో కొన్ని నిస్సందేహంగా నిస్తేజమైనవి. అరకొరగా కొన్ని బహుశా అర్థంలేనివి. చాలావరకు మాత్రం లోతైనవీ, ఆలోచన రేకెత్తించేవీ. ముఖ్యంగా ఒకటైతే తన నవ్యత వల్ల నా ధ్యాసను తనపైకి మరల్చుకున్నది.

'ఎ నేషన్ ఈజ్ ఎ పీపుల్ ఇన్ కాన్వర్సేషన్' అనే శీర్షికతో ఉన్న ఒక వ్యాసంలో... "దేశం అంటే ఏమిటి?" అనే ప్రశ్నకు సమాధానంగా, 'దేశమంటే సంభాషణలో ఉన్న ప్రజలు' అంటారు భార్గవ. దేశమంటే ఏమిటి అన్న ప్రశ్నకు స్కూల్లో మనకు నేర్పించిన జవాబు కచ్చితంగా ఇది మాత్రమైతే కాదు. దేశాలను మనం జాతులు, భాషలు, మతాల వారీగా, ఇంకా... చారిత్రకంగా, భౌగోళికంగా, సాంస్కృతికంగా ఏర్పడిన మనుషుల సమూహంగా అవగాహన పరచుకున్నాం. కొన్నిసార్లు ఈ భిన్నత్వాల జోడీకి కూడా దేశం అనే ఏకరూపత స్థిరపడుతుంది. ఇందుకు స్ఫురించే ఉదాహరణలు... ఇజ్రాయిల్, కుర్దిస్తాన్, పాలస్తీనా, లిక్టన్‌స్టయిన్; జులు, బెర్బెర్ జాతులు, ఎస్కిమోలు, రెడ్ ఇండియన్‌లు, మావోరీలు. దేశాలన్నీ కూడా వీటిల్లో ఒకటీ లేదా అంతకంటే ఎక్కువగా వైవిధ్యాల కలబోత స్వభావాన్ని కలిగి ఉంటాయి.

భార్గవ ఒక దేశాన్ని భిన్నమైన కోణంలో చూస్తారు. "అన్నిటికంటే వారి గతం, వర్తమానం, భవిష్యత్తులను గురించిన సాధారణ, లేదా అతివ్యాప్త ఆందోళనల వల్ల స్వీయ స్పృహతో జట్టు కట్టిన ప్రజాసమూహమే దేశం. ఆ ఏకతలోని చేతన జన్యుపరమైనది కాదు. ఆకాశం నుండి ఊడి పడినదీ కాదు. నోటితో, రాతలతో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం, ఒకరు చెప్పింది ఒకరు వినడం, ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం వల్ల వృద్ధి చెందినది" అంటారు. అందుకే భార్గవ, దేశమంటే సంభాషణలో ఉన్న ప్రజలు అన్నారు.

అయితే భారతదేశాన్ని అర్థం చేసుకోడానికి అది కచ్చితమైన ఉత్తమ నిర్వచనం అవుతుందా? లొడలొడమని కబుర్లు చెప్పడం, మాట్లాడటం, మాట్లాడేవాళ్లకు అంతరాయం కలిగించడం, కేకలు వేయడం, పెద్దగా అరవడం, విని వదిలేయడం, వినాలని పట్టుపట్టడం... ఇవేగా మనం ఎప్పుడూ చేసేది. ఇవన్నీ చేస్తున్నందుకు ఇంకెవరైనా అయితే మనల్ని 'టవర్ ఆఫ్ బాబెల్' అనేవారు. కానీ భార్గవ మన ఎడతెగని ఈ సంభాషణను మన జాతీయతలోని ప్రధానాంశంగా గుర్తించారు.

ఈ వినూత్న నిర్వచనాన్ని దాటి చూస్తే, ఆ వెనుక... నేడు మన దేశంలో ఏం జరుగుతోంది అనే విషయమై కలవరం కలిగించే ముఖ్యాంశాలు ఉండటం కనిపిస్తుంది. "వార్తా పత్రికలు, ఆ తర్వాత టీవీ ఛానళ్లు ప్రేరేపించనిదే ప్రజల మధ్య సంభాషణలు ఉండటం లేదు. సమస్యలపై ఉమ్మడి



ఆందోళనలు వృద్ధి చెందడం అన్నది కనిపించడం లేదు. కనుక దేశం అన్నదే లేదు" అంటారు భార్గవ. అంటే, మనం ఒకరితో ఒకరం మాట్లాడుకోవడం లేదు. మీడియా ద్వారా మాత్రమే మాట్లాడుకుంటున్నాం. కనుక మన మీడియా ఆరోగ్యం – పారదర్శకత, నిష్పాక్షికత, వాక్స్వేచ్ఛా నిబద్ధత – మన జాతీయతకు ఎంతో కీలకమైనది. భార్గవ అడగని ఒక ప్రశ్న, ఆవేశాన్ని రేకెత్తించే ప్రశ్న... మనం వార్తాపత్రికను చేతిలోకి తీసుకున్న ప్రతిసారీ, లేదంటే వార్తా చానెల్‌ను పెట్టగానే తలెత్తుతుంది... భారతీయ మీడియా భారత దేశాన్ని అణగదొక్కుతోందా అని!

ఈ పుస్తకం మరొక ప్రశ్నను కూడా లేవనెత్తింది, బహుశా అది మరింతగా కలవరపెట్టే ప్రశ్న. మళ్లీ కూడా భార్గవ నేరుగా ప్రశ్నించడం లేదు. ప్రశ్న వైపుగా మనల్ని మళ్లిస్తున్నారు. "ఒక దేశం అన్నది సంభాషించుకునే ప్రజా సమూహం అయినప్పుడు ఆ సంభాషణను ఎవరైనా అడ్డుకుంటే దేశాన్ని దెబ్బతీసినట్లు అవుతుంది" అంటారు. ఈ వేలు ఎటువైపు చూపిస్తోందో నాకు తెలుసు. మీకూ తెలుసు. ఆ వేలు ఎవరి వైపు అయితే తిరిగి ఉందో వారికీ తెలుసు. ఇంతకన్నా వివరంగా చెప్పాల్సిన పని లేదని దీని అర్థం.

భార్గవ మరింత ముందుకు వెళ్లారు. సంభాషణను ఆపేయడం మాత్రమే మన దేశానికి ప్రమాదకరం కాదు. "ఎట్టి పరిస్థితిలోనూ ప్రజల సంభాషణను ప్రభుత్వం లాగేసుకోకూడదు. ప్రజా సంభాషణను నిర్దేశించకూడదు. నియంత్రించ కూడదు. సంభాషణలో ప్రభుత్వం కూడా ఒక భాగమే తప్ప తనే శాశ్వతంగా సంభాషణను నడపాలని చూడకూడదు. వాస్తవానికి సంభాషణకు అంతరాయం కలిగించే వారిని, నిరోధించే వారిని నియంత్రించడం ప్రభుత్వ విధి. దానినే దేశం ఆశిస్తోంది" అంటారు భార్గవ. ఈ చివరి వాక్యం నాకు నచ్చింది. మన టెలివిజన్ యాంకర్లు చెప్పేది గుర్తొచ్చింది, వాళ్లు వేరే అర్థంలో చెప్పినప్పటికీ. భార్గవ వాళ్ల మాటల్ని వాళ్ల నెత్తిపైనే కుమ్మరించారు.

దేశం అంటే ఏమిటో భార్గవ ఇచ్చిన నిర్వచనంలోని అందం... వేర్వేరు జాతులు, మతాలు, భాషలు, ప్రాంతాలు, సంస్కృతులు, ఆహార సంప్రదాయాలు, భౌగోళికతలు, చారిత్రక నేపథ్యాలు కలిగివున్న వాళ్లంతా కలిసి ఉండటంలో ఉన్నప్పటికీ... ఈ వ్యత్యాసాలు కేవలం వివరణాత్మకమైనవి. అసలైనది ఏమంటే... కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, రాన్ ఆఫ్ కచ్ నుంచి అగర్తల వరకు మనం ఒకరితో ఒకరం సంభాషించుకుంటున్నాం. తగాదాలు ఉంటే ఉండొచ్చు. అంతరాయం కలిగించుకుంటూ ఉండొచ్చు. లేదంటే ఒక సుదీర్ఘ ప్రసంగానికి, పాండిత్యానికి, అజ్ఞానానికి, వట్టి సమాచారానికి, నీరసం కలిగించే మాటలకు చెవి ఒగ్గుతూ ఉండొచ్చు. ఇవేవీ కాదు, మనమైతే మాటల్లో ఉన్నాం. ఈ సంభాషణ ఆగిపోతే ఏం జరుగుతుందన్నది ఆలోచించాలి. భార్గవ చెప్పడం, దేశం 'విడి వడడానికి' దారి ఏర్పడుతుందని! మన దేశం గురించే ఆయన చెబుతున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

అనుకరణ చేటు

అనుసరించడం, అనుకరింప చేయడం వ్యాపార నాగరికతలో ఒక ప్రధానాంశం. ఒకరిని చూసి ఒకరు వేషధారణలో, నడకలో, ఆడంబరాల్లో అనుకరిస్తారు. అనుకరణ, అనుసరణ ఒకటి కాదు. జ్ఞానంలో, జీవనంలో, నడతలో, నిరాడంబరతలో, మంచితనంలో అనుసరిస్తారు. అనుసరణ మనల్ని మంచి దారిలోకి మళ్ళిస్తుంది. మంచిగా మలచుతుంది. కానీ, అనుకరణ నెత్తికెక్కి మోయలేని భారమవుతుంది. పతన హేతువు అవుతుంది. పులిని చూసి నక్క వాతలు పెట్టుకోవడం అనుకరణ. ఇచ్చిన మాట తప్పకుండా, ప్రాణాలకు భయపడకుండా తన దగ్గరకు వచ్చిన ఆవును చూసి... ఆలోచించి, తానూ సత్య మార్గంలో నడచి, ఆవును చంపకుండా పులి వదిలి పెట్టడం అనుసరణ.

అనుకరణ అజ్ఞానంలో ఒక భాగం. థామస్ ఆల్వా ఎడిసన్ చిన్నతనంలో పక్షిలా ఎగరాలి అనుకున్నాడు. తాటాకులు చేతులకు రెక్కల్లా కట్టుకుని చెట్టు కొమ్మ మీది నుండి ఎగిరాడు. నేల మీద పడి కాళ్ళు విరగ్గొట్టుకున్నాడు. వానపాముల్ని తినడం వల్ల పక్షులు ఎగురుతున్నాయనుకున్నాడు. వానపాముల్ని తెచ్చి, మెత్తగా నూరి దానిని బలవంతాన తమ పనిపిల్లతో తినిపించాడు. ఆ పిల్లకు వాంతులై, అనారోగ్యం పట్టుకుంది.



జ్యోతిర్మయం

అడవి జంతువుల్లో ఏనుగు చాలా బలమైంది. ఒక నక్క తానూ ఏనుగులా బలంగా తయారు కావాలని అనుకుంది. ఏనుగు వెంటే తిరిగింది. ఆ ఏనుగు ప్రతిరోజూ అడవి మధ్యలో ఉన్న పెద్ద చెరువులో దిగి, తామర పూలు, ఆకులు, తూడులు, దుంపలు తినేది. తానూ ఇదే ఆహారం తీసుకుంటే ఏనుగులా శక్తిశాలి కావచ్చు అనుకుంది నక్క. ఇక, ఆ రోజు నుండి చెరువులో దిగి తామర కాడల్ని, దుంపల్ని తినడం మొదలు పెట్టింది. ఆ దుంపలతో పాటు బురదనూ మింగేసింది. దానితో దాని కడుపులో బురద పేరుకుపోయి అనారోగ్యం పాలైంది. రోజు రోజుకీ క్షీణించిపోయి, ఎముకల గూడు అయ్యింది. చివరికి మరణించింది.

"కేవలం తలలు గొరిగించుకుని, కాషాయధారణ చేసినంత మాత్రాన జ్ఞానులు కాలేరు. ప్రజ్ఞానులూ కారు. మంచి మార్గాన నడవడం వల్ల, మంచిని పెంపొందించుకోవడం వల్ల నిరంతర జ్ఞాన సాధన వల్లే ప్రజ్ఞ పెంపొందుతుంది" అని బుద్ధుడు చెప్పిన కథ ఇది.

– బొర్రా గోవర్ధన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.9.51 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తర సా.6.33 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.3.26 నుండి 5.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.10 నుండి 9.01 వరకు తదుపరి రా.10.49 నుండి 11.34 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.44 నుండి 12.06 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.38, **సూర్యాస్తమయం:** 6.15.

సింగపూర్‌కు చేరిన భారత నేవీ యుద్ధనౌకలు



సింగపూర్ తీరంలో భారత యుద్ధ నౌకలు ఐఎన్‌ఎస్ ఢిల్లీ, ఐఎన్‌ఎస్ సాత్పుర

దొండపర్తి(విశాఖ దక్షిణ): అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఆసియా నేషన్స్(ఆసియన్) సముద్ర విన్యాసాల్లో పాల్గొనేందుకు భారత నావికాదళం నుంచి రెండు యుద్ధ నౌకలు సోమవారం సింగపూర్‌కు చేరుకున్నాయి. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న ఆసియన్ విన్యాసాలకు తూర్పు నావికాదళం నుంచి ఐఎన్‌ఎస్ ఢిల్లీ, ఐఎన్‌ఎస్ సాత్పుర యుద్ధ నౌకలతో పాటు ఈఎన్‌సీ కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ గుర్‌చరన్ సింగ్ వెళ్లారు. ఈ నెల 2 నుంచి 4 వరకు సింగపూర్‌లోని చాంగి నేవల్ బేస్‌లో హార్బర్ ఫేజ్‌లో, 7, 8 తేదీల్లో దక్షిణ చైనా సముద్రంలో సీ ఫేజ్ ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఆగ్నేయ ఆసియా దేశాలతో సముద్ర భద్రతా సహకారాన్ని పెంపొందించేందుకు ఈ విన్యాసాలు దోహదపడతాయని నావికాదళ అధికారులు తెలిపారు.

డీసీఐకి పారాదీప్ పోర్ట్ కాంట్రాక్ట్

- రూ.172.22 కోట్ల కాంట్రాక్ట్ దక్కించుకున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్

సాక్షి, విశాఖపట్నం: వరుస కాంట్రాక్టులతో లాభాల బాటలో దూసుకుపోతున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐ) మరో కీలక కాంట్రాక్టును దక్కించుకుంది. పారాదీప్ పోర్టు అథారిటీకి చెందిన మెరైన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పారాదీప్‌కు సంబంధించిన 2023–24 సంవత్సరానికి గానూ రూ.172.22 కోట్ల కాంట్రాక్ట్‌ను డీసీఐ సొంతం చేసుకుంది. ఇందులో పారాదీప్ పోర్టు అథారిటీకి చెందిన అప్రోచ్ చానెల్, ఎంట్రన్స్ చానెల్, టర్నింగ్ సర్కిల్, డాక్స్, శాండ్ ట్రాప్స్ డ్రెడ్జింగ్ పనులను ఏడాది పాటు డీసీఐ నిర్వహించనుంది.

దువ్వాడ వీఎస్ఈజెడ్ డీసీగా శ్రీనివాసరావు



అగనంపూడి (గాజువాక): దువ్వాడ విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ (వీఎస్ఈజెడ్) జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ (డీసీ)గా ముప్పాల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ రైల్వే సర్వీసెస్‌కు చెందిన శ్రీనివాసరావు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజినీర్ (కోచింగ్)గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. సుమారు మూడు దశాబ్దాల పాటు ఇండియన్ రైల్వే సర్వీస్‌లో దేశంలోని పలు ప్రాంతాలతోపాటు విదేశాల్లో కూడా విధులు నిర్వహించారు. అమెరికాలోని జనరల్ మోటార్స్, చైనాలోని హెవీ హాల్ ఆపరేషన్స్‌లో డిప్యుటేషన్‌పై పనిచేసిన అనుభవం ఉన్న శ్రీనివాసరావు 2014లో విశిష్ట సేవలు అందించినందుకుగానూ జాతీయ అవార్డుతో పాటు ప్రిన్సిపల్స్ మెడల్‌ను అందుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన జోనల్ డీసీ రామ్మోహన్‌రెడ్డి ఏడాది కిందట పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీసీనే విధులు నిర్వహిస్తున్నారు.

వెయ్యేళ్లనాటి బుద్ధుని విగ్రహం లభ్యం



బుద్ధుని ప్రతిమను చూపుతున్న పురావస్తు శాఖాధికారి యేసుబాబు

గూడూరు(తిరుపతి జిల్లా): గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెయ్యేళ్లనాటి ప్రాచీన బుద్ధుని విగ్రహం లభ్యమైంది. దేవాలయాన్ని సోమవారం కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ శాసన అధ్యయన విభాగం చెన్నైకి చెందిన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎపిగ్రఫిస్ట్ ఎం.యేసుబాబు, జిల్లాకు చెందిన చరిత్ర పరిశోధకులు రసూల్ అహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, నాశిన భాస్కర్‌గౌడ్ వినతి మేరకు ఆలయాన్ని సందర్శించామని తెలిపారు. గుడిలో స్పర్శ ముద్రలో ఉన్న అత్యంత అరుదైన బుద్ధుని విగ్రహాన్ని గుర్తించామన్నారు. ఈ విగ్రహం సుమారు వెయ్యేళ్ల నాటిదని తెలిపారు. అత్యంత అరుదైనదన్నారు. ఈ ప్రతిమ సహజ గుణానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు సూచించారు.

నిడదవోలు మహిళకు 'ప్రైడ్ ఆఫ్ నేషన్' అవార్డు

- దుబాయ్‌లో మిస్/మిస్టర్ ఇంటర్నేషనల్ ఉమెన్–2023 పోటీల నిర్వహణ



ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు గెలుపొందిన మందపాటి మంజూష

నిడదవోలు: దుబాయ్‌లో ఇటీవల జరిగిన మిస్/మిస్టర్ ఇంటర్నేషనల్ ఉమెన్–2023 పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన మందపాటి మంజూష 'ప్రైడ్ ఆఫ్ నేషన్' అవార్డు సొంతం చేసుకుంది. ఏటా దుబాయ్‌లో ఈ పోటీలు నిర్వహిస్తారు. ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్స్‌లో వివిధ దేశాలకు చెందిన 30 మంది పోటీ పడ్డారు. చివరకు ఇండియా నుంచి తెలుగు మహిళ మంజూష ఈ అవార్డు దక్కించుకున్నారు. 'మహిళా సాధికారత, సమాజంలో మహిళల పాత్ర' అనే అంశంపై మంజూష చేసిన ప్రసంగానికి ముగ్ధులైన న్యాయనిర్ణేతలు ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. గత జనవరిలో దుబాయ్‌లో జరిగిన పోటీల్లో మంజూష 'వండర్ మామ్'గా కూడా నిలిచి, యూఏఈ క్యాలెండర్‌లో స్థానం సంపాదించింది. రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాజారామ్మోహన్, జయమణి దంపతుల కుమార్తె మంజూష విజయవాడ వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదివారు. భర్త మహేష్ ఉద్యోగ రీత్యా ప్రస్తుతం దుబాయ్‌లో నివాసం ఉంటున్నారు. దుబాయ్‌లో అవార్డు గెలిచిన మంజూషను నిడదవోలు పట్టణ ప్రముఖులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

పేదలకు మేలు చేస్తోందన్న అక్కసుతోనే ప్రభుత్వంపై చంద్రబాబు తప్పుడు ప్రచారం

946వ రోజు దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : తమ పాలనకు భిన్నంగా పేదలకు ప్రస్తుత ప్రభుత్వం మంచి చేస్తోందన్న అక్కసుతో బాబు అండ్ కో తప్పుడు ప్రచారం చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 946వ రోజుకు చేరాయి. శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్సీలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వంగా కేంద్రం ఏపీని ప్రకటించడం ప్రభుత్వ చిత్తశుద్ధి పాలనకు నిదర్శనమన్నారు. 2022–23 మూడో త్రైమాసికం నాటికి ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశవ్యాప్తంగా 34.64 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, అందులో 33.57 లక్షల కుటుంబాలు ఏపీలోనే ఉన్నాయని ప్రకటించిందని.. పేదలపై సీఎం జగన్‌కు ఉన్న ప్రేమకు ఇదే నిదర్శనమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమం అందకుండా అడ్డుకుంటూ తప్పుడు కేసులు వేసిన బాబు అండ్ కో ఇకనైనా తమ తప్పులు తెలుసుకుని తమను ఇబ్బంది పెట్టడం మానుకుంటే మంచిదని హితవుపలికారు. కులోన్మాదంతో రాజధానిలో మాకు చోటు లేకుండా చేయాలని చూస్తున్న కులవాదుల ఆగడాలకు క్లైం పడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని గుర్తుంచుకుని మసలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులిదాసు, బేతపూడి సాంబయ్య పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. సత్యదేవుని దివ్య కల్యాణం

అన్నవరంలో తిలకించి పులకించిన భక్తులు



కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు



మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకుడు

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం పుణ్యక్షేత్రంలో శ్రీవీరవేంకటసత్యనారాయణస్వామి, శ్రీఅనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల వార్షిక దివ్యకల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కనులపండువగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు తన్మయత్వంతో తిలకిస్తుండగా.. రత్నగిరిపై రామాలయం పక్కన సర్వాంగ సుందరంగా అలంకరించిన నూతన కల్యాణ మండపంలో వేదపండితుల ఆశీర్వచనాలు, అర్చకస్వాముల మంత్రోచ్చారణల నడుమ ఈ వేడుక ఆద్యంతం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి 10.25 గంటల సమయానికి జీలకర్ర–బెల్లం మిశ్రమాన్ని అర్చకులు స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ఉంచారు. 10.33 గంటల సుముహూర్తంలో మాంగల్యసూత్రధారణ చేశారు. అనంతరం తలంబ్రాలు, వేదాశీస్సులతో కల్యాణోత్సవం ముగిసింది. ఉత్సవమూర్తులకు తలంబ్రాలు పోసిన సమయంలోనే గర్భాలయంలోని మూలవిరాట్టుల పైన కూడా అర్చకులు తలంబ్రాలు పోశారు. స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, ఆలయ ఈవో చంద్రశేఖర్ అజాద్ దంపతులు, టీటీడీ, విజయవాడ కనకదుర్గ ఆలయం, ద్వారకాతిరుమల ఆలయాల ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలను పంపిణీ చేశారు.

వీశాట్ ఫలితాలు విడుదల

- 3 నుంచి కౌన్సెలింగ్
- విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ నాగభూషణ్

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్–2023 ఫేజ్–1 ఫలితాలను సోమవారం వైస్ చాన్సలర్ నాగభూషణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీశాట్‌కు ఈ ఏడాది విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ప్రవేశపరీక్ష నిర్వహించగా ఏపీ, తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. వీశాట్–2023/జేఈఈ మెయిన్/ఎంసెట్/ఇంటర్ మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. వీశాట్‌లో 1 నుంచి 2 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్‌లను అందిస్తామన్నారు. అలాగే ఇంటర్, జేఈఈ మెయిన్స్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు కూడా స్కాలర్‌షిప్ ఇస్తామని వెల్లడించారు. ఈ నెల 3 నుంచి ప్రవేశాల కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. వీశాట్ ఫేజ్–2 ప్రవేశ పరీక్షలను మే 5 నుంచి 31 వరకు నిర్వహిస్తామన్నారు.

తొలి పది ర్యాంకులు వీరికే...

వీశాట్‌లో తొలి పది ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలను డీన్ అడ్మిషన్స్ కేవీ కృష్ణకిషోర్ వెల్లడించారు. యల్లంపల్లి వేణిశ్రీ, కోమట్ల తేజశ్రీ సాయి, అనపర్తి వెంకట సుబ్రహ్మణ్య మనోజ్, టీవీఎస్ సాయి గౌతమ్, గరుగు వీర వెంకట సంజన, పగడాల ఎస్‌వీఎస్ భావన, బిజ్జం లక్ష్మీకాంత్ రెడ్డి, భీమిరెడ్డి శివశరణ్య, లంక రాకేష్ వెంకటసాయి, పొన్నమంద మనోజ్‌కుమార్ టాప్ టెన్‌లో నిలిచారని తెలిపారు.

అటవీ శాఖ అధికారులపై దాడి

- దాడికి ఉసిగొల్పిన టీడీపీ నేత, సర్పంచ్ మహలక్ష్మీరాజు
- చేపల చెరువుల తవ్వకాలను అడ్డుకోవడంతో అధికారులపై ఆగ్రహం
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అధికారులు



ప్రత్తికోళ్లలంక అభయారణ్యంలో అక్రమంగా చెరువు తవ్వుతున్న దృశ్యం

ఏలూరు రూరల్: ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక పరిధిలోని అభయారణ్యంలో చేపల చెరువుల అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు వచ్చిన అటవీ శాఖ అధికారులపై అక్రమార్కులు దాడికి యత్నించారు. కర్రలు, రాడ్లతో సిబ్బంది వెంట పడ్డారు. అభయారణ్యం నుంచి వెళ్లిపోవాలంటూ హెచ్చరించారు. వీడియో తీస్తున్న అధికారుల సెల్‌ఫోన్లను లాక్కున్నారు. టీడీపీ నేత, ప్రత్తికోళ్లలంక సర్పంచ్ ఘంటసాల మహలక్ష్మీరాజు ఆధ్వర్యంలో వారు ఈ దాడికి దిగడం గమనార్హం. ఆదివారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి సిబ్బంది చెప్పిన వివరాలు.. ప్రత్తికోళ్లలంక సర్పంచ్ ఘంటసాల మహలక్ష్మీరాజు ఆధ్వర్యంలో కొందరు వ్యక్తులు అర్ధరాత్రి అభయారణ్యంలో అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలు సాగిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, పొక్లెయిన్‌లతో చెరువు గట్లు పునరుద్ధరిస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ ఏలూరు రేంజర్ ఎస్వీకే కుమార్, డీఆర్వో అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందిని సంఘటనాస్థలానికి పంపడంతో వారొచ్చి తవ్వకాలను అడ్డుకున్నారు.

అనుయాయులను రెచ్చగొట్టి..

అధికారులు చెరువుల తవ్వకాలను అడ్డుకోవడంతో టీడీపీ నేత, సర్పంచ్ మహలక్ష్మీరాజు గ్రామంలోకి వెళ్లి మైక్‌లో తన అనుయాయులను రెచ్చగొట్టాడు. దీంతో నిమిషాల వ్యవధిలో పెద్ద సంఖ్యలో వచ్చిన మహలక్ష్మీరాజు అనుయాయులు అటవీ సిబ్బందిపై దాడికి యత్నించారు. అయినా అధికారులు, సిబ్బంది వెనుకంజ వేయకుండా అడ్డుగా నిలిచారు. అటవీ చట్టం ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనపై అధికారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు 460 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువులు అభయారణ్యంలో ఉన్నాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే తాము పట్టాలు పొందామని సర్పంచ్ వర్గీయులు అధికారులతో వాదిస్తున్నారు. తొమ్మిదేళ్ల కిందట మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సైతం ఈ చెరువుల్లో చేపల సాగు చేసేందుకు ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు.

ఇక సుందర తిరుమల.. శుద్ధ తిరుమల

- తిరుమల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని టీటీడీ ఉద్యోగులు, సేవకుల ప్రతిజ్ఞ
- ఉద్యోగుల స్ఫూర్తి అభినందనీయమన్న ఈవో ధర్మారెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు, ఉద్యోగులు

తిరుమల: తిరుమల పరిసరాలను పరిశుభ్రంగా.. పచ్చగా ఉంచేందుకు 'సుందర తిరుమల.. శుద్ధ తిరుమల' అనే నినాదంతో ఇకనుంచి ప్రతి నెలలో ఒక రోజు టీటీడీ ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించనున్నట్టు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. సోమవారం తిరుమలలోని ఆస్థాన మండపం వద్ద టీటీడీ ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో కలిసి శ్రమదానం (స్వచ్ఛంద పరిశుభ్రత సేవ) ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముందస్తు నోటీసు లేకుండా మెరుపు సమ్మె చేయడం వంటి బెదిరింపులకు టీటీడీ ఎప్పటికీ లొంగదన్నారు. భక్తులు సమర్పించే కానుకలతోనే అధికారులు, ఉద్యోగులు, శానిటరీ సిబ్బందికి జీతాలు వస్తున్నాయని గుర్తు పెట్టుకోవాలన్నారు. భక్తులకు సేవ చేయడమే భగవంతుడి సేవగా అంతా భావించడం మనందరి బాధ్యత అన్నారు. ఆపద సమయంలో భక్తుల సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చేయి చేయి కలిపి పరిస్థితిని చక్కదిద్దిన టీటీడీ సిబ్బంది సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తిరుమలలో జేఈవోలతో పాటు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, తిరుపతి మునిసిపల్ కమిషనర్ కూడా మద్దతు అందించారని ఈవో తెలిపారు. చిత్తూరు, తిరుపతి, శ్రీ కాళహస్తి, నెల్లూరు, కడప ప్రాంతాల నుంచి పారిశుద్ధ్య సిబ్బందిని తిరుమలకు రప్పించి సంక్షోభాన్ని అధిగమించడానికి సేవలందించారన్నారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి, పీఆర్వో టి.రవి, ఎస్టేట్స్ ఓఎస్డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో తిరుమలలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొని ప్రెస్‌క్లబ్, ఎస్ఎంసీ, ఎస్ఎంజీహెచ్ తదితర పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అనంతరం ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో ప్రతినెలా ఒకరోజు సుందర తిరుమల..శుద్ధ తిరుమల కార్యక్రమం చేపడతామని ప్రతిజ్ఞ చేశారు.

60 మందికి పిచ్చి కుక్క కాటు

- నెల్లూరులో స్వైరవిహారం చేసిన శునకం
- ఎట్టకేలకు పట్టుకున్న మున్సిపల్ సిబ్బంది

నెల్లూరు(బారకాసు): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు నగరంలో సోమవారం పట్టపగలు ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన వారిందరినీ కాటేసుకుంటూ వెళ్లింది. ఇలా దాదాపు 60 మంది కుక్క కాటు బారినపడ్డారు. నగర పాలక సంస్థ అధికారులకు సమాచారం అందడంతో వెంటనే రంగంలోకి దిగి ఆ కుక్కను పట్టుకోగలిగారు. కుక్కకాటుకు గురైన 25 మంది నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వ్యాక్సిన్ వేయించుకున్నారు. మరికొంతమంది నెల్లూరు హాస్పిటల్‌కు వెళ్లి వ్యాక్సిన్ వేయించుకుని చికిత్స పొందారు. మరికొంత మంది అందుబాటులో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లారు. స్వైర విహారం చేసిన పిచ్చికుక్క మెడలో బెల్టు ఉండటంతో ఓ యజమానిదని నగరపాలక సంస్థ అధికారులు గుర్తించారు. కుక్కకు పిచ్చిపట్టిందని యజమాని దానిని వదిలేశాడని వెటర్నరీ డాక్టర్ మధన్‌మోహన్ తెలిపారు.

మళ్లీ కేజీహెచ్‌కు కిడ్నీ బాధితుడు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కిడ్నీ రాకెట్ బాధితుడు జి.వినయ్‌కుమార్‌ను సోమవారం తిరిగి కేజీహెచ్‌లో చేర్పించారు. గత నెల 29న కేజీహెచ్‌లో వైద్యం సక్రమంగా అందడం లేదని వినయ్‌కుమార్‌ను బంధువులు ఇంటికి తీసుకొని వెళ్లిన సంగతి విదితమే. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మళ్లీ వారే వినయ్ కుమార్‌ను తిరిగి కేజీహెచ్ క్యాజువాలిటీలో చేర్పించారు. అక్కడ కేస్ షీట్ సహా అన్నీ పూర్తి చేసి తిరిగి యూరాలజీ విభాగానికి పంపించారు. ఎంఆర్ఐ స్కానింగ్ చేయడానికి కూడా సన్నాహాలు చేస్తున్నారు. అలాగే వినయ్‌కుమార్‌ను న్యూరాలజీ వైద్యులు పరీక్షిస్తారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు.

ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు 1,597 ఉద్యోగాలు

- నియామక పత్రాలను అందజేసిన వీసీ ప్రసాదరెడ్డి



విద్యార్థినికి నియామక పత్రం అందజేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన 1,001 మంది విద్యార్థులకు 1,597 ఉద్యోగాలు లభించాయి. ఈ సందర్భంగా సోమవారం విశాఖలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'ఎచీవర్స్ డే'ను ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులను వేదికపైకి ఆహ్వానించి విద్యార్థులతో సత్కరింపజేశారు. రూ.84.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించిన సీఎస్ఈ విద్యార్థిని రేపాక ఈశ్వరీ ప్రియతో పాటు విద్యార్థులందరికీ వీసీ ప్రసాదరెడ్డి నియామక పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏయూలో విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రులే ప్రధాన కారణమని.. వారి త్యాగాలను జీవితాంతం గుర్తుంచుకోవాలని సూచించారు. కోవిడ్ పరిస్థితులు, ఆన్‌లైన్ తరగతులు వంటి ఎన్నో సవాళ్లను అధిగమించి విజయవంతంగా ఇంజినీరింగ్ పూర్తి చేశారంటూ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ జి.శశిభూషణరావు, ఎస్.కె భట్టి, మాజీ ప్రిన్సిపాల్ పేరి శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ జి.వి.ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'బ్రహ్మ'రథోత్సవం.. పోటెత్తిన భక్తజనం

- జనసంద్రమైన బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠంలో సోమవారం జరిగిన బ్రహ్మరథోత్సవానికి భక్తజనం పోటెత్తారు. అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాల్లో ఐదోరోజు బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. రథంపై బ్రహ్మంగారు ఆశీనులై ఉంటారు కనుక.. బ్రహ్మరథోత్సవం అని పిలుస్తారు. స్థానిక ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజి, పూర్వ మఠాధిపతి శ్రీవీరభోగవసంతవేంకటేశ్వరస్వామి కుమారులు, కుటుంబసభ్యులు పూజాకార్యక్రమాలు నిర్వహించి రథాన్ని కదిలించారు. భక్తులు 'బ్రహ్మ' నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా మాడవీధుల్లో రథాన్ని లాగారు. రాష్ట్రం నలుమూలల నుంచేగాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన లక్షలాదిమంది భక్తులు బ్రహ్మరథోత్సవాన్ని కనులారా వీక్షించి ఆనందభరితులయ్యారు. మంగళవారం నిర్వహించే మహాప్రసాద వినియోగంతో ఆరాధనోత్సవాలు ముగుస్తాయి.

దుర్గమ్మ సేవలో సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా



జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు ప్రసాదాలు అందజేస్తున్న ఈఈ కోటేశ్వరరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, పట్టు వస్త్రాలు అందజేశారు.

జాతీయ స్కేటింగ్ పోటీల్లో చైత్ర సత్తా



జాతీయ స్కేటింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిన చైత్రదీపిక

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో విజయవాడ క్రీడాకారిణి పి.చైత్రదీపిక రెండు బంగారు పతకాలు సాధించింది. ఏప్రిల్ 30వ తేదీన చండీగఢ్‌లో జరిగిన ఈ పోటీలకు 11–14 వయసు కేటగిరీలో ఎన్టీఆర్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన చైత్రదీపిక... పెయిర్ స్కేటింగ్ విభాగంలో, క్వాడ్ స్కేటింగ్(ఫ్రీ స్టయిల్) విభాగంలో బంగారు పతకాలు కైవసం చేసుకుంది. జాతీయ పోటీల్లో అద్భుత ప్రదర్శనతో రెండు బంగారు పతకాలు సాధించిన చైత్రదీపికను డీఆర్ఎం శివేంద్ర మోహన్, డీసీఎం కె.కమలాకరబాబు, కృష్ణాజిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి దాసరి శ్రీనివాస రెడ్డి సోమవారం అభినందించారు.

శ్రీశైలం డ్యాంపై విద్యుత్ షార్ట్ సర్క్యూట్

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాంపైన సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. అకస్మాత్తుగా చేంజ్ ఓవర్ స్విచ్ ప్యానల్ బోర్డులో మంటలు చెలరేగి దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. అప్రమత్తమైన అధికారులు డ్యాంకు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపివేశారు. రేడియల్ క్రస్ట్‌గేట్లకు రాత్రి వేళల్లో వెలుతురు వచ్చేందుకు లైట్లు వేస్తారు. 12వ క్రస్ట్‌గేట్ పైభాగంలో ఉన్న జంక్షన్ బాక్స్ వద్ద సోమవారం రాత్రి భారీ వర్షం కురవడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. అనంతరం డ్యాం ఇంజినీర్లు అక్కడికి చేరుకుని జంక్షన్ బాక్స్ ప్యానల్ బోర్డుకు మరమ్మతులు చేసి గేట్ల వద్ద లైట్లను పునరుద్ధరించారు.

ముగిసిన పద్మావతీ పరిణయోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుమల: శ్రీపద్మావతి శ్రీనివాసుల పరిణయ మహోత్సవం సోమవారం తిరుమలలో ఘనంగా ముగిసింది. సాయంత్రం 5 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి స్వామివారు గరుడ వాహనంపై, దేవేరులు పల్లకీపై ఊరేగింపుగా బయల్దేరి నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతీ పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు. ఎదుర్కోలు, పూల చెండ్లాట, నూతన వస్త్ర సమర్పణ తదితర కల్యాణ వేడుకల తర్వాత కొలువు జరిగింది. వెంటనే ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదాలను పారాయణం చేశారు. కళాకారులు మంగళకరంగా సంగీత, మేళ, తాళ వాయిద్యాలను ప్రదర్శించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రసరమ్యంగా అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. హారతి అనంతరం స్వామి దేవేరులతో కలిసి ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. దీంతో మూడు రోజుల పద్మావతీ పరిణయోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

క్లుప్తంగా

మరో రెండ్రోజులు దేశవ్యాప్తంగా వానలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ వరకు అనేక రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తమిళనాడు, కేరళ సహా దక్షిణాది రాష్ట్రాల్లో ఉరుములు, వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. వీటితో పాటే పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్తాన్, పశ్చిమ హిమాలయ ప్రాంతంలోనూ వర్షాలు పడతాయని తెలిపింది. మే 4 నుంచి వర్షపాతం గణనీయంగా తగ్గుతుందని పేర్కొంది.

బీఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీపై అనర్హత వేటు



న్యూఢిల్లీ: కిడ్నాప్-హత్య కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష పడిన బీఎస్పీకి చెందిన పార్లమెంట్ సభ్యుడు అఫ్జల్ అన్సారీపై అనర్హత వేటు పడింది. యూపీలోని ఘాజీపూర్ నుంచి అఫ్జల్ అన్సారీ లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2005 నాటి ఘాజీపూర్ ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్ హత్య కేసు, 1997లో వారణాసికి చెందిన నంద కిశోర్ అనే వ్యాపారి కిడ్నాప్, హత్య కేసులో అన్సారీ, ఆయన సోదరుడు ముక్తార్ అన్సారీ దోషులుగా ఉన్నారు. ఎంపీ/ఎమ్మెల్యేల కేసులను విచారించే యూపీ కోర్టు శనివారం ఈ కేసుల్లో అన్సారీకి నాలుగేళ్లు, ముక్తార్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం అఫ్జల్ అన్సారీ లోక్‌సభ సభ్యత్వాన్ని 2023 ఏప్రిల్ 29 నుంచి రద్దు చేస్తున్నట్లు సెక్రటేరియట్ పేర్కొంది.

'పద్మ అవార్డులకు ప్రతిపాదనలు పంపండి'

న్యూఢిల్లీ: ప్రతిభావంతులైన వ్యక్తులను గుర్తించి, వారి గొప్పదనం, విజయాలు పద్మ అవార్డులతో సత్కరించడానికి అర్హులను భావించినట్లయితే ఆ పేర్లను సిఫారసు చేయాలని ప్రజలను సోమవారం కేంద్రం కోరింది. 2024 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే పద్మ అవార్డులకు నామినేషన్లు, ప్రతిపాదలను 2023 మే ఒకటో తేదీ నుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపింది. పద్మ అవార్డుల సిఫారసులకు ఆఖరు తేదీ సెప్టెంబర్ 15. ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో https://awards.gov.in ద్వారా పంపాలని కోరింది. రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్రం ఏటా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను పద్మ శ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ అవార్డులతో గౌరవిస్తుంది.

వచ్చే ఐదేళ్లలో నికరంగా...

1.4 కోట్ల కొలువులకు కోత

వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా

- ఏఐతో 2.6 కోట్ల ఉద్యోగాలకు ఎసరు
- భారత్‌లో 22 శాతం ఉద్యోగుల వలస
- 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' నివేదికలో వెల్లడి



జెనీవా: వచ్చే ఐదేళ్లలో ఉద్యోగాల సృష్టిలో భారీ తగ్గుదల నమోదవుతుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) అంచనా వేసింది. కొత్తగా 6.9 కోట్ల ఉద్యోగాల సృష్టి జరగనుండగా ఏకంగా 8.3 కోట్ల ఉద్యోగాలు కనుమరుగవుతాయని పేర్కొంది. నికరంగా 1.4 కోట్ల ఉద్యోగాలకు కోత పడుతుందని 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' పేరిట ఆదివారం విడుదల చేసిన ద్వై వార్షిక నివేదికలో వివరించింది. ప్రస్తుతం మొత్తం ప్రపంచ ఉద్యోగితలో ఇది 2 శాతం. వచ్చే ఐదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా 23 శాతం ఉద్యోగుల వలస చోటుచేసుకోవచ్చని పేర్కొంది. భారత్‌లో ఇది 22 శాతం దాకా ఉండొచ్చని అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా 45 పెద్ద ఆర్థిక వ్యవస్థలు, 27 భారీ పారిశ్రామిక క్లస్టర్లు, 800 దిగ్గజ కంపెనీల్లోని దాదాపు 67.3 కోట్ల ఉద్యోగాలపై డబ్ల్యూఈఎఫ్ విస్తృతంగా సర్వే జరిపింది. విశేషాలు...

- వచ్చే ఐదేళ్లలో సప్లై చైన్స్, రవాణా, మీడియా, వినోద, క్రీడా రంగాలకు ఉద్యోగుల వలసలు ఎక్కువగా ఉంటాయి.
- ప్రపంచవ్యాప్తంగా నూతన ఉద్యోగాల సృష్టిలో చాట్‌జీపీటీ వంటి కృత్రిమ మేధ ఆధారిత టెక్నాలజీలదే కీలక పాత్ర.
- 75 శాతం కంపెనీలు, సంస్థలు, కృత్రిమ మేధ ఆధారిత టెక్నాలజీలను అందిపుచ్చుకుంటాయి.
- ఫలితంగా ఏకంగా 44 శాతం మంది ఉద్యోగుల నైపుణ్యాలకు పూర్తిగా కాలదోషం పట్టనుంది.
- సమర్థ పనితీరును కొనసాగించాలంటే ప్రతి 10 మంది ఉద్యోగుల్లో కనీసం ఆరుగురికి శిక్షణ అవసరమవుతుంది.
- దాంతో ఏకంగా 45 శాతం వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, కంపెనీలు ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధిపై హెచ్చు నిధులు వెచ్చిస్తాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఆటోమేషన్ వేగం గత అంచనాల కంటే తగ్గింది. ప్రస్తుతం కేవలం 34 శాతం టాస్కులు ఆటోమేషన్‌తో నడుస్తున్నాయి. ఇది 2020తో పోలిస్తే కేవలం 1 శాతమే ఎక్కువ. కంపెనీలు కూడా ఆటోమేషన్ అంచనాలను కుదించుకున్నాయి. తొలుత 2025 నాటికి 47 శాతం టాస్కులను ఆటోమేట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా తాజాగా దాన్ని 2027 నాటికి కేవలం 42 శాతానికి పరిమితం చేసుకున్నాయి.
- కృత్రిమ మేధ రాకతో బ్యాంక్ క్యాషియర్లు, క్లర్కులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు వంటి 2.6 కోట్ల ఉద్యోగాలు కనుమరుగవుతాయి.
- ఏఐ, మెషీన్ లెర్నింగ్ స్పెషలిస్టులు, ఫిన్‌టెక్ ఇంజనీర్లు, డేటా అనలిస్టులు, సైంటిస్టులు, అగ్రికల్చరల్ ఎక్విప్‌మెంట్ ఆపరేటర్లు వంటి ఉద్యోగాలు బాగా పెరుగుతాయి.
- స్వచ్ఛ ఇంధనం, వ్యర్థాల నిర్వహణ, సహజ వనరుల సమర్థ వినియోగం వంటి రంగాల్లో మేనేజర్లు, విండ్ టర్బైన్ టెక్నీషియన్లు, సోలార్ కన్సల్టెంట్లు, ఎకాలజిస్టులు, పర్యావరణ స్పెషలిస్టుల వంటి ఉద్యోగాలు కూడా భారీగా పెరుగుతాయి. ఈ రంగంలో భారత్‌తో సహా టాప్ 10 దేశాలు పర్యావరణ లక్ష్యాలు చేరుకోవాలంటే కనీసం 1.2 కోట్ల ఉద్యోగాల సృష్టి జరగాలి.

భారత్‌లో సామాజికేతర రంగాల్లోనే ఉద్యోగ సృష్టి

కరోనా అనంతరం భారత్‌లో విద్య, ఆరోగ్యం వంటి సామాజిక రంగాలతో పోలిస్తే సామాజికేతర రంగాల్లోనే ఉద్యోగాల సృష్టి ఎక్కువగా ఉంటుందని నివేదిక అంచనా వేసింది. భారత్‌లో వచ్చే ఐదేళ్లలో కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీ ఆధారిత రంగాలకు ఉద్యోగుల వలస అత్యధికంగా ఉంటుందని నివేదిక పేర్కొంది.

పర్యావరణ, సామాజిక, పాలన రంగాల్లో ఉపాధి వృద్ధి ఊపందుకుంటుందని భారత్‌లో సర్వేలో పాల్గొన్న వారిలో 61 శాతం మంది పేర్కొన్నారు. తర్వాత కొత్త టెక్నాలజీలకు 59 శాతం, డిజిటల్ యాక్సెస్‌కు 55 శాతం, వాతావరణ మార్పులు, పెట్టుబడుల రంగాలకు 53 శాతం ఓటేశారు.

అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలను పెంచుకునేందుకు తమ యాజమాన్యమే అవకాశం కల్పించడం మేలని సర్వేలో పాల్గొన్న భారతీయ ఉద్యోగుల్లో ఏకంగా 97 శాతం అభిప్రాయపడ్డారు. ఇది ప్రభుత్వపరంగా జరగాలన్నవారు 18 శాతమే.

ఉపాధి సృష్టిపై డేటా అనలిటిక్స్ పెను ప్రభావం చూపుతుందని 62 శాతం కంపెనీలు నమ్ముతున్నాయి. తర్వాతి స్థానాన్ని ఎన్‌క్రిప్షన్-సైబర్ సెక్యూరిటీ (53 శాతం), డిజిటల్ ప్లాట్‌ఫాంలు, అప్లికేషన్లు (51), ఇ-కామర్స్ (46 శాతం)కు ఇచ్చాయి.

భారత్‌లో వచ్చే ఐదేళ్లలో ఉద్యోగుల వలస

ఏఐ, మెషీన్ లెర్నింగ్	38%
డేటా అనలిస్టులు, సైంటిస్టులు	33%
డేటా ఎంట్రీ క్లర్కులు	32%
ఫ్యాక్టరీ కార్మికులు	18%
ఆపరేషన్స్ మేనేజర్స్	14%
అకౌంటెంట్లు, ఆడిటర్లు	5%



3 ఉచిత సిలిండర్లు

రోజుకు అర లీటరు పాలు | ఉమ్మడి పౌర స్మృతి, జాతీయ పౌరపట్టీ | కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ హామీలు



శివాజీనగర: పోలింగ్‌కు పది రోజులే గడువు ఉండగా కర్ణాటకలో ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ ప్రకటించింది. ఈసారి మళ్లీ అధికారంలోకి వస్తే ఏకీకృత పౌర స్మృతి, జాతీయ పౌర పట్టీ అమలుచేస్తామని బీజేపీ ప్రకటించింది. 'ఏకీకృత పౌరస్మృతి దిశగా మేం నడిచేలా రాజ్యాంగం మాకు దారి చూపింది. 'అందరికీ న్యాయం. బుజ్జగింపులు లేవిక' అనేదే మా నినాదం'' అంటూ ఎన్నికల హామీల చిట్టాను సోమవారం బెంగళూరులో బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ప్రకటించారు. 'ఆరు 'ఏ'లు అంటే ఏ-అన్న(ఆహార భద్రత), ఏ-అక్షర(నాణ్యమైన విద్య), ఏ-ఆరోగ్య(అందుబాటులో ఆరోగ్యం), ఏ-ఆదాయ(ఆదాయ హామీ), ఏ-అభయ(అందరికీ సామాజిక న్యాయం), ఏ-అభివృద్ధి(డెవలప్‌మెంట్) ఉండేలా బీజేపీ ప్రజా ప్రణాళికను రూపొందించింది' అని నడ్డా అన్నారు. మేనిఫెస్టోలో మొత్తంగా 103 వాగ్దానాలు ఉన్నాయి. అభివృద్ధికేంద్రంగా మేనిఫెస్టో ఉందంటూ మోదీ కొనియాడారు.

మేనిఫెస్టోలోని కొన్ని ముఖ్యాంశాలు..

- ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సు మేరకు రాష్ట్రంలో యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్(ఎన్ఆర్‌సీ) అమలు
- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఏటా 3 ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు.
- ఈ కుటుంబాలకు 'పోషణ' పథకం ద్వారా ఉచితంగా రోజుకు అర లీటరు నందిని పాలు. నెలకు ఐదు కేజీల 'శ్రీ అన్న- సిరి ధాన్య'.
- రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మున్సిపల్ కార్పొరేషన్ వార్డులో 'అటల్ ఆహార కేంద్రం'ను నెలకొల్పుతాం. అత్యంత కనిష్ఠ ధరకే నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం.
- మత ప్రాతిపదికన, ఉగ్రవాద వ్యతిరేక కర్ణాటక విభాగం(కే-ఎస్‌డబ్ల్యూఐఎఫ్‌టీ) ఏర్పాటు.
- రెవిన్యూ శాఖ గుర్తించిన సొంతిల్లులేని వారికి రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఇళ్ల స్థలాలు.
- సామాజిక న్యాయ నిధి పేరిట ఎస్సీ/ఎస్టీ వర్గాల గృహిణులకు గరిష్ఠంగా రూ.10,000 దాకా ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ల అవకాశం.
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రముఖ విద్యావేత్తలు, సంస్థల సౌజన్యంలో విశ్వేశ్వర విద్యా యోజన పథకం
- మిషన్ స్వాస్థ్య కర్ణాటక కింద ప్రతీ వార్డులో నమ్మ క్లినిక్(మన క్లినిక్).
- ఉత్పత్తి ఆధారిత రాయితీ పథకాల ద్వారా మరో 10 లక్షల ఉద్యోగాల కల్పన.
- సివిల్స్, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఆర్థికసాయం.
- కర్ణాటకను ఎలక్ట్రిక్ వాహనాల హబ్‌గా మార్చేందుకు చార్జింగ్ స్టేషన్ల స్థాపన, వేయి అంకుర సంస్థలకు ప్రోత్సాహం.
- అన్ని గ్రామ పంచాయతీల్లో చిన్న ఎయిర్ కండిషన్ సదుపాయాలు. వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాల స్థాపన. ఇందుకోసం రూ.30 వేల కోట్ల అగ్రిఫండ్ ఏర్పాటు.

యడియూరప్ప అసంతృప్తి

మేనిఫెస్టో విడుదల సందర్భంగా ప్రసంగించాలని మాజీ సీఎం యడియూరప్పను నేతలు కోరగా.. ప్రణాళికను పూర్తిగా చదవ కుండా ప్రసంగం చేయమంటే ఎలాగని ఆయ న అసంతృప్తిని వ్యక్తంచేశారు. ముందుగానే మేనిఫెస్టో కాపీని ఇవ్వాల్సిందని అనడంతో ఆయనలోని అసంతృప్తి బయటపడింది.

అంతా బోగస్: కాంగ్రెస్ విమర్శ

'అబద్ధపు, లూటీల బీజేపీ మేనిఫెస్టో ఇది. అంతా బోగస్' అని బీజేపీ హామీల చిట్టాపై కాంగ్రెస్ ఆరోపణలు గుప్పించింది. 'మేనిఫెస్టోలో ఉన్న వాటిల్లో 90 శాతం హామీలు 2018లోనే ఇచ్చింది. వీటిని ఇంతవరకు అమలుచేయలేదు. ఇప్పుడు మరో దఫా బోగస్ హామీలిస్తోంది' అని కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సూర్జేవాలా ట్వీట్‌చేశారు. 'నందిని బ్రాండ్‌ను అమూల్‌లో కలిపేసి కర్ణాటక ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూసింది. పెను విమర్శలతో ముఖం చెల్లని బీజేపీ ఇప్పుడు అర లీటర్ ఉచితమంటూ ముందుకొచ్చింది. ఇందిర క్యాంటీన్లను మూసేసిన ఇదే సర్కార్ ఇప్పుడు పేరుమార్చి మళ్లీ తెరుస్తానంటోంది. బెంగళూరు బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసి ఇప్పుడు 'స్టేట్ కేపిటల్ రీజియన్' అంటూ కొత్తరకం ఫ్యాన్సీ పేర్లతో మభ్యపెడుతోంది. యూపీలో రెండు ఉచిత సిలిండర్లు అన్నారు. ఇంతవరకు దిక్కులేదు. కర్ణాటకలో ఏకంగా మూడు ఇస్తామంటున్నారు' అని మరో నేత జైరాం రమేశ్ ఎద్దేవాచేశారు. 2013-18 కాలంలో కర్ణాటకలో కాంగ్రెస్ రాష్ట్ర సర్కార్ 95 శాతం హామీలను నెరవేర్చిందని గుర్తుచేశారు.

మోదీ 'అసమర్థుడైన కొడుకు'

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కొడుకు వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు: ప్రధాని మోదీని విషసర్పమంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై గొడవ కొనసాగుతుండగానే ఆయన కొడుకు ప్రియాంక్ ఖర్గే మరో వివాదానికి తెర తీశారు. కలబురగి జిల్లా చిట్టాపూర్ స్థానం నుంచి మళ్లీ ఎన్నికయ్యేందుకు యత్నిస్తున్న ఖర్గే తనయుడు ప్రియాంక్ సోమవారం మోదీని అసమర్థుడైన కొడుకుగా అభివర్ణించారు. బంజారా కులంలో పుట్టానంటున్న మోదీ వారి గురించి పట్టించుకోవడం లేదన్నారు. ''మీరేం భయపడకండి, మీ కొడుకు ఢిల్లీలో ఉన్నాడని కలబురగి బంజారా ప్రజలకు హామీ ఇచ్చారు. అసమర్థుడైన కొడుకు ఢిల్లీలో ఉంటే ఆ కుటుంబం ఎలా ముందుకెళుతుంది?'' అని ప్రశ్నించారు. కోలి, కబ్బలిగ, కురుబ వర్గానికి చెందినవాడినని గతంలో చెప్పిన మోదీ, తాజాగా బంజారా వర్గం వాడినని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రియాంక్ వ్యాఖ్యలపై కర్ణాటక బీజేపీ ఈసీకి ఫిర్యాదు చేసింది.

విజిటింగ్ ప్రొఫెసర్‌గా 'అలీబాబా' జాక్ మా



టోక్యో: చైనా ఈ-కామర్స్ దిగ్గజం అలీబాబా గ్రూప్ సహ వ్యవస్థాపకుడు జాక్ మా కాలేజీ ప్రొఫెసర్‌గా మారనున్నారు. ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ టోక్యోకు చెందిన పరిశోధన సంస్థ టోక్యో కాలేజీలో విజిటింగ్ ప్రొఫెసర్ కానున్నారు. సుస్థిర వ్యవసాయం, ఆహారోత్పత్తి అంశంపై ఆయన పరిశోధనలు చేస్తారని వర్సిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంట్రప్రెన్యూర్‌షిప్, కార్పొరేట్ మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో తన అనుభవాన్ని విద్యార్థులు, అధ్యాపకులతో జాక్ మా పంచుకుంటారని తెలిపింది. 1990ల్లో ఈ- కామర్స్ సంస్థ అలీబాబాను స్థాపించిన జాక్ మా ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత ధనికుడు.

రూ.171 తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

న్యూఢిల్లీ: వాణిజ్య అవసరాలకు ఎల్పీజీ వాడే వినియోగదారులకు శుభవార్త. వాణిజ్య విభాగ 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.171.5 తగ్గిస్తున్నట్లు సోమవారం కేంద్రప్రభుత్వ అధీనంలోని చమురు రిటైల్ సంస్థలు ప్రకటించాయి. దీంతో సోమవారం ఢిల్లీలో 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,028 నుంచి రూ.1,856.5కు దిగివచ్చింది. వాణిజ్య సిలిండర్ ధరలను వరసగా నెలవారీగా తగ్గించడం ఇది రెండోసారి కావడం విశేషం. ధర ఏప్రిల్ ఒకటో తేదీన రూ.91.5 తగ్గిన విషయం తెల్సిందే. ధర తగ్గడంతో హోటళ్లు, రెస్టారెంట్లు తదితరాలు నడిపే వాణిజ్య ఎల్పీజీ వినియోగదారులకు కాస్తంత ఆర్థికభారం తగ్గింది. అయినప్పటికీ మార్చి ఒకటోతేదీ నుంచి చూస్తే పెరిగిన రూ.350.5 తో పోలిస్తే ఇప్పటికే ధరభారం ఎక్కువే. కాగా, గృహావసరాలకు వాడే 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం ఢిల్లీలో 14.2 కేజీల సిలిండర్ ధర రూ.1,103. ఇక పెట్రోల్, డీజిల్ ధరలు వరసగా 13వ నెలలోనూ యథాతథంగా ఉన్నాయి. అంతర్జాతీయ చమురు ధరల సగటుకు అనుగుణంగా ప్రతినెలా ప్రభుత్వ రంగ పెట్రోలియం సంస్థలు పెట్రో ఉత్పత్తుల ధరలను సవరిస్తున్న విషయం తెలిసిందే.

ఎవరిదో రాజధాని!


బెంగళూరు చిక్కితే అధికారం పక్కా
ఐటీ సిటీలో పాగాకు పార్టీల కుస్తీ



రాష్ట్రాన్ని గెలవాలంటే ముందు రాజధానిని గెలవాలి. కర్ణాటకలో అధికారిక పీఠానికి తాళాలు బెంగళూరులోనే ఉన్నాయి. బీజేపీకీ, కాంగ్రెస్‌కూ ఈ విషయం బాగా తెలుసు. దాంతో ఈసారి అధికార విపక్షాల మధ్య సిలికాన్ సిటీలో సంకుల సమరం సాగుతోంది.

కన్నడ పోరు

సాక్షి, బెంగళూరు: బెంగళూరులో ఎక్కువ సీట్లు గెలిచిన పార్టీయే కర్ణాటకలో అధికారంలోకి వస్తుందని గడచిన పలు ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే తెలుస్తోంది. అందుకే బెంగళూరు పరిధిలోని 28 అసెంబ్లీ స్థానాల్లో అత్యధిక స్థానాలు నెగ్గి అధికారంలోకి రావాలని బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తున్నాయి.



గడిచిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో తీరు తెన్నులు..

- 2008లో బెంగళూరులో బీజేపీ 17, కాంగ్రెస్ పార్టీ 10 సీట్లు గెలవగా జేడీ(ఎస్) ఒక్క స్థానానికి పరిమితమైంది. బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి దక్షిణ భారతంలో తొలిసారి ఆ ఘనత సాధించింది.
- 2013 ఎన్నికల్లో కాంగ్రెస్ 13, బీజేపీ 12, జేడీ(ఎస్) 3 సీట్లు గెలిచాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. సిద్ధరామయ్య తొలిసారి సీఎం అయ్యారు.
- 2018లో కాంగ్రెస్15, బీజేపీ 11, జేడీ(ఎస్) 2 స్థానాలు దక్కించుకున్నాయి. కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కుమారస్వామి సీఎం అయ్యారు. కానీ సర్కారు బలపరీక్షలో ఓడి 14 నెలలకే కుప్పకూలింది.
- 2019లో కాంగ్రెస్, జేడీ(ఎస్) సభ్యులు బీజేపీకి ఫిరాయించడంతో 15 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. బీజేపీ ఏకంగా 12 సీట్లు నెగ్గింది. అలా బెంగళూరులో బీజేపీ బలం 15కు పెరగగా కాంగ్రెస్ 11 స్థానాలకు పడిపోయింది. బీజేపీ అధికారాన్ని స్థిరపరచుకుంది.

వేధిస్తున్న తక్కువ ఓటింగ్

బెంగళూరులో ప్రతిసారీ తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుండడం పరిపాటిగా వస్తోంది. 2013, 2018 ఎన్నికల్లో ఓటింగ్ శాతం బాగా పడిపోయింది. సగానికి సగం, అంటే నియోజకవర్గాల్లో మరీ తక్కువ ఓటింగ్ నమోదవుతూ వస్తోంది. బెంగళూరు వాసులు ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపరన్న అపప్రథ ఉంది. దీన్ని ఈసారైనా తొలగించుకుంటారా అన్నది చూడాలి.

- 2013 ఎన్నికల్లో బెంగళూరు పరిధిలో కేవలం 55.04% ఓటింగ్ నమోదైంది. 2018లో అది కాస్తా 48.03 శాతానికి తగ్గింది.
- దాంతో ఈసారి ఎలాగైనా రాజధానిలో ఓటింగ్ శాతాన్ని పెంచడంపై ఎన్నికల సంఘం ప్రధానంగా దృష్టి పెట్టింది. కొద్ది రోజులుగా ప్రత్యేక ర్యాలీలు, వాకథాన్లు, ప్రచారాలు చేపడుతోంది.

తటస్థ ఓటర్లే కీలకం

- ట్రాఫిక్ సమస్య, మౌలిక వసతుల లేమి వంటి పలు సమస్యలు బెంగళూరును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎవరు అధికారంలోకి వచ్చినా ఈ సమస్యల పరిష్కారంలో విఫలమవుతున్నారన్నది నగరవాసుల ప్రధాన ఆరోపణ.
- ఇక్కడ 15 నుంచి 20 శాతం ఓటర్లు కులమతాలకు అతీతంగా తటస్థంగా ఉంటారు.
- వీరిని తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.
- బీజేపీ అవినీతి, పాలన వైఫల్యాలు, కుంభకోణాలను ప్రచారం చేస్తూ నగర వాసులను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. శాంతినగర, సర్వజ్ఞ నగర వంటి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎంతో బలంగా ఉంది.
- ఇక తటస్థ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బీజేపీ నేతలు ఇంటింటి ప్రచారానికి దిగారు.
- కాంగ్రెస్, జేడీ(ఎస్)ల నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో నగరంలో బీజేపీ బలంగా కనిపిస్తోంది.



దేశ ద్రోహం చట్ట సవరణకు సిద్ధం



సాక్షి, న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం ముందునాటి దేశ ద్రోహచట్టం కింద భారత శిక్షాస్మృతిలోని 124ఏ సెక్షన్‌ను ప్రయోగించడంపై నిపుణులతో సంప్రదింపుల ప్రక్రియ కీలక దశలో ఉందని సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్రం తెలియజేసింది. ''124ఏ సెక్షన్ సవరణకు మేం సిద్ధం. సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోంది. తర్వాత పార్లమెంట్ పరిశీలనకు వెళుతుంది. కనుక పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తర్వాతే కేసు విచారణను చేపట్టండి' అని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి అభ్యర్థించారు. దాంతో విచారణను ఆగస్టు రెండో వారానికి వాయిదా వేస్తున్నట్లు బెంచ్ తెలిపింది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ వందలాది మందిపై చాలా రాష్ట్రాల్లో సెక్షన్ 124ఏ కింద కేసులు నమోదవడం, ఆ సెక్షన్ కింద ఇకపై కేసులు నమోదుచేయకూడదంటూ గత మే 11న సుప్రీంకోర్టుకు చరిత్రాత్మక తీర్పు వెలువర్చడం తెల్సిందే.

సీనియర్ సిటిజన్లకు రాయితీల రద్దుతో.. రైల్వే శాఖకు రూ.2,242 కోట్లు

న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్ల టికెట్ రాయితీలరద్దుతో 2022-23లో అదనంగా రూ.2,242 కోట్లు ఆర్జించినట్లు రైల్వే శాఖ తెలిపింది. 58 ఏళ్లు పైబడిన మహిళలకు 50%, 60 ఏళ్లు దాటిన పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు 40% టికెట్ ధరలో రాయితీ ఉండేది. కరోనా నేపథ్యంలో 2020 మార్చి దీన్ని నిలిపేసిన రైల్వే శాఖ ఇప్పటిదాకా పునరుద్ధరించలేదు.

తుపాకీ అప్పగిస్తే గిఫ్ట్ కార్డు బహుమానం

న్యూయార్క్: తుపాకీ సంస్కృతిని అరికట్టేందుకు అమెరికాలోని న్యూయార్క్ నగరం వినూత్న ఆఫర్‌తో ముందుకు వచ్చింది. ఒక్కో తుపాకీకి 500 డాలర్ల విలువైన గిఫ్ట్ కార్డు ఇస్తామని ప్రకటించి, అందుకు గాను 9 కేంద్రాలను శనివారం ఏర్పాటు చేసింది. వీటికి పౌరుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. వివిధ రకాల అసాల్ట్ రైఫిళ్లు, ఘోస్ట్ గన్స్ కలిపి 3 వేలకు పైగా తుపాకులను పౌరులు అప్పగించినట్లు న్యూయార్క్ అధికారులు తెలిపారు. మొదటి ఆయుధానికి 500 డాలర్లు, ఆపై ప్రతి ఆయుధానికి 150 డాలర్ల చొప్పున అందజేశామన్నారు. బ్రూక్లిన్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేసిన మూడు గంటల్లోనే 90 గన్లను సరెండర్ చేయగా, సిరాక్యూజ్‌లో అత్యధికంగా 751 ఆయుధాలను అప్పగించారన్నారు. తమ వద్దకు చేరిన ప్రతి ఆయుధంతో ఒక జీవితాన్ని కాపాడినట్లే, ఒక ప్రమాదకర కాల్పుల ఘటనను నివారించినట్లేనన్నారు.



కర్ణాటక ఎన్నికలు మీ కోసం కాదు

ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ చురకలు

తుమకూరు: కాంగ్రెస్ నేతలు తనను 91 పర్యాయాలు దూషించారంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. కర్ణాటక ఎన్నికలు ఆయన కోసం కాదన్న విషయాన్ని ప్రధాని మోదీ అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. రాహుల్ సోమవారం తురువెకెరె నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రచార సభలో ప్రసంగించారు. 'ఎన్నికల ప్రచారం కోసం మీరు కర్ణాటకకు వచ్చారు. గత మూడేళ్లలో మీరు కర్ణాటకకు ఏం చేశారో చెప్పాలి. అలాగే, వచ్చే అయిదేళ్లలో యువత, విద్య, ఆరోగ్యం, అవినీతిపై పోరు వంటి అంశాల్లో ఏం చేయాలనుకుంటున్నారో చెప్పాలి. అయితే, మీరు కర్ణాటక గురించి మాట్లాడటం లేదు. ఇక్కడి నేతలు బొమ్మై, యడ్యూరప్ప గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడరు. నరేంద్ర మోదీ గురించి మాత్రం చెప్పుకుంటున్నారు. ఈ ఎన్నికలు ఏ ఒక్కరి కోసమో కాదు. మోదీ గురించి కాదని గ్రహించాలి' అన్నారు. ''కర్ణాటకలో పర్యటనలప్పుడు సిద్దరామయ్య, శివకుమార్ వంటి కాంగ్రెస్ నేతలు ప్రజల కోసం ఏం చేశారో నేను చెబుతుంటా. మోదీ కూడా సీఎం బొమ్మై, మాజీ సీఎం యడియూరప్ప పేర్లను ఒకట్రెండుసార్లు ప్రస్తావిస్తే వారు కూడా సంతోషపడతారు కదా!'' అని రాహుల్ అన్నారు.

బీజేపీకి 40 సీట్లు చాలు

కర్ణాటకలో బీజేపీ సర్కారు 40 శాతం పర్సంటేజీలు తీసుకుంటోందని కాబట్టి ఈ ఎన్నికల్లో 40 సీట్లు ఇస్తే చాలని రాహుల్ అన్నారు. ప్రతి పనికీ కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్లు తీసుకుంటున్న బీజేపీని ఈసారి 40 సీట్లకే పరిమితం చేయాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో 150 సీట్లు కాంగ్రెస్ పార్టీకి ఇచ్చినట్లయితే తమ ఎమ్మెల్యేలను బీజేపీ లాక్కోలేదని అన్నారు. బీజేపీ గతంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మఠాధిపతుల నుంచీ వసూళ్లు చేసిందన్నారు.



బ్రిటన్ యువరాజు ఛార్లెస్ పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని రాయల్ మెయిల్ సంస్థ కొత్తగా తయారుచేసిన స్మారక తపాలా బిళ్లలు

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 2 : మే : 2023



సోమవారం చిత్రదుర్గ జిల్లా హిరియూరు వద్ద హైవేపై గాలి మర రెక్క తరలింపు. సుమారు 6 అంతస్తుల ఎత్తున్న రెక్కను టోల్ గేట్‌ను దాటించడానికి ట్రక్ సిబ్బంది చాలా ఇబ్బంది పడ్డారు

న్యూస్‌రీల్

కానిస్టేబుల్ ఆత్మహత్య



ఉమేశ్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: కుటుంబ కలహాల వల్ల పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నెలమంగల తాలూకా అగలగుప్పె గ్రామంలో చోటుచేసుకుంది. అగలగుప్పె గ్రామం నివాసి ఉమేశ్ (36) ఆత్మహత్య చేసుకున్న పీసీ. కుదూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉమేశ్ ఐదు నెలల క్రితం తన రెండవ కుమార్తె మరణించడంతో మానసికంగా కుంగిపోయాడు. దానికితోడు కుటుంబంలో గొడవల కారణంగా మనస్తాపంతో తన పొలంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దాబస్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్ ప్రమాదంలో ముగ్గురు మృతి

- ఎక్స్‌ప్రెస్ వే పై విషాదం



ప్రమాద దృశ్యం

దొడ్డబళ్లాపురం: బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్ వేపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ముగ్గురు ఒకే బైక్‌పై వెళుతూ వెనుక నుంచి కారును ఢీకొగా, ఆ వెనుక నుండి వచ్చిన మరో కారు వారి మీదకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్లే ముగ్గురూ తీవ్ర గాయాలతో మృత్యువాత పడ్డారు. వీరు బెంగళూరు నుండి మైసూరుకు వెళుతున్నారు. మృతదేహాలు, దెబ్బతిన్న వాహనాలతో ఘటనాస్థలి భీతావహంగా తయారైంది. కార్లలోని వారికి చిన్న చిన్న గాయాలు తగిలాయి. మృతుల వివరాలు తెలిసిరాలేదు. రామనగర ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నెలమంగళలో వరుస చోరీలు



సీసీ కెమెరాలో దొంగ చిత్రం

దొడ్డబళ్లాపురం: నెలమంగల పట్టణంలో ఆదివారం రాత్రి వరుస చోరీలు జరిగాయి. పట్టణ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో చోరీలు జరగడం ఆందోళనకు గురిచేస్తోంది. పట్టణంలోని బస్టాండు సమీపంలో రెండు మెడికల్ షాపులు, ఒక పాల డెయిరీ షాపులో చోరీలకి పాల్పడ్డాడు. చోరీ దృశ్యాలు సీసీ టీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. హెల్మెట్ పెట్టుకుని దుకాణాల షెట్టర్ తాళాలు పగలగొటి లోపలకు చొరబడ్డ దొంగ చేతికందిన నగదు, విలువైన వస్తువులు దోచుకున్నాడు. పల్సర్ బైక్‌లో వచ్చిన దొంగ 10 నిమిషాల్లో ఈ చోరీలు చేసి పరారయ్యాడు. దొంగతనాలతో పట్టణవాసుల్లో గుబులు నెలకొంది.

ఏనుగు దాడిలో ఒకరు మృతి

మైసూరు: అడవి ఏనుగు దాడిలో వ్యక్తి మరణించాడు. ఈ ఘటన సోమవారం ఉదయం కొడుగు జిల్లా తితిమతిలో జరిగింది. తితిమతి నివాసి మల్లంగడ సన్ని చంగప్ప (45) సోమవారం ఉదయం 8.30 గంటలకు తన పశువులను మేత కోసం కొండకు తీసువెళ్లాడు. ఈ సమయంలో వచ్చిన ఏనుగు అతనిపై దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోయాడు. అటవీ శాఖ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సంపూర్ణ ఆరోగ్య కిట్ ఇస్తాం..



మైసూరు: రేషన్‌లో 5 కేజీల బియ్యం, 5 కేజీల చిరుధాన్యాలతో పాటు అర లీటర్ నందిని పాలను చేర్చి సంపూర్ణ ఆరోగ్య కిట్‌ను ఇస్తామని సీఎం బసవరాజు బొమ్మై హామీ ఇచ్చారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి మంచి ఆహారం అందించడానికి ఈ ప్యాకేజీను తీసుకువస్తున్నట్లు సీఎం తెలిపారు. సోమవారం మైసూరులో బీజేపీ అభ్యర్థుల తరఫున రోడ్ షో నిర్వహించి ప్రచారం చేశారు. అంతకు ముందు మీడియాతో మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న రాగి, జొన్న వంటి చిరుధాన్యాలను వారి నుంచి కొనుగోలు చేసి వారికి అండగా నిలుస్తామన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తికి మంచి ప్రోత్సాహం లభిస్తోందని, రైతులు వీటి సాగుపై దృష్టి సారించాలన్నారు. తాను బడ్జెట్‌లో విద్యార్థినులకు, వెనుకబడిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రకటించినట్లు గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 75 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని తెలిపారు.

ఎన్నికల సందట్లో గంజాయి గుప్పు

- తనిఖీల్లో భారీగా దొరుకుతోన్న డ్రగ్స్
- ఓటర్లకు పంపిణీకని అనుమానాలు



తనిఖీలు ఉన్నప్పటికీ చాపకింద నీరులా గంజాయి రవాణా అవుతోంది



కొన్నిచోట్ల ఎన్నికల అవసరాల కోసం పంచుతున్నట్లు ఆరోపణలు

బనశంకరి: మెలకువగా ఉంటేనే మనుగడ సాగించగలరు, మత్తులో మునిగిపోతే విచక్షణ కోల్పోయి అథోగతి పాలవుతారు. ఇందులో డ్రగ్స్ పాపం ఎంతో ఉంది. ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకోవడానికి మద్యం, మాదకద్రవ్యాలను గతంలో కంటే ఎక్కువ ప్రమాణంలో వినియోగిస్తున్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. పంజాబ్ ఎన్నికల్లో డ్రగ్స్ అనేది ప్రధాన అంశంగా మారింది. అదే సమస్య కన్నడనాట కూడా పొడసూపుతోందనే ఆరోపణలున్నాయి.

గతం కంటే ఎక్కువగా

ఎన్నికల కమిషన్ మార్చి 29 తేదీ నుంచి అక్రమాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది, కార్లు, బస్సులు, లారీల్లో ముమ్మరంగా తనిఖీలు చేయగా భారీఎత్తున డ్రగ్స్ లభించడం గమనార్హం. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఇంకా 10 రోజులు సమయం ఉండగానే డ్రగ్స్ ఎక్కువగా దొరికాయి. కొందరు అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకోవడానికి నగదు, కానుకలు, మద్యం, వెండి, బంగారు సొత్తుతో పాటు మాదకద్రవ్యాలను కూడా పంచుతున్నారనే ఆరోపణలు తలెత్తాయి.

గంజాయితో పాటు ఖరీదైన డ్రగ్స్

ఇప్పటివరకు సోదాల్లో రూ.20 కోట్ల విలువచేసే డ్రగ్స్ లభించాయి. ఖరీదైన హాషీం, కొకైన్, ఎక్స్‌టసీ, ఎండీఎంఏ క్రిస్టల్స్ కూడా ఇందులో ఉన్నాయి. సీసీ కెమెరాలు నిఘా, ఫ్లయింగ్ స్క్వాడ్, స్థానిక బృందాలు, ఐటీ అధికారులు, ఎక్సైజ్, పోలీస్ వివిధ దర్యాప్తు బృందాలు పకడ్బందీగా రంగంలోకి దిగడంతో డ్రగ్స్‌ను పెద్దఎత్తున స్వాధీనం చేసుకున్నారు. 1,452 కేజీల గంజాయి, హాషీం, కొకైన్ తదితరాలు దొరగ్గా, ఇందులో గంజాయి అధిక మొత్తంలో లభ్యమైంది. కర్ణాటకలో గంజాయి సాగు లేకపోయినప్పటికీ తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలనుంచి అక్రమంగా రవాణా అవుతుంది. కూలీల మాదిరిగా బ్యాగుల్లో వేసుకుని రైళ్లు, బస్సుల్లో వస్తారు. అక్కడి నుంచి కావలసినచోటుకు తరలిస్తారు. తమ బృందాలు గాలింపు ముమ్మరం చేయడంతో ఇంతమొత్తంలో డ్రగ్స్ పట్టుబడినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మనోజ్‌కుమార్ మీనా తెలిపారు.

ఐటీ సిటీలో రూ.కోటి గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి మూటల్లో ఇవి కొన్ని

కృష్ణరాజపురం: బెంగళూరులో రూ. కోటి విలువ చేసే గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీజే హళ్లి పోలీసుల తనిఖీల్లో రూ. కోటి విలువ చేసే సుమారు 250 కేజీల గంజాయి పట్టుబడింది. నిందితులు సయ్యద్, జొల్లు ఇమ్రాన్ అనే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించిన గంజాయిని ఇంటిలో నిల్వ చేసి ఉంచారని తెలిసి డీజే హళ్లి పోలీసులు సోమవారం సోదాలు జరిపారు. సంచుల్లో నిల్వ ఉంచిన గంజాయి పట్టుబడింది.

ఏంజిల్‌కు ఘన వీడ్కోలు



ఏంజిల్ జాగిలాన్ని సత్కరిస్తున్న ఎస్పీ ధరణీదేవి

కేజీఎఫ్: కేజీఎఫ్ డీఏఆర్ యూనిట్‌లో గత 8 ఏళ్లుగా విధులు నిర్వహించిన పోలీస్ శ్వానం ఏంజిల్ వయో నివృత్తి పొందడంతో సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీ ధరణీదేవి ఏంజిల్‌కు శాలువా కప్పి, పూల మాల వేసి సత్కరించారు. ఏంజిల్ 2014 నవంబర్ 1న జన్మించింది. 2015 మార్చి 13న డీఏఆర్ యూనిట్‌లో ఉద్యోగంలో చేరింది. ఏంజిల్ లాబ్రెడార్ జాతికి చెందిన ఆడ శునకం. వీఐపీల వేదిక భద్రత, పేలుడు పదార్థాలను గుర్తించే పనిలో చురుగ్గా పాల్గొనేది. ఏంజిల్ 10 సార్లు భారత రాష్ట్రపతి బందోబస్తు నిర్వహణలో పాల్గొని ఉత్తమ సేవకు అవార్డులు కూడా పొందింది.

మహిళ చేతిలో యువకుడు హత్య

- బెళగావి వద్ద ఘాతుకం



నాగరాజు, జయశ్రీ (ఫైల్)

యశవంతపుర: మహిళ చేతిలో యువకుడు హత్యకు గురయ్యాడు. బెళగావి నగరంలో సంఘటన జరిగింది. వివరాలు.. మహారాష్ట్ర కరాడ్ గౌండిలో పని చేస్తున్న నాగరాజ భీమ పాటిల్ (28) స్వగ్రామమైన తారిహళ రామేశ్వర జాతరకు వచ్చాడు. ఆదివారం రాత్రి బెళగావికి వెళ్లి బట్టలు కొన్నాడు. తిరిగి తారిహళ్‌కు వెళ్లి రోడ్డు పక్కలో నిలబడి ఉండగా, స్థానిక కంగ్రాళి కేహెచ్ గ్రామానికి చెందిన జయశ్రీ పవార్ (40) నడిచి వెళ్తు నాగరాజును చూసి అతని మొబైల్‌ఫోన్‌ను అడిగింది. నా మొబైల్‌తో నీకేం పని అని పాటిల్ ప్రశ్నించగా ఇద్దరి మధ్య గలాటా జరిగింది. మద్యం మత్తులో ఉన్న జయశ్రీ అతన్ని కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బెళగావి జిల్లా ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. బెళగావి మార్కెట్ పోలీసులు నిందితురాలిని అరెస్ట్ చేశారు.

నడివేసవిలో కుండపోత



సోమవారం సాయంత్రం బెంగళూరు జేసీ రోడ్డులో వర్షం దృశ్యం



సోమవారం రాత్రి మైసూరులో వర్షం

- బెంగళూరులో భారీ వర్షాలు
- మరో 3 రోజులు ఇంతే
- పార్టీల ప్రచారానికి ఆటంకం

బనశంకరి: నట్ట నడి వేసవిలో బెంగళూరును కుండపోత వర్షాలు ముంచెత్తడం విశేషం. సిలికాన్ సిటీలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు అత్యధిక వర్షం (111.5 మిల్లీమీటర్లు) ఆదివారం అర్ధరాత్రి కురిసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు 31.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కేఆర్.పురం, కేఆర్.మార్కెట్, టౌన్‌హాల్, కేఆర్.సర్కిల్, బసవనగుడి, పద్మనాభనగర, బనశంకరి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. బళ్లారి రోడ్డులో అండర్‌పాస్ జలమయమై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజరాజేశ్వరినగరలో అధికంగా 35 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అరికెరెలో 32, కెంగేరి 22, బొమ్మనహళ్లి 19, హంపినగర 18.5, బిలేకహళ్లి 17, సింగసంద్ర 15.50 , హెచ్.గొల్లహళ్లి 11.5 మిల్లీమీటర్లు నమోదైంది. మిగిలినచోట్ల జల్లులతో కూడిన వర్షం పడింది. వర్షం కారణంగా అనేకమంది అభ్యర్థుల రోడ్ షోలు, సభలు రద్దయ్యాయి. సమయం తక్కువగా ఉండగా, వర్షాల వల్ల ప్రచారం నిలిచిపోవడంతో పార్టీల్లో కలవరం నెలకొంది.



ఐటీ సిటీని వీడని వరుణుడు



ఓ అండర్‌పాస్ జలమయం

నేడు భారీ వర్షసూచన

రానున్న మూడు నాలుగురోజులు బెంగళూరులో వర్షాలు కొనసాగవచ్చు, మంగళవారం విస్తారంగా వర్షం కురుస్తుందని వాతావరణశాఖ ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది. గత 24 గంటల అవధిలో హొరమావులో 111.5 మిల్లీమీటర్ల రికార్డుస్థాయిలో వానలు పడ్డాయి. ఈ ఏడాదిలో కురిసిన గరిష్ట వర్షం ఇదే. తాజా వర్షాల వల్ల వేసవి వేడి నుంచి నగరవాసులకు ఉపశమనం కలిగింది. మరోవైపు మైసూరులోనూ భారీ వర్షం కురిసింది.

110 సీట్లలో పోటీ: ఉపేంద్ర



శివాజీనగర: పార్టీ మీదే, అధికారం మీదే అనేదే మా నినాదమని ఉపేంద్ర అన్నారు. సోమవారం ప్రముఖ నటుడు, దర్శకుడు ఉపేంద్ర తన ప్రజాకీయ పార్టీ అభ్యర్థులతో కలసి బెంగళూరులో ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 110 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను పరిచయం చేశారు. ఉప్పి మాట్లాడుతూ ప్రజల డిమాండ్ మాకు తెలుసు. ఎంపికలు, ఎన్నికలు, తప్పులు దిద్దడం తమ సూత్రమని చెప్పారు. ఆయా నియోజకవర్గాల ఓటర్లచే తమ అభ్యర్థులను ఎంపిక చేయించి వారికి బీ ఫారం ఇచ్చామని తెలిపారు. తమ పార్టీ తరఫున ఎవరూ ప్రచారం చేయాల్సిన అవసరం లేదని చెప్పారు.

బెంగళూరు రాజధాని ప్రాంతం!



- బీజేపీ మేనిఫెస్టోలో వెల్లడి

బనశంకరి: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో బెంగళూరు నగరానికి అనేక హామీలు గుప్పించింది. భవిష్యత్ తరాల కోసం బెంగళూరును రాష్ట్ర రాజధాని ప్రాంతం (ఎస్‌సీఆర్)గా రూపొందిస్తామని తెలిపింది. ఉదాహరణకు ఢిల్లీలో జాతీయ రాజధాని (ఎన్‌సీఆర్) ప్రాంతం ఉంది, ఇక్కడ ప్రత్యేక వసతులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. దేవనహళ్లి, హొసకోటే, తుమకూరు, కనకపుర, రామనగర, అనేకల్ ప్రాంతాలు బెంగళూరుకు దగ్గరిలోనే ఉంటాయి. రానున్న రోజుల్లో ఈ ప్రాంతాలన్నింటితో కలిపి బెంగళూరును అభివృద్ధి చేయాలనేది ఎస్‌సీఆర్ లక్ష్యమని తెలిపారు. బెంగళూరు గ్రామాంతర ప్రాంతాలు, నగరం చుట్టుపక్కల ప్రాంతాలు వస్తాయా అనేదానిపై స్పష్టత లేదు. ఒకవేళ ఈ ప్రాంతాలతో కలిపి అభివృద్ధి చేస్తే మరింత బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

కార్మిక సంక్షేమానికి కేంద్రం తూట్లు

- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ధ్వజం

శివాజీనగర: కార్మికులకు అనుకూలమయ్యే పలు చట్టాలను గతంలో తమ ప్రభుత్వం తీసుకువస్తే, వాటిని ఒక్కొక్కటిగా తొలగించే పని చేస్తోందని కేంద్రంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సోమవారం నగరంలో ఆయన కేపీసీసీ ఆఫీసులో మాట్లాడారు. కార్మికుల శ్రమతోనే ప్రపంచమంతా నేడు నిలిచింది, కార్మికుల వల్లనే మనం జీవిస్తున్నామని అన్నారు. నేటి కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని దుయ్యబట్టారు. ధనవంతుల, పారిశ్రామికవేత్తల బాగు కోసం చట్టాలను చేస్తోందని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. శారీరక మానసిక ఆరోగ్యానికి చేటు చేసే రోజుకు 12 గంటలు పనిచేసే చట్టాన్ని తేవడం సమంజసం కాదన్నారు. ఇంగ్లాండ్ లాంటి దేశంలో రోజుకు 8 గంటలే పనిచేయాలన్నారు. కార్మికుల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వానికి శ్రద్ధ లేదని విమర్శించారు.

మూడు రోజులు మద్యం దుకాణాల బంద్

బనశంకరి: ఈనెల 10న రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ జరగనుండటంతో కర్ణాటకలో మూడురోజుల పాటు మద్యం దుకాణాలు బంద్ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఈ నెల 8 తేదీ అర్ధరాత్రి నుంచి 10 తేదీ అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలను నిషేధించారు. 10 తేదీ పోలింగ్ జరుగుతుంది. 13న ఎన్నికల కౌంటింగ్ ఉండటంతో మళ్లీ 12 తేదీ అర్ధరాత్రి నుంచి 13 తేదీ అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలను నిషేధించారు. అంతటా వైన్ షాపులు, బార్లను మూసివేయాలని, అక్రమంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్మిక లోకం.. సమాజానికి బలం




మే డే సందర్భంగా బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో కార్మిక సంఘాల ప్రదర్శన



మరోవైపు యథావిధిగా పనుల్లో నిమగ్నమైన కూలీలు. వెస్ట్ కార్డు రోడ్డులో దృశ్యం

రైతుల కోసం ఎన్నో పథకాలు

- గుబ్బి సభలో కేంద్ర మంత్రి అమిత్ షా



తుమకూరు: జిల్లాలోని గుబ్బి తాలూకా సోమవారం కాషాయమయంగా మారింది. గుబ్బిలోని గోసళలో ఉన్న శ్రీ చెన్నబసవేశ్వర ఆలయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రోడ్‌షో జరిపి సభలో పాల్గొన్నారు. రైతుల కోసం బీజేపీ మేనిఫెస్టోలో అనేక కార్యక్రమాలు, పథకాలు ప్రకటించినట్లు షా తెలిపారు. బీజేపీని గెలిపించి రైతులు లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఈసారి బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థులకు ఓటేయాలని మనవి చేశారు. తాము 4 శాతం ముస్లిం రిజర్వేషన్లను తొలగించి ఒక్కలిగ, లింగాయతులు, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించినట్లు తెలిపారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ ముస్లింలకు రిజర్వేషన్ ఇస్తుందని అన్నారు. ఈ రోడ్ షోలో వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



తుమకూరు జిల్లా గుబ్బిలో రోడ్ షోలో అమిత్ షా

క్లుప్తంగా

అవ్వా.. మీ ఆశీస్సులు అందించండి



అవ్వ కాళ్లకు నమస్కరిస్తున్న సోమశేఖరరెడ్డి

సాక్షి,బళ్లారి: అవ్వా, తాతల కాళ్లకు నమస్కరించి వినూత్న తరహాలో ఓటర్లను ఆకట్టుకునేలా నగర బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి ప్రచారం చేశారు. సోమవారం ఆయన 37వ వార్డులోని దేవినగర్‌తో పాటు పలు వార్డుల్లో ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయా కాలనీల్లో వృద్ధుల కాళ్లకు నమస్కరించి మీ ఆశీస్సులు అందించి తనను గెలిపించాలని కోరారు. నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసినా ఇంకా చేయాల్సింది చాలా ఉందని, మళ్లీ గెలిపిస్తే పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేస్తానన్నారు.

నాది విజయపురనే

విజయపుర: తాను కోలారు జిల్లా నుంచి వలస వచ్చానని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని, కానీ అదంతా పచ్చి అబద్ధమని మాజీ ఎంపీ, దేవనహళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేహెచ్ మునియప్ప అన్నారు. తాను విజయపుర సమీపంలోని కంబదహళ్లిలో జన్మించిన వ్యక్తినని, తన అవ్వ చన్నళ్లికి చెందిన వ్యక్తి అని, తాను దేవనహళ్లిలో పెరిగానని చెప్పారు. పట్టణ సమీపంలోని భట్టరేనహళ్లి గ్రామంలో శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో మునియప్ప ప్రత్యేక పూజలు చేసి ప్రచారం చేశారు.

ఆంధ్రాళ్ అభివృద్ధికి కృషి చేస్తా



ప్రచారం చేస్తున్న అభ్యర్థి భరత్‌రెడ్డి తదితరులు

బళ్లారి అర్బన్: ఆంధ్రాళ్‌లో ప్రభుత్వ ఆస్పత్రి, సముదాయ భవన నిర్మాణానికి కృషి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి తెలిపారు. సోమవారం 8వ వార్డు కార్పొరేటర్ రామాంజినేయులు సమక్షంలో అక్కడ చేపట్టిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిని 10వ తరగతి వరకు పెంచుతామన్నారు. హెచ్ఎల్‌సీ కాలువ వద్ద గట్లపై కంచె వేయిస్తానన్నారు. 24 గంటలు తాగునీరు అందేలా ఇంటింటా కొళాయి వేయిస్తామన్నారు. మేయర్ త్రివేణి, కాంగ్రెస్ నాయకుడు బోయపాటి విష్ణు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



స్తంభాలపై ఎగసి పడుతున్న మంటలు

బళ్లారిఅర్బన్: నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డు ఇందిరా సర్కిల్‌లో రాఘవ కళా మందిరం వద్ద విద్యుత్ డిపోలో సోమవారం ఉదయం 9 గంటలకు సుమారు 10 నిమిషాల పాటు మంటలు ఎగిసి పడటంతో అక్కడ ఉన్న ఆటో డ్రైవర్లు, స్థానికులు భయాందోళనకు గురై దూరంగా పరుగులు తీశారు. 10 నిమిషాల తర్వాత డిపో పేలిపోవడంతో మంటలు నిలిచిపోయాయి. కేఈబీ అధికారులు అక్కడికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు.

గ్రామాల్లో ముమ్మర ప్రచారం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సురేష్‌బాబు

కంప్లి: ఓ చిన్న ఘటనతో మనస్తాపం చెంది ఐదేళ్లుగా సురేష్‌బాబుకు దూరం అయ్యామని, ఆ తప్పు తెలుసుకొని తిరిగి సొంత గూటికి చేరినట్లు ఎమ్మిగనూరు రైతు ప్రముఖులు ఈ.మోహన్‌రెడ్డి, ఆయన అనుచరులు తెలిపారు. బీజేపీ అభ్యర్థి టీహెచ్.సురేష్‌బాబు ఎమ్మిగనూరు తర్వాత రామచంద్రపురక్యాంప్‌లో ప్రచారం చేస్తుండగా కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా గుమిగూడి సురేష్‌బాబు వద్ద తమ ఆవేదన వ్యక్తం చేసి మళ్లీ బీజేపీలో చేరారు.

ఆప్ అభ్యర్థి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న దొడ్డకేశవరెడ్డి

బళ్లారిఅర్బన్: నగరంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అభ్యర్థి కొర్లగుంది దొడ్డకేశవరెడ్డి సోమవారం పలు వార్డుల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బెంగళూరు రోడ్డు బండిమోట్, గొల్లరహట్టి, తేరువీధి, కాళమ్మ వీధి, హుస్సేన్ నగర్, పటేల్‌నగర్ తదితర వీధుల్లో ప్రచారం చేపట్టారు. ఆప్‌ని గెలిపిస్తే అవినీతిని నిర్మూలిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో అసమ్మతి భగ్గు

- కేఆర్‌పీపీలోకి మాజీ మంత్రి ముండ్లూరు దివాకర్‌బాబు?

సాక్షి,బళ్లారి: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది జగమెరిగిన సత్యం. ప్రస్తుతం నగర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయాల్లో శత్రువులుగా ఉన్న మాజీ మంత్రి ముండ్లూరు దివాకర్‌బాబు, గాలి జనార్దనరెడ్డి వర్గాలు ఒక్కటవుతాయని నగరంలో జోరుగా చర్చ సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు మరో వారం రోజులు మాత్రమే గడువు ఉన్న తరుణంలో దివాకర్‌బాబు చేరికతో నగరంలో కేఆర్‌పీపీ మరింత బలం పుంజుకుంటుందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

ప్రచారానికి దూరంగా దివాకర్‌బాబు

నగర కాంగ్రెస్‌లో బలమైన నేతగా గుర్తింపు పొందిన మాజీ మంత్రి దివాకర్‌బాబు పార్టీ అభ్యర్థి నారా భరత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారానికి వెళ్లడం లేదు. భరత్‌రెడ్డి నామినేషన్ వేసినప్పటి నుంచి ఆయన కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన, పార్టీకి ఎంతో సేవ చేసిన తనలాంటి సీనియర్ నాయకుడిని పక్కన పెట్టి టికెట్ కేటాయింపులో ధన బలం ఉన్నవారికే ప్రాధాన్యత ఇవ్వడంపై కినుక వహించినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.



ముండ్లూరు దివాకర్‌బాబు

మద్దతుదారులతో జోరుగా మంతనాలు

రెండు రోజులుగా రూపనగుడి రోడ్డులోని గంగప్ప జిన్‌లోని తన కార్యాలయంలో మద్దతుదారులతో విస్తృతంగా చర్చించిన దివాకర్‌బాబు పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కాకుండా కేఆర్‌పీపీ అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణకు మద్దతు ఇచ్చి ఆమెను గెలిపించాలనే ఉద్దేశ్యంతో దివాకర్‌బాబు రాజకీయంగా అడుగులు వేస్తుండటంతో నగరంలో హాట్ టాపిక్‌గా మారింది.

ఫుట్‌బాల్ ఆడేందుకు సిద్ధమని ప్రకటన

నగరంలో దివాకర్‌బాబుకు ప్రతి ఒక్కరూ దాదాపు సుపరిచితులే. అందరినీ పేరుతో పలకరించడంతో పాటు సన్నిహిత సంబంధాలు ఉన్న నేతగా గుర్తింపు ఉంది. ఆయన తాను ఈ ఎన్నికల్లో ఫుట్‌బాల్ ఆడతానని, కేఆర్‌పీపీకి మద్దతు ఇచ్చి లక్ష్మీ అరుణ గెలుపునకు కృషి చేస్తానని, పార్టీ శ్రేణుల్లో తన వెంట వచ్చే వారు రావచ్చని, రాని వారు వారి దారి చూసుకోవచ్చని విలేకరులతో చెప్పడం గమనార్హం. ఈ పరిణామంతో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ తగిలే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఫుట్‌బాల్‌కు ఓటుతోనే నగరాభివృద్ధి



మా ఓటు మీకే అని అభ్యర్థిని లక్ష్మీఅరుణని హత్తుకుంటున్న మహిళా ఓటరు

సాక్షి,బళ్లారి: నగర నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఇంటింటా తిరిగి ప్రచారం పూర్తి చేశామని కేఆర్‌పీపీ నగర అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ అన్నారు. ఆమె సోమవారం నెహ్రూ కాలనీలో ఇంటింటా ప్రచారం చేసిన సందర్భంగా మాట్లాడారు. కేఆర్‌పీపీ గుర్తు ఫుట్‌బాల్‌ను ప్రతి ఓటరుకు తెలియజేసేలా ప్రచారం చేశామన్నారు. ప్రతి చోట ప్రజలు తనను వారి ఇంటి ఆడపడుచులా భావించి ఒడినింపారన్నారు. వారు చూపిన అభిమానం చూస్తే తప్పకుండా తాను గెలుస్తాననే నమ్మకం ఏర్పడిందన్నారు. గతంలో తన భర్త గాలి జనార్దనరెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్నప్పుడు నగరంలో చేసిన అభివృద్ధి పనులను నేటికీ జనం తలుచుకుంటున్నారన్నారు. ఆయనతోనే నగరాభివృద్ధి సాధ్యమనే విశ్వాసం వారిలో ఉందన్నారు. తాను గెలిచిన తర్వాత మౌలిక సదుపాయాలతో పాటు గుడిసె లేని నగరంగా తీర్చిదిద్దుతానన్నారు.

కాంగ్రెస్ నేత కేఆర్‌పీపీలో చేరిక

బసవనకుంటకు చెందిన కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెస్సూ కేఆర్‌పీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన సోమవారం నగరంలోని నెహ్రూకాలనీల్లో బీకేబీఎస్ స్వగృహంలో కేఆర్‌పీపీ నగర అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేఆర్‌పీపీని గెలిపిస్తే మరింతగా నగరం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీ ప్రముఖులు సంజయ్ బెటగేరి, ప్రకాష్‌రెడ్డి, బీకేబీఎస్ మూర్తి, హంపీ రమణ, మల్లికార్జున ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

రాయచూరు రూరల్: తాలూకాలోని మన్సలాపూర్ రహదారి పక్కన సుమారు 40 ఏళ్ల వయస్సుగల ఓ వ్యక్తి చెట్టుకు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు, ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగిందని, సోమవారం మృతదేహాన్ని పంచనామాకు తరలించినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు.

మొబైల్ చార్జర్ షాక్ కొట్టి..

సింధనూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఆదివారం రాత్రి సింధనూరులో భారీ వర్షం కురిసింది. నగరంలోని 31 వార్డులో ఖాదర్ ఫాషా(25) మొబైల్‌ను చార్జింగ్‌కు పెట్టారు. చార్జింగ్‌ను తీయబోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పంచనామా కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

వాడీవేడిగా అభ్యర్థుల ప్రచారం



ప్రచారం చేస్తున్న కరియమ్మ

రాయచూరు రూరల్: జిల్లాలో వివిధ పార్టీల అభ్యర్థులు వాడీవేడిగా ప్రచారం చేపట్టారు. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ శాలం బైరూన్ కిల్లాలో ఇంటింటికీ తిరిగి పార్టీని గెలిపించాలన్నారు. వడవాటిలో ఆప్ అభ్యర్థి సుభాష్ చంద్ర శంభూజీ, బీజేపీ అభ్యర్థి శివరాజ్ పాటిల్, జేడీఎస్ అభ్యర్థి వినయ్ కుమార్, స్వతంత్ర అభ్యర్థి బసవరాజ్ కళస, ముజుబుద్దీన్, దిన్నిలో బీజేపీ అభ్యర్థి తిప్పరాజ్, చంద్రబండలో కాంగ్రెస్ అభ్యర్థి బసనగౌడ దద్దల్, మాన్విలో బీజేపీ అభ్యర్థి బీ.వీ.నాయక్, కల్లూరులో జేడీఎస్ అభ్యర్థి రాజా వెంకటప్ప నాయక్, దేవదుర్గలో బీజేపీ అభ్యర్థి శివనగౌడ నాయక్, జేడీఎస్ అభ్యర్థిని కరియమ్మ, కాంగ్రెస్ అభ్యర్థిని శ్రీదేవి నాయక్‌లు ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

నేడు సింధనూరుకు ప్రధాని మోదీ

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరులో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రమానంద యాదవ్ తెలిపారు. ప్రచార సభలో యాదగిరి, రాయచూరు, కొప్పళ, బళ్లారి జిల్లాల అభ్యర్థులు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొంటారని తెలిపారు.

పనివేళల పొడిగింపు తగదు



మేడే వేడుకలో పాల్గొన్న నేతలు, కార్మికులు

హొసపేటె: కార్మికులకు పని వేళల పొడిగింపు తగదని సీఐటీయూ జిల్లా నేత ఆర్.భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం శ్రమిక భవనంలో కార్మిక దినోత్సవం సందర్భంగా ధ్వజారోహణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా జంబయ్యనాయక, కరుణానిధి, ప్రకాష్, గోపాల్, రమేష్, తాయప్ప నాయక, రాజు, యల్లాలింగ పాల్గొన్నారు.

హమాలీలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

కంప్లి: పట్టణంలోని బజార్ హమాలీలకు స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వడంపై జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టాలని బజార్ హమాలీ సంఘం అధ్యక్షుడు చలువాది దేవప్ప ఒత్తిడి చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద కార్మిక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి సన్మానం



ఉత్తమ విద్యార్థిని వర్షికను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి: గురువు అనుగ్రహానికి ఉపదేశాలు పాలించాలని దైవానుగ్రహ జ్యోతిష్యులు ప్రకాష్ వైద్య తెలిపారు. సోమవంశ ఆర్యక్షత్రియ చిత్రగార సమాజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిమిషాంబదేవి జయంతిని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ న్నారు. కార్యక్రమంలో సమాజ అధ్యక్షులు తులసిరి హూబాళె, పదాధికారులు నగరాభివృద్ధి పోరాట సమితి అధ్యక్షులు ఎస్.పూజె, లాల్‌గొండ సమాజ రాష్ట్ర అధ్యక్షులు అరవి బసవనగౌడ, జైన్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు శాంతిలాల్ సింఘ్వి, రైతు డీ.కృష్ణంరాజు, మహిళా పదాధికారులు పాల్గొన్నారు. అనంతరం ద్వితీయ పీయూసీ పరీక్షలో అధిక మార్కులు పొందిన వర్షిక ఎం.చిత్రగార్‌ను సన్మానించారు.

కార్మికులను ఆదుకోవాలి



కార్మిక నేతలకు నాయకుల లాల్ సలాం

రాయచూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శరణ బసవ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో 137వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవంలో మాట్లాడారు. ఎస్‌యూసీఐ అభ్యర్థి వీరేష్‌తో పాటు పద్మ, సులోచన, వరలక్ష్మి, మహేష్, చెన్నబసవలున్నారు.

నా ఇంటిపై ఐటీ దాడులు: వినయ్



హుబ్లీ: హైకోర్టు ఎన్నికల ప్రచారానికి నాకు అనుమతి ఇవ్వలేదు. దీంతో నియోజకవర్గం బయట ఉండి పనులు చేస్తున్నాను. నియోజకవర్గ ప్రజలు ఈసారి కాంగ్రెస్‌ను ఆదరిస్తారని ఆ పార్టీ ధార్వాడ గ్రామీణ అభ్యర్థి, మాజీ మంత్రి వినయ్ కులకర్ణి తెలిపారు. ఆయన సోమవారం కిత్తూరులో విలేకరులతో మాట్లాడారు. గత 23 ఏళ్లుగా క్షేత్రంలో పని చేశాను. అందుకు గాను ఈసారి ప్రజల ఆశీర్వాదం తనకు తప్పకుండా ఉంటుందన్నారు. తన ఇంటి పైన, తన మద్దతుదారుల ఇంటిపై ఐటీ దాడులు చేయిస్తున్నారన్నారు. తనపై బీజేపీ కుట్రకు పాల్పడిందన్నారు. తన పీఏల ఇళ్లపైన కూడా ఐటీ దాడులు చేశారన్నారు. విచారణ పేరుతో తన ఆప్తులను 5 రోజుల పాటు బయటకు వదలలేదన్నారు. ఇది ప్రజాస్వామ్య దారుణ హత్య అని మండిపడ్డారు. తన ప్రత్యర్థి అమృత దేశాయి లంచం తీసుకొని ప్రభుత్వ ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. తన క్షేత్రంలో స్టార్ ప్రచారకుల ఆవశ్యకత లేదని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిని బలపరుద్దాం



మాట్లాడుతున్న కృష్ణప్ప నాయక

గంగావతి: ఈసారి ఎన్నికల్లో కేపీసీసీ కార్యాధ్యక్షులు సతీశ్ జార్కిహొళి మార్గదర్శనంలో కాంగ్రెస్ పార్టీలోని వాల్మీకి సమాజ నాయకులు, కార్యకర్తలు క్షేత్ర అభ్యర్థి ఇక్బాల్ అన్సారి గెలుపునకు శ్రమించాలని మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.కృష్ణప్ప నాయక పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం పత్రికా భవనంలో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి సమాజం ఒక పార్టీకి పరిమితం కాకుండా నేడు అన్ని పార్టీల్లో ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. జోగద లింగప్ప నాయక, లక్ష్మణ వడకి, జోగద శివు, జోగద లింగేశ్ నాయక, కోల్కర్ లక్ష్మణ, గిరీశ్ నాయక, నాగరాజ్ గుడ్డేకల్, రమేశ్ గుడ్డేకల్, శరణప్ప మల్లప్ప నాయక, జోగద రవి నాయక తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ అభ్యర్థి ప్రచారం

బళ్లారి రూరల్: జిల్లాలోని సండూరు నియోజకవర్గంలో జేడీఎస్ అభ్యర్థి సోమప్ప ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం నాగేనహళ్లి, మోతలకుంట, గొల్లలింగమ్మనహళ్లి, బొమ్మలగుండ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. హాట్రిక్ వీరులు చేసిందేమీ లేదని, ఒకసారి తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట పార్టీ ప్రముఖులు, అభిమానులు ఉన్నారు.



నాగేనహళ్లిలో ప్రచారం చేస్తున్న సోమప్ప

యువతకు ఉపాధి కల్పిస్తా

- కూలీలతో కలిసి పని చేసిన బీజేపీ అభ్యర్థిని



మట్టి గంపను మోస్తున్న అభ్యర్థిని మంజులా కరడి

గంగావతి రూరల్: కొప్పళ క్షేత్రం బీజేపీ అభ్యర్థిని మంజులా కరడి ప్రచారంలో భాగంగా సోమవారం కార్మిక దినోత్సవం సందర్భంగా బహదూర్ బండి చెరువులో నరేగా కూలీలతో కలిసి పని చేసి ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే క్షేత్రంలో ప్రజలకు మరింత ఉపాధి కల్పిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల్ని బదిలీ చేయకుంటే ధర్నా చేస్తాం

- ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి: క్షేత్ర ఎన్నికల అధికారి, తహసీల్దార్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ అందరూ బీజేపీ ఏజెంట్లుగా పని చేస్తున్నారని, వెంటనే వారిని ఇక్కడి నుంచి బదిలీ చేయాలని, లేని పక్షంలో జిల్లాధికారి కార్యాలయం ముందు కాంగ్రెస్ కార్యకర్తలతో ధర్నా చేపడతామని ఎమ్మెల్యే గణేష్ హెచ్చరించారు. సోమవారం నెంబర్-10 ముద్దాపురంలో ఇంటింటికీ వెళ్లి ఓటరు ఐడీ సంఖ్యను పొంది బీజేపీ అభ్యర్థి సురేష్‌బాబు ఫోటో ఉన్న స్లిప్‌ను అందించి ప్రతి ఓటరు పేరిట మీ ఖాతాలో రూ.వెయ్యి వేస్తామని చెబుతున్న ఒక యువకుడిని ఎమ్మెల్యే గణేష్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్న సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి తాలూకా యంత్రాంగం, పోలీసు అధికారులు బీజేపీ పరంగా పని చేస్తున్నారని ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. అభ్యర్థి పరంగా స్లిప్‌లు అందిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తల ఇళ్లపై తహసీల్దార్, సీఐ దాడి చేసి బెదిరిస్తున్నారన్నారు. రెండు రోజుల్లోగా ఎన్నికల ఆర్ఓ, తహసీల్దార్, సీఐపై తగు చర్యలు తీసుకోకుంటే కలెక్టరేట్ ముందు కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిఘటన తప్పదన్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీ సభ్యులు శ్రీనివాసరావు, ప్రముఖులు కట్టి వెంకటేష్, విజయ మహంతేష్, కే.షణ్ముఖప్ప, హబీబ్ రహిమాన్, కారేకల్ మనోహర్, ఆదిశేషు, మావినహళ్లి బసవరాజ్, బీ.జాఫర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేఎన్.గణేష్

శెట్టర్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలి

హుబ్లీ: కాంగ్రెస్‌కు దమ్ముంటే జగదీశ్ శెట్టర్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని బీజేపీ నేత బసనగౌడ పాటిల్ యత్నాళ్ సవాల్ విసిరారు. నగరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లింగాయత్ సీఎంలు అవినీతిపరులని సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. లింగాయత్‌ల జపం చేస్తూ ఉన్నఫళంగా కాంగ్రెస్ ప్రేమ కురిపిస్తోందన్నారు. లింగాయత్‌లకు ఇచ్చిన 2డీ రిజర్వేషన్ ఎప్పటికీ తొలగించడం సాధ్యం కాదన్నారు. సిద్దరామయ్య వల్ల లింగాయత్‌లకు న్యాయం జరగదన్నారు. గ్యారంటీ కార్డులపై వారంటీ లేని కాంగ్రెస్‌కార్డులు అని ధ్వజమెత్తారు. శెట్టర్ కాంగ్రెస్‌లో చేరిక పెద్ద తప్పు అని, ఎవరి సలహాతో ఆయన ఇలాంటి నిర్ణయం తీసుకున్నారో తెలియదన్నారు. శెట్టర్ బీజేపీని వీడితే లింగాయత్‌లకు ఎలా అన్యాయం జరిగినట్లు అని ప్రశ్నించారు. శెట్టర్ తన క్షేత్రంలో ప్రచారం చేసినా ఎన్నికల ఫలితంపై ఎటువంటి ప్రభావం ఉండబోదన్నారు.



మాట్లాడుతున్న బసనగౌడ పాటిల్ యత్నాళ్

హెచ్చెల్సీలో చేపల వేట

బళ్లారి రూరల్: తోరణగల్లులోని హెచ్చెల్సీ కాలువ వద్ద పెద్దసంఖ్యలో జనం చేపల వేట చేపడుతున్నారు. కాలువలో నిలిచిఉన్న నీటిలో ఎగిరి పడుతున్న చేపలను కర్రలతో కొట్టి సంచుల్లోకి వేసుకొంటున్నారు. సోమవారం మేడే సెలవు రోజు కావడంతో జిందాల్ కార్మికులందరూ కాలువలో చేపల వేటలో నిమగ్నమయ్యారు.



హెచ్చెల్సీలో చేపల కోసం గాలిస్తున్న జనం

కోలారు వార్తలు...

మహిళామణుల ప్రచారం

కోలారు: జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్ తరపున సోమవారం మహిళలు ప్రచారంలోకి దిగారు. తాలూకాలోని అరాభికొత్తనూరు జీపీలోని గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. మహిళలకు కరపత్రాలతో పాటు పసుపు కుంకుమను ఇచ్చి ఓట్లు అభ్యర్థించారు. ఈ ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేస్తున్న సౌమ్యుడైన శ్రీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులకు యూనిఫారం అందిస్తున్న దృశ్యం

కోలారు: బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో జరుగుతున్న అండర్-16 రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కర్ణాటక అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జయదేవ్ సోమవారం యూనిఫాంను అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో రాణించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలని కోరారు. ఈ సందర్భంగా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అంచె అశ్వథ్, కార్యనిరత పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే చోట అభ్యర్థుల ప్రచారం

కేజీఎఫ్: జైన్ కళాశాలలో పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం వద్దకు కాంగ్రెస్ అభ్యర్థి రూపా శశిధర్, బీజేపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే వై.సంపంగి ఒకేసారి వెళ్లి ఓట్లు అడిగే ప్రయత్నం చేశారు. పోలింగ్ సిబ్బందికి పోస్టల్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించడం వల్ల శిక్షణా శిబిరం వద్ద సిబ్బంది అంతా ఉంటారని తెలిసి ఓట్లు అడగడానికి వచ్చారు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన తహసీల్దార్ ఎన్నికల సిబ్బందికి శిక్షణ ముగిసిన అనంతరం ఓట్ల అభ్యర్థనకు అవకాశం కల్పిస్తామని చెప్పడంతో ఇరు పార్టీల వారూ అక్కడి నుంచి తరలి వెళ్లారు.

ప్రతి ఒక్కరూ ఓటేయాలి

హొసపేటె: ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజయనగర జిల్లాధికారి వెంకటేష్ తెలిపారు. సోమవారం నగరసభ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల వైపు మన నడక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఓటర్లకు ఎన్నికల గుర్తు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ అధికారి సదాశివప్రభు, అధికారులు పాల్గొన్నారు.



ఓటర్లను చైతన్యపరుస్తున్న అధికారులు

కార్మికులతోనే యాజమాన్యాల మనుగడ

కోలారు: సమాజంలో కార్మికులు ఉంటేనే యజమానుల మనుగడ ఉంటుందని అందువల్ల ప్రతి ఒక్కరు కార్మికుల యోగక్షేమాలను విచారించడం బాధ్యతగా భావించాలని కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి హొన్నేనహళ్లి యల్లప్ప తెలిపారు. సోమవారం నగరంలోని మెక్కె సర్కిల్‌లో నిర్వహించిన కార్మిక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాఖ్య తాలూకా అధ్యక్షుడు కూడియప్ప, నాగరాజ్, వెంకటేష్, మురళి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేజీఎఫ్: నగరంలో సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కార్మిక సంఘాలు కార్మిక దినోత్సవాన్ని నిర్వహించాయి. సీపీఐ నాయకుడు, ఆ పార్టీ అభ్యర్థి జ్యోతిబసు నేతృత్వంలో కార్మిక సంఘాల నాయకులు నగరంలోని పైలెట్స్‌లో ఉన్న కార్మిక విగ్రహానికి మాలార్పణ చేశారు.



కేజీఎఫ్‌లో కార్మికుడి విగ్రహానికి పూలమాల దృశ్యం

పాత్రికేయులకూ సంక్షేమం అందించాలి

కోలారు: పాత్రికేయులకు సంక్షేమ పథకాలను అందించాలని జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు బి.వి.గోపినాథ్ డిమాండ్ చేశారు. సోమవారం పాత్రికేయుల భవనంలో కార్మిక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పాత్రికేయుల సంఘాన్ని కార్మిక చట్టం ద్వారా రిజిస్టర్ చేయించినా ఇంతవరకు ఎలాంటి సౌకర్యాలు అందించ లేదన్నారు. తమను కూడా కార్మికులుగా పరిగణించి సౌకర్యాలను అందించాలన్నారు. సీనియర్ పాత్రికేయులు వి.మునిరాజు, కెఎస్ గణేష్, కెబి జగదీష్, బి సురేష్, అబ్బాణి శంకర్, పాత్రికేయుడు సివి నాగరాజ్ పాల్గొన్నారు.

అభ్యర్థి తరఫున ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించిన, పేదలపై శ్రద్ధ కలిగిన కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని జిల్లా ఒలంపిక్స్ శంకర్ తెలిపారు. సోమవారం సుగటూరులో కాంగ్రెస్ అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా యూనిట్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణప్ప, ఉపాధ్యక్షుడు ఆనందబాబు, కార్యదర్శి టీఎం ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటుతూ ముగ్గురు జలసమాధి

- మృతులు తల్లీబిడ్డలు



ముగ్గురు మృతులు వీరే

రాయచూరు రూరల్: బీదర్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న వాగును దాటుతుండగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలైన ఘటన వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు నలుగురు పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఆదివారం సాయంత్రం ఈ ఘటన ఔరాద్ తాలూకా హెడగాపుర వద్ద జరిగింది. మృతులను సునంద(48), కుమార్తె ఐశ్వర్య(16), కుమారుడు సుమిత్(10)లుగా గుర్తించారు. వీరు ఒకరి చేయిని మరొకరు పట్టుకుని వాగు దాటుతుండగా నీటిలో కొట్టుకు పోయి మరణించినట్లు బీదర్ డీఎస్పీ పృథ్వి శంకర్ తెలిపారు. సంగప్ప మాత్రం ప్రాణాలతో బయటపడినట్లు ఆయన తెలిపారు.

ముగిసిన వాసవీ జయంతి

రాయచూరు రూరల్: నగరంలో వాసవీ జయంతి వైభవంగా నెరవేరింది. ఆదివారం వందలాది మంది భక్తుల సమక్షంలో రథోత్స వం నిర్వహించారు. నగరేశ్వరాలయంలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారి విగ్రహాన్ని రథంలో ఊరేగించారు.

క్లుప్తంగా

స్వామీజీ కారును అడ్డగించిన గ్రామస్తులు



శివమొగ్గ: శికారిపుర సమీపంలోని అంబారగొప్ప తాలూకా శాంతివన గ్రామానికి వచ్చిన చిత్రదుర్గ గురుపీఠాధిపతి ఇమ్మడి సిద్ధరామేశ్వర స్వామీజీని గ్రామస్తులు అడ్డగించి వెనక్కి పంపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శాంతివన సమీపంలోని భక్తుని ఇంటికి వెళ్లేందుకు స్వామీజీ వచ్చారు. ఈ సమయంలో గ్రామానికి చెందిన కొందరు కారును అడ్డగించారు. కాగా, ఒక రాజకీయ పార్టీ అభ్యర్థికి మద్దతుగా స్వామిజీ వచ్చారని ఆ వ్యక్తులు ఆరోపిస్తూ కారును అడ్డగించారు. దీంతో డ్రైవర్ వేగంగా కారును ముందుకు పోనిచ్చాడు.

మూడు లారీలు స్వాధీనం

హోసూరు: అక్రమంగా ఇసుక, కంకర తరలిస్తున్న మూడు లారీలను అధికారులు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు... హోసూరు తహసీల్దార్ సుబ్రమణి, రెవెన్యూ అధికారులు ఆదివారం రాత్రి బేరికె, మాలూరు రోడ్డుపై వాహన తనికీలు చేపట్టారు. ఆ దారిలో వచ్చిన ఓ టిప్పర్ లారీలో ఐదు యూనిట్ల ఇసుక, మరో రెండు టిప్పర్ లారీలలో కంకర తరలిస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్లు పరారయ్యారు. వాహనాలను పోలీసులకు అప్పగించారు.

ప్రధాని సభా వేదికపై రౌడీషీటర్

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్న సభా వేదికపైకి ఒక రౌడీషీటర్ రావడం చర్చనీయాంశమైంది. రౌడీషీటర్ ముద్దుకృష్ణ వేదికపైకి ఎక్కి మోదీకి కృష్ణుని విగ్రహాన్ని కానుకగా అందజేశారు. ఆ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గతంలో మోదీ మండ్యకు వచ్చినప్పుడు అక్కడి రౌడీషీటర్ ప్రధాని దగ్గరకు రావడం వివాదాస్పదమైంది. రౌడీషీటర్ ముద్దుకృష్ణ బీజేపీ అభ్యర్థి సీపీ యోగేశ్వర్‌కు ఆప్తుడని, అందుకే సులభంగా వేదికపైకి రాగలిగాడని తెలుస్తోంది.

ప్రచారంలో విశేష స్పందన



కృష్ణరాజపురం: మహాదేవపురం నియోజకవర్గంలో ప్రతి ఇంటి నుంచి ఉత్తమ స్పందన వస్తోందని బీజేపీ అభ్యర్థి మంజుల లింబావళి సంతోషం వ్యక్తం చేశారు. ఏఈసీఎస్ లేఔట్ వార్డులో సోమవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని ఓటర్లను అభ్యర్థించారు.

విజయపురలో ఇంటి నుంచే ఓటు



విజయపుర: విజయపుర పురసభ పరిధిలో ఇంటి నుంచే ఓటు వేసే ప్రక్రియను ఎన్నికల అధికారులు శరవేగంగా పూర్తి చేస్తున్నారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు 12 మంది, దివ్యాంగులు ముగ్గురు ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కు అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధికారి, పీఆర్‌వో మైక్రో అబ్జర్వర్, పోలీసు అధికారి, పురసభ రెవెన్యూ అధికారి త్యాగరాజు, ఇతరత్రా సిబ్బంది, వీడియోగ్రాఫర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



చిక్కబళ్లాపురం: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీల ఫిరాయింపులు జోరుగా సాగుతున్నాయి. తాజాగా మంచేనహళ్లి పరిధిలో పలువురు ఎస్టీ నాయకులు బీజేపీలో చేరారు. సోమవారం టీపీ మాజీ సభ్యుడు బాలకృష్ణ, మంచేనహళ్లి గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షురాలు వెంకటలక్ష్మమ్మ తమ మద్దతుదారులతో కలిసి బీజేపీలో చేరారు.

సుదీప్ ఎన్నికల ప్రచారం రద్దు

యశవంతపుర: తారిహాళలో యువకుడి హత్య కారణంగా సోమవారం నిర్వహించతలపెట్టిన నటుడు సుదీప్ రోడ్డుషోను రద్దైంది. మొదట సుకేబావిలో జరగాల్సిన రోడ్‌షో రద్దు చేసుకుని తారిహాళలో రోడ్‌షో నిర్వహించాల్సి ఉండగా అక్కడ హత్య కారణంగా వాయిదాపడింది.

యలహంకలో హోరాహోరీ ?

- త్రిముఖ పోటీ
- నాలుగోసారి గెలుపుపై ఎస్‌ఆర్ విశ్వనాథ్ ధీమా

బనశంకరి: బెంగళూరు నగర నిర్మాత, నాడప్రభు కెంపేగౌడ రాజధాని యలహంక నియోజకవర్గంలో ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతోంది. 2008లో నియోజకవర్గాల పునర్విభజలో నూతనంగా ఆవిర్భవించిన యలహంక నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ బీజేపీ తరఫున మూడుసార్లు విజయకేతనం ఎగురవేసి బీజేపీ కంచుకోటగా మార్చారు. ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత విశ్వనాథ్‌కు దక్కింది. యలహంక నియోజకవర్గంలో నాలుగోసారి విజయఢంకా మోగించాలనే పట్టుదలతో బీజేపీ అభ్యర్థి ఎస్ఆర్.విశ్వనాథ్ ప్రచారపర్వంలో దూసుకెళుతున్నారు. నాలుగు నెలల క్రితమే నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రచారం ప్రారంభించి తమదైనశైలిలో ముందంజలో ఉన్నారు.

ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట :

యలహంక ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉండేది. ఇప్పుడు మళ్లీ ఆ పూర్వవైభవంగా తీసుకువస్తానని చెబుతున్నారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేశవరాజణ్ణ. కరోనా సమయంలో ఈయన పేదలను అన్ని విధాలుగా ఆదుకున్నారనే పేరు ఉంది. యువకుడు, ఉత్సాహవంతుడు కావడంతో కాంగ్రెస్ అధిష్టానం ఆయన టికెట్ కేటాయించింది. అంతేకాకుండా డీకే శివకుమార్ అనుచరుడిగా కూడా గుర్తింపు పొందారు.




విమానాశ్రయం వద్ద నిర్మించిన అతిపెద్ద నాడప్రభు కెంపేగౌడ విగ్రహం

గెలుపు సాధించాలని జేడీఎస్ :

ఈ ఎన్నికల్లో ఎలాగైన గెలుపు సాధించాలని జేడీఎస్ ప్రచారం హోరెత్తిస్తోంది. ఆ పార్టీ అభ్యర్థి మునేగౌడ ప్రచారంలో మునిగితేలుతున్నారు. యలహంకలో తెలుగు ఓటర్లు అధిక సంఖ్యలో ఉండటంతో ఆంధ్ర, తెలంగాణా నుంచి బీజేపీ నేత బండిసంజయ్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతేగాక ముఖ్యమంత్రి బసవరాజబొమ్మై ఎన్నికల ప్రచారాన్ని యలహంక నుంచి ప్రారంభించారు. చౌడేశ్వరివార్డులో తెలుగు ఓటర్లు అధికసంఖ్యలో ఉన్నారు.



ఎస్ఆర్.విశ్వనాథ్ (బీజేపీ అభ్యర్థి)



కేశవరాజణ్ణ (కాంగ్రెస్ అభ్యర్థి)



మునేగౌడ (జేడీఎస్ అభ్యర్థి)



4.27 లక్షల మంది ఓటర్లు:

యలహంకలో మొత్తం 4,27,562 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,17,910 మంది, మహిళలు 2,09,572 మంది ఓటర్లు, ఇతరులు 80 మంది ఉన్నారు. యలహంక నియోజకవర్గం నగర గ్రామీణ ప్రాంతాలతో మిళితమైంది.

లారీకి బ్రేక్ ఫెయిల్.. 8 వాహనాలు ధ్వంసం



ధ్వంసమైన లారీ ముందు భాగం

బనశంకరి: కొయ్యల లోడుతో వెళ్తున్న లారీకి బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి 8 వాహనాలను ఢీకొంది. దీంతో ఆ వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన యలహంక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 7 కార్లు, ఒక ఆటో ధ్వంసం కాగా ఒకరు గాయపడ్డారు. ఎలాంటి ప్రాణహాని సంభవించలేదు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో కొయ్య దిమ్మెల లోడ్‌తో లారీ గౌరిబిదనూరు నుంచి బెంగళూరు నగరంలోకి బయలుదేరింది. యలహంక సర్కిల్ వద్ద ఆర్ఎంజెడ్ మాల్ వద్ద లారీకి బ్రేక్ ఫెయిల్ కావడంతో రోడ్డులో వెళ్తున్న ఏడు కార్లు, ఆటోను లారీ ఢీకొట్టిన అనంతరం రోడ్డుపక్కన గల చెట్టును ఢీకొని లారీ నిలబడింది. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రికి తరలించారు. యలహంక ట్రాఫిక్ పోలీసులు ఘటనా ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

బీజేపీ నేతపై దాడి

మైసూరు: విధానసభ ఎన్నికల్లో వరుణ నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. వరుణ నియోజకవర్గ పరిధిలోని టి.నరసీపుర కసబా హోబళి బైరాపుర లేఔట్ బూత్ నంబర్ 109లో బీజేపీ బూత్ అధ్యక్షుడు దిలీప్ కుమార్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు తీవ్రంగా దాడి చేశారు. గాయపడిన దిలీప్ కుమర్‌ను టి.నరసీపుర ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టి.నరసీపుర పోలీసులకు ఫిర్యాదు అందింది.

అక్కసుతోనే దాడి

వరుణలో బీజేపీకి అనుకూల వాతావరణం నెలకొందని, ఈ నేపథ్యంలో ఓర్వలేని తనంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీజేపీ నేతలు, కార్యకర్తలపై దాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై ఆరోపించారు. సోమవారం మైసూరు మండకళ్లి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రానికి వచ్చి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నందున తమ పార్టీకి గెలుపు సులువుగా మారుతోందని, దీంతో అక్కసుతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. వరుణలో మంత్రి సోమణ్ణ గెలుస్తారనే ఆశాభావం పెరిగిందని, ఈ నేపథ్యంలో తమ బూత్ అధ్యక్షుడిపై దాడికి పాల్పడ్డారని తెలిపారు.

4న ఎన్నికల సిబ్బందికి పోలింగ్

మైసూరు: విధానసభ ఎన్నికల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహణను ఈనెల 4న చేపట్టనున్నట్లు జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర తెలిపారు. జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో 4న పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును ఎన్నికల సిబ్బంది వినియోగించుకోవాలని రాజేంద్ర తెలిపారు.

పోలింగ్‌పై అవగాహన ర్యాలీ

మైసూరు: విధానసభ ఎన్నికల నేపథ్యంలో ప్రజాస్వామ్య పండుగ సందర్భంగా మన నడక పోలింగ్ కేంద్రం వైపు కార్యక్రమం నంజనగూడు బాలుర ప్రభుత్వ పీయూ కాలేజీలో జరిగింది. ఎన్నికల అధికారి కృష్ణమూర్తి ఎన్నికల ధ్వజాన్ని కాలేజీ పోలింగ్ కేంద్రం వద్ద ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహక అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో కాలి నడకన పోలింగ్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. మే 10న తప్పకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని మనవి చేశారు.

సిలికాన్ సిటీలో హోరెత్తిన ప్రచారం



పులకేశి నగర రోడ్‌షోలో డీకే శివకుమార్, అభ్యర్థి ఏసీ శ్రీనివాస్ తదితరులు



శాంతినగరలో పాదయాత్రతో ప్రచారంలో చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.ఏ.హ్యారిస్



హెబ్బాళలో బీజేపీ అభ్యర్థి కట్టా జగదీశ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న కట్టా సుబ్రమణ్యనాయుడు

శివాజీనగర: సిలికాన్ సిటీలో రోడ్‌షోలు, పాదయాత్రలతో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. సోమవారం వివిధ ప్రాంతాల్లో వివిధ పార్టీల అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలసి తమకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు తమ ప్రత్యర్థులపై దూషణలు, ఆరోపణలు గుప్పించారు.

డీకే శివకుమార్ రోడ్‌షోకు విశేష స్పందన:

కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ పులకేశినగర నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఏ.సీ.శ్రీనివాస్ తరఫున సోమవారం ట్యానరీ రోడ్డు, డీ.జీ.హళ్లి, కావలబైరసంద్రలో నిర్వహించిన రోడ్‌షోకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డీ.కే.శివకుమార్ మాట్లాడుతూ... పులకేశినగరలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఏ.సీ.శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీకి శక్తినివ్వాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థుల ముమ్మర ప్రచారం:

నగరంలోని శాంతినగర, శివాజీనగర కాంగ్రెస్ అభ్యర్థులు ముమ్మర ప్రచారం చేపట్టారు. సోమవారం శాంతినగర కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.ఏ.హ్యారిస్ నీలసంద్ర, పీ.కే.క్వార్టర్స్‌లో పాదయాత్రగా వెళ్లి ఓటును అభ్యర్థించారు. శివాజీనగర కాంగ్రెస్ అభ్యర్థి రిజ్వాన్ హర్షద్‌కు మద్దతుగా రామస్వామి పాళ్య వార్డులో కాంగ్రెస్ నాయకులు సోమవారం విస్తృత ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు సీ.క్రిష్ణేగౌడ, సుమతి ధనుంజయగౌడ, వీ.పీ.ఆనందరాజ్, ఎం.సీ.శ్రీనివాస్, హినాయిత్ తదితరుల నేతృత్వంలో వందలాది మంది కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి:

హెబ్బాళలో బీజేపీ అభ్యర్థి కట్టా జగదీశ్ జే.సీ.నగర, గంగానగర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, ఇప్పటికే తన తండ్రి కట్టా సుబ్రమణ్యనాయుడు ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆ సమయంలో తనవంతు సేవలు కూడా అందించినట్లు గుర్తు చేస్తూ ప్రచారం చేపట్టారు.

జేడీఎస్ ప్రజల పక్షం

యశవంతపుర: విధానసభ ఎన్నికల్లో జేడీఎస్ పార్టీ ప్రజల పక్షంగా పనిచేస్తుందని మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. సోమవారం బాదాయిలో జేడీఎస్ అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు జేడీఎస్ బీజేపీకి బీటీం అంటూ ఆరోపణలు చేస్తున్నారు. అయితే రాజకీయ పార్టీలకు జేడీఎస్ ఏటీమ్ కాదు. ప్రజల టీమ్‌గా పని చేసి అధికారం దక్కించుకుంటుందని వివరించారు.

మోదీకి ఇది తగునా?

మోదీ ఎంతో అనుభవం ఉన్న రాజకీయ నాయకుడని, అలాంటి నేత జేడీఎస్ కాంగ్రెస్‌కు బీటీమ్ అంటూ మాట్లాడటం తగదని దేవెగౌడ అన్నారు. గతవారం జేడీఎస్ బీజేపీకి బీటీమ్ అంటూ రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇప్పుడు చూస్తే మోదీ ఇలా అన్నారు. రాహుల్ అనుభవంలేని నేత తెలియక మాట్లాడారు. రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న మోదీ ఇలా మాట్లాడటంపై దేవెగౌడ ఆక్రోశం వ్యక్తం చేశారు.

ఆదర్శనేత సురేశ్ గౌడ

తుమకూరు: సురేష్ గౌడ్ ఒక ఆదర్శవంతమైన నేత అని, మోసంతో గతంలో ఓడిపోయారని, ఈసారి 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప పిలుపునిచ్చారు. తుమకూరు గ్రామీణ నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా యడియూరప్ప మాట్లాడుతూ సురేశ్ గౌడ వంటి ఎమ్మెల్యే ఇంకొకరు దొరకరని, ఎంతో ప్రామాణికంగా పని చేశారని కొనియాడారు. ఈసారి మాత్రం కచ్చితంగా చట్టసభకు సురేశ్ గౌడను పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మళ్లీ బీజేపీదే అధికారం

శివాజీనగర: విధానసభ ఎన్నికల్లో బీజేపీ పూర్తి మెజారిటీతో మళ్లీ అధికారం చేపడుతుందని బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీ.సీ.మోహన్ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సోమవారం సర్వజ్ఞన నగర బీజేపీ అభ్యర్థి పద్మనాభరెడ్డికి మద్దతుగా బాణసవాడి, సేవానగర తదితర ప్రాంతాల్లో రోడ్‌షో నిర్వహించి ప్రచారం చేపట్టి ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వ సాధనాలు, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులే తమ పార్టీ అభ్యర్థులు గెలుపునకు అవకాశమన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కే.జే.జార్జ్‌కు పోటీగా బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థి పద్మనాభరెడ్డిని గెలిపించాలన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పండి



రఘునాథనాయుడుకి హారతి ఇస్తున్న దృశ్యం

బనశంకరి: ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీకి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఓటర్లకు పద్మనాభనగర నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వీ.రఘునాథనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పద్మనాభ నగర పరిధిలోని చిక్కలసంద్రవార్డులో కాంగ్రెస్ అభ్యర్థి వీ.రఘునాథనాయుడు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లుకు విజ్ఞప్తి చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పేరుతో కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని దుయ్యబట్టారు. నిత్యావసర వస్తువులు ఆకాశాన్నంటాయన్నారు. తనకు ఒకసారి అవకాశం కల్పిస్తే పద్మనాభనగర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు.

గ్రామాల్లో ముమ్మర ప్రచారం

చిక్కబళ్లాపురం: జేడీఎస్ అభ్యర్థి కేపీ బచ్చేగౌడ సోమవారం చిక్క క్షేత్రం పరిధిలోని ముష్టూరు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఓటును డబ్బుకు అమ్ముకోవద్దని, రైతులు, పేదల పక్షాల ఉన్న తమకు ఓటేయాలని కోరారు. బోదగానహళ్లి, తిప్పేనహళ్లి, రాగిమాకలహళ్లి తదితరాల్లో ప్రచారం సాగించారు.

మంచి అభ్యర్థిని ఎన్నుకోండి

ఉత్తమమైన అభ్యర్థిని ఎన్నుకోండి, మన క్షేత్రం ఎలా అభివృద్ధి చెందుతుంది అని ఆలోచించి ఓటేయాలని బీఎంటీసీ ఉపాధ్యక్షుడు కేవీ నవీన్‌కిరణ్ అన్నారు. సోమవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ వల్ల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలోనాయకులు చంద్రప్ప, బైరేగౌడ, క్రిష్ణారెడ్డి రామాంజనప్ప పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

బనశంకరి: తన హయాంలో జయనగర నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని జయనగర కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం బైరసంద్ర, జయనగర చుట్టుపక్కల ప్రాంతాల్లో పాదయాత్ర ద్వారా సౌమ్యారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న 40 శాతం కమీషన్ ప్రభుత్వాన్ని తొలగించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడిందని గుర్తు చేశారు. ప్రజా వ్యతిరేక బీజేపీకి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ బీబీఎంపీ సభ్యుడు ఎస్.నాగరాజ్, స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సౌమ్యారెడ్డి

హోసూరు వార్తలు..

ఆగని రైతుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న బాధిత రైతులు

హోసూరు: హోసూరు సమీపంలోని ఉద్దనపల్లి ప్రాంతంలో 5వ సిఫ్‌కాట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ భూమి కోల్పోయే రైతులు గత 117 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించబోమని పట్టుబట్టారు. ఉద్దనపల్లి, అయర్నపల్లి, నాగమంగలం గ్రామపంచాయతీల్లో సుమారు 3800 ఎకరాల విస్తీర్ణంలో సిఫ్‌కాట్ ఏర్పాటు చేసేందుకు కొన్నిరోజుల క్రితం ప్రభుత్వం రైతులకు నోటీసులు జారీ చేసింది. దీంతో భూములు కోల్పోతున్న రైతులు సిఫ్‌కాట్ ఏర్పాటుకు భూములివ్వమని, ఈ ప్రాంతంలో పెద్దఎత్తున రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, ఇక్కడి రైతులు పండించే గాయకూరలు, వ్యవసాయ ఉత్పత్తులను దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని, సాగుభూములను సిఫ్‌కాట్‌కు అందజేయమని ఆరోపిస్తూ గత 117 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. సోమవారం వర్షంలోనూ బైఠాయించి నిరసన తెలిపారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

హోసూరు: క్రిష్ణగిరి, హోసూరు ప్రాంతంలో ఇళ్ల నుంచి బయటకెళ్లిన ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారు. వివరాల మేరకు హోసూరు పారిశ్రామికవాడ అరసనట్టి ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక ప్లస్ టూ చదువుతూ వచ్చింది. గత 28వ తేదీ ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించారు. జాడ తెలియకపోవడంతో హోసూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలోని భోదాపురం గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కావేరి పట్టణం పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరుగా ముగ్గురి ఆత్మహత్య

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రాంతంలో వేర్వేరు చోట్లలో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకొన్నారు. వివరాల మేరకు...

- క్రిష్ణగిరి సమీపంలోని సీటుకొటాయ్ గ్రామానికి చెందిన కూలికార్మికుడు శంకర్ (45). కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా బాగు కాలేదని విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు.
- బర్గూరు సమితి జగదేవి ప్రాంతానికి చెందిన కూలి కార్మికుడు గోమధు (48) అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు.
- సింగారపేట సమీపంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన తోళన్ (78) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. పై మూడు కేసుల్లో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఊరూరా గ్రామసభలు



గ్రామసభ సమావేశంలో గ్రామస్తులతో చర్చిస్తున్న కలెక్టర్



బోడిచిపల్లి పంచాయతీలో జరిగిన గ్రామసభ సమావేశం

హోసూరు, కెలమంగలం: మే 1వ తేదీ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం ద్వారా క్రిష్ణగిరి జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో సోమవారం గ్రామసభలను నిర్వహించింది. అందులో భాగంగా బర్గూరు సమితి శెట్టిపల్లి గ్రామ పంచాయతీలో కలెక్టర్ దీపక్‌జేకబ్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... క్రిష్ణగిరి జిల్లాలోని 333 గ్రామపంచాయతీల్లో సోమవారం గ్రామసభల నిర్వహణకు ఆదేశాలు జారీ చేశామని, ఈ గ్రామసభ సమావేశాల్లో పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సురక్షిత తాగునీటి వసతులపై చర్చ, గ్రామీణ ఉపాధి హామీ పథక పనులు, 2023–2024 పంచాయతీ అభివృద్ధిపై ప్రణాళిక సిద్ధం చేయడం, అందరికీ పక్కా ఇళ్ల నిర్మాణ పథకం, జల్‌జీవన్ పథక పనుల నిర్వహణ, గ్రామీణాభివృద్ధి జీవనోపాధి పథక పనులు, బాల్య వివాహాల నిర్మూలన తదితర విషయాలపై చర్చలు ఆయా ప్రాంత గ్రాపంచాయతీ ప్రజల మధ్య చర్చలు జరిగింది. అనంతరం జరిగిన మన ఊరు సూపర్, అందరూ కలిసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకొందాం చైతన్య ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు మాదేవన్, మణివణ్ణన్, క్రిష్ణమూర్తి, క్రిష్ణన్, ద్రాక్షాయిణి, పంచాయతీ అధ్యక్షులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కెలమంగలం

కెలమంగలం సమితి బోడిచిపల్లి గ్రామపంచాయతీలో పంచాయతీ అధ్యక్షులు అంబికాఅంజు అధ్యక్షతన గ్రామసభ సమావేశం జరిగింది. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని పంచాయతీలో సమస్యలపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శి రాజ, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీ పాలనకు చరమగీతం పాడండి



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ. డీకే.సురేశ్, అభ్యర్థి ఆర్‌కే.రమేశ్ తదితరులు

బనశంకరి: అధికార బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని ఓటర్లకు బెంగళూరు గ్రామీణ ఎంపీ డీకే సురేశ్ పిలుపునిచ్చారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బెంగళూరు దక్షిణ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్ తరఫున ఉత్తరహళ్లి నుంచి నిర్వహించిన రోడ్‌షోలో బెంగళూరు గ్రామాంతర ఎంపీ డీకే.సురేశ్ మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. ప్రభుత్వంలో అవినీతి పరాకాష్టకు చేరిందని, డబుల్ ఇంజన్ ప్రభుత్వం పేరుతో రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. నిత్యావసర వస్తువులు, వంటగ్యాస్ ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు జీవనం భారంగా మారిందన్నారు. ఎన్నికల్లో అధికార బీజేపీకి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్‌కు ఒక అవకాశం కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రోడ్‌షోలో కేపీసీసీ కార్యాధ్యక్షుడు రామలింగారెడ్డి, మాజీ బీబీఎంపీ సభ్యుడు ఓ.మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మే డే



జెండా ఎగురవేసిన దృశ్యం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో పలు కార్మిక సంఘాలు కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరిపాయి. పట్టణంలోని తళి రోడ్డులో వినియోగదారుల సంఘం ద్వారా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంఘ నిర్వాహకుడు గోపాలక్రిష్ణన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ ఎస్.ఏ.సత్య జెండా ఎగురవేసి మిఠాయిలను పంచిపెట్టారు. సెందిల్‌కుమార్, ఎల్లోరా మణి, త్యాగరాజన్, మాదేశ్వరన్, పాల్గొన్నారు.

గుట్కా ఉత్పత్తులు తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

హోసూరు: బెంగళూరు నుంచి అక్రమంగా గుట్కా ఉత్పత్తులను తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ... సిఫ్‌కాట్ ఎస్ఐ పట్టు, పోలీసులు జాతీయ రహదారి జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి వాహన తనికీలు నిర్వహించారు. ఆ మార్గంలో వచ్చిన కారును అడ్డగించి తనికీ చేయగా నిషేధిత గుట్కా ఉత్పత్తులను బయటపడ్డాయి. కారుతో పాటు రూ. 1.50 లక్షల విలువ చేసే 207 కిలోల గుట్కాను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌తో పాటు ఇద్దరిని అరెస్ట్ చేశారు.

కృష్ణపట్నానికి 'మహానది' బొగ్గు



ఏటా స్టేజ్‌-2లోని 3వ యూనిట్‌కు ఇచ్చేందుకు 'మహానది' ఓకే

- శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్‌ పవర్‌ స్టేషన్‌కు 35.48 లక్షల టన్నులు సరఫరా
- 800 మెగావాట్ల యూనిట్‌తో రాష్ట్ర రోజువారీ అవసరాలకు దాదాపు 16 మిలియన్‌ యూనిట్ల విద్యుదుత్పత్తి
- రైలుమార్గంలో మొదలైన బొగ్గు రవాణా

సాక్షి, అమరావతి: థర్మల్‌ విద్యుత్కేంద్రాలకు బొగ్గు కొరత తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌ పవర్‌ జనరేషన్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (ఏపీజెన్‌కో) చేస్తున్న ప్రయత్నాల్లో మరో ముందడుగు పడింది. విద్యుత్‌ ఉత్పత్తిని మెరుగుపరచడానికి, పెరుగుతున్న విద్యుత్‌ డిమాండ్‌ను తీర్చేందుకు వీలుగా థర్మల్‌ కేంద్రాలకు యుద్ధప్రాతిపదికన బొగ్గు సరఫరాను పెంచడానికి వివిధ సంస్థలతో ఇంధన సరఫరా ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అందులో భాగంగా.. శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్‌ పవర్‌ స్టేషన్‌ (ఎస్‌డీఎస్‌టీపీఎస్‌), స్టేజ్‌-2లోని యూనిట్‌-3కి ఏటా 35.48 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేయడానికి మహానది కోల్‌ఫీల్డ్స్‌ లిమిటెడ్‌ (ఎంసీఎల్‌) అంగీకరించింది. ఈ బొగ్గు సరఫరా సోమవారం నుంచి రైలుమార్గంలో మొదలైంది.

ఫలించిన నిరంతర ప్రయత్నం..

ఏపీజెన్‌కో, ఆంధ్రప్రదేశ్‌ పవర్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌లు 5,811 మెగావాట్ల థర్మల్‌ విద్యుత్‌ ఉత్పత్తి స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. దీనికోసం ఎంసీఎల్‌ నుంచి సంవత్సరానికి 17.165 మిలియన్‌ మెట్రిక్‌ టన్నులు (ఎంటీపీఏ), సింగరేణి కోల్‌ కాలరీస్‌ లిమిటెడ్‌ (ఎస్‌సీసీఎల్‌) నుంచి 6.88 ఎంటీపీఏ బొగ్గు సరఫరా కోసం ఇంధన సరఫరా ఒప్పందం (ఎఫ్‌ఎస్‌ఏ) చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం ఎంసీఎల్‌, ఎస్‌సీసీఎల్‌లు రాష్ట్రంలోని డాక్టర్‌ నార్ల తాతారావు థర్మల్‌ పవర్‌ స్టేషన్‌ (డా.ఎన్‌టీటీపీఎస్‌), రాయలసీమ థర్మల్‌ పవర్‌ ప్లాంట్‌ (ఆర్‌టీపీపీ)లకు రైలు, సముద్ర మార్గంలో బొగ్గును సరఫరా చేస్తున్నాయి. అయితే, కొంతకాలంగా తీవ్ర బొగ్గు కొరత ఏర్పడటంతో సరఫరా కూడా మందగించింది. కేంద్ర ప్రభుత్వమే థర్మల్‌ కేంద్రాలకు బొగ్గు కోటాను నిర్ణయించడం మొదలుపెట్టింది. మరోవైపు.. థర్మల్‌కు బొగ్గు నిల్వలను సమకూర్చుకోవాలని కూడా నిర్దేశించింది. ఈ నేపథ్యంలో.. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల నిరంతర పర్యవేక్షణలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌, జెన్‌కో ఎండీ కేవీఎస్‌ చక్రధర్‌బాబు కోల్‌ ఇండియా లిమిటెడ్‌, మహానది కోల్‌ఫీల్డ్స్‌ లిమిటెడ్‌తో సంప్రదింపులు జరిపారు. దీంతో ఈ ఏడాది మార్చి 10 నుంచి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించిన కృష్ణపట్నంలోని 800 మెగావాట్ల యూనిట్‌కు మే 1 నుంచి బొగ్గును కేటాయించడానికి ఎంసీఎల్‌ అంగీకరించింది.

మరింత మెరుగ్గా విద్యుత్‌ ఉత్పత్తి

కృష్ణపట్నంలోని 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన సూపర్‌ క్రిటికల్‌ యూనిట్‌తో రాష్ట్రంలోని రోజువారీ విద్యుత్‌ అవసరాలకు దాదాపు 16 మిలియన్‌ యూనిట్లు సమకూరుతున్నాయి. మహానది నుంచి దీనికి బొగ్గును సరఫరా చేయడంవల్ల విద్యుదుత్పత్తి మెరుగుపడుతుంది. తద్వారా అన్ని రంగాలకు ఎలాంటి లోడ్‌ రిలీఫ్‌ (ఎల్‌ఆర్‌)లు లేకుండా విద్యుత్‌ సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. పెరుగుతున్న స్టేట్‌ గ్రిడ్‌ డిమాండ్‌ను తీర్చడానికి ఇది ఉపయోగపడుతుంది.

– కేవీఎస్‌ చక్రధర్‌బాబు, ఎండీ, ఏపీజెన్‌కో

మా ఆదేశాలు అమలు కావాల్సిందే

పాఠశాల విద్యాశాఖకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విద్యాహక్కు చట్ట నిబంధనల ప్రకారం ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రతి ప్రైవేటు పాఠశాలలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని ఈ ఏడాది జనవరిలో తామిచ్చిన ఆదేశాలు అమలుకాని పక్షంలో సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హైకోర్టు హెచ్చరించింది. తమ ఆదేశాలను అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. 25 శాతం కోటా కింద ప్రవేశాలు కల్పించిన విద్యార్థుల పేర్లతో కూడిన జాబితాను రుజువులతో సహా తమ ముందుంచాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. తాజాగా పిటిషనర్‌ దాఖలుచేసిన కోర్టుధిక్కార వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను జూన్‌ 27కి వాయిదా వేసింది. ఈ మేరకు సీజే జస్టిస్‌ ప్రశాంత్‌కుమార్‌ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్‌ నైనాల జయసూర్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రతి ప్రైవేటు పాఠశాలలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలన్న ఆదేశాలను పాఠశాల విద్యాశాఖ అధికారులు అమలు చేయలేదంటూ పిటిషనర్‌ తాండవ యోగేష్‌ హైకోర్టులో కోర్టుధిక్కార పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం సీజే ధర్మాసనం మరోసారి విచారించింది. పిటిషనర్‌ యోగేష్‌ వాదనలు వినిపిస్తూ.. 25 శాతం సీట్ల గురించి పాఠశాల విద్యాశాఖ అధికారులు ఎలాంటి ప్రచారం నిర్వహించలేదని చెప్పారు. 25 శాతం కోటా కింద 93 వేల సీట్లు ఉండగా, కేవలం 14,888 దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు. ప్రభుత్వ న్యాయవాది ఎల్‌.వి.ఎస్‌.నాగరాజు ఈ వాదనలను తోసిపుచ్చారు. మీడియాలో విస్తృత ప్రచారం చేశామన్నారు. వాదనలు విన్న ధర్మాసనం తమ ఆదేశాలను అమలుచేయని అధికారులు జైలుకు వెళతారని స్పష్టం చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఇంటి గోడే.. వెండితెర



సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఇంట్లోనే మనకు నచ్చిన స్క్రీన్‌ సైజులో థియేటర్‌ క్వాలిటీతో వీడియోలు, సినిమాలు వీక్షించొచ్చు. వీడియో కాల్స్‌ కూడా చేసుకోవచ్చు. కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్న 'ప్రాజెక్టర్‌ మోడ్‌ స్మార్ట్‌ ఫోన్ల'తో డిజిటల్‌ రంగం మరింత స్మార్ట్‌ కానుంది. చేతిలో సెల్‌ఫోన్‌ ఉంటే ఇంట్లో గోడలు.. నేల.. కార్యాలయం.. కార్లు.. విహార యాత్రలకు వెళితే ఆరు బయటి ప్రాంతాల్లో ఎక్కడ కావాలంటే అక్కడ సెల్‌ఫోన్‌లోని ప్రాజెక్టర్‌ ద్వారా వీడియోలు చూడొచ్చు. సెల్‌ఫోన్‌లో ప్రాజెక్టర్‌ ఇన్‌బిల్ట్‌ చేసి చైనా, జపాన్‌, అమెరికా, సౌత్‌ కొరియాకు చెందిన పలు కంపెనీలు వీటిని రూపొందించాయి. లినోవా, అక్యుమెన్‌, మోటో-జెడ్‌, మోవి, శాంసంగ్‌ బీమ్‌-2 మోడల్స్‌ పేరుతో ప్రస్తుతం ప్రపంచ మార్కెట్‌లోకి విడుదలయ్యాయి. త్వరలోనే ఇండియన్‌ మార్కెట్‌లోకి రానున్నాయి.

థియేటర్‌ క్వాలిటీతో..

ఈ ఫోన్లలో ఇంటిగ్రేటెడ్‌ లేజర్‌ ప్రాజెక్టర్‌ ఉంటుంది. లినోవా కంపెనీ తొలుత దీన్ని రూపొందించగా.. ఆ తర్వాత ఇతర కంపెనీలు దృష్టి సారించాయి. ఇప్పుడు మార్కెట్‌లో ఈ ఫోన్ల ధర రూ.35 వేల నుంచి రూ.1.80 లక్షల వరకూ పలుకుతున్నాయి. ఫోన్‌, ప్రాజెక్టర్‌ క్వాలిటీ ఆధారంగా వీటి ధరలు ఉన్నాయి. 50 నుంచి 200 ఇంచుల స్క్రీన్‌ వరకూ మనం వీడియోలో ప్రాజెక్ట్‌ చేయొచ్చు. ఇందులో హెచ్‌డీ, ఫుల్‌ హెచ్‌డీ, 4కే క్వాలిటీతో వీడియోలు చూడొచ్చు. హోమ్‌ థియేటర్‌ను బ్లూటూత్‌ ద్వారా కనెక్ట్‌ చేసి డీటీఎస్‌ సౌండ్‌తో పూర్తిగా థియేటర్‌ ఎక్స్‌పీరియన్స్‌తో వీడియోలు చూడొచ్చు. వీడియో ప్రజెంటేషన్‌కు ప్రాజెక్టర్ల అవసరం లేకుండా ఇలాంటి సెల్‌ఫోన్‌తో ప్రజెంటేషన్‌ చేయొచ్చు.

తిరుమలలో తీవ్రవాదులు!

- ముమ్మర తనిఖీలు చేపట్టిన పోలీసులు
- ఫేక్‌ అని స్పష్టం చేసిన ఎస్పీ

తిరుమల: తిరుమలలో ఉగ్రవాదులు ఉన్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి మెయిల్‌ రావడంతో పోలీసు యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది. పోలీసులు తిరుమలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి తనిఖీలు చేపట్టారు. అలిపిరి టోల్‌గేట్‌ వద్ద కూడా తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ మెయిల్‌ ఎస్పీకి ఎక్కడి నుంచి వచ్చిందనే అంశంపై పరిశీలించి.. చివరికి ఇది ఫేక్‌ అని గుర్తించారు. ఈ విషయంపై ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుమలలో ఎలాంటి ఉగ్రవాదుల కదలికలు లేవని స్పష్టం చేశారు. భక్తులు ఇటువంటి దుష్ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. దీనిపై టీటీడీ సీవీఎస్‌వో నరసింహకిషోర్‌ మాట్లాడుతూ తిరుమలలో ఉగ్రవాద కదలికలన్నది పూర్తిగా అవాస్తమని తెలిపారు. ఇదిలా ఉంటే తిరుమల శ్రీవారి ఆలయానికి ఉగ్రవాదుల ముప్పు ఉన్నట్లు పలు మార్లు కేంద్ర నిఘావర్గాలు హెచ్చరించాయి. దీంతో ఇంతకుముందే తిరుమలలోని కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో పాటు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

రాజధానిలో టిడ్కో ఇళ్ల వివరాలివ్వండి

- ప్రభుత్వాన్ని మౌఖికంగా ఆదేశించిన హైకోర్టు ధర్మాసనం
- విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్‌ జయసూర్య

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల విషయంలో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత కోరింది. రాజధాని ప్రాంతంలో ఎన్ని టిడ్కో ఇళ్లు నిర్మించారు? లబ్ధిదారుల వివరాలు.. ఎంత మందికి కేటాయించారు? తదితర వివరాలను తమ ముందుంచాలని సోమవారం మౌఖికంగా ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ప్రశాంత్‌కుమార్‌ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్‌ నైనాల జయసూర్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ సమయంలో ఈ వ్యాజ్యాల తదుపరి విచారణ నుంచి జస్టిస్‌ జయసూర్య తప్పుకోవడంతో ఆయన సభ్యుడిగా లేని ధర్మాసనం ముందు ఈ వ్యాజ్యాలను ఉంచాలని సీజే ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఈ వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ప్రశాంత్‌కుమార్‌ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్‌ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం నేడు విచారణ జరపనుంది.

ఇళ్ల పట్టాలిచ్చేస్తున్నారంటూ సీజేకు లేఖ...

ఇదిలా ఉండగానే ఆర్‌ – 5 జోన్‌లో పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వడం మొదలుపెట్టిందని, ఈ విషయంలో తగిన ఆదేశాలు ఇవ్వాలంటూ రైతుల తరఫు న్యాయవాది సంజయ్‌ సూరనేని ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో రైతుల వ్యాజ్యాలపై తదుపరి విచారణ జరపాలని నిర్ణయించిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. విచారణ మొదలు కాగానే రాజధాని ప్రాంతంలో టిడ్కో ఇళ్ల గురించి ధర్మాసనం ఆరా తీసింది. టిడ్కో ఇళ్లకు సంబంధించిన వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని మౌఖికంగా ఆదేశిస్తూ విచారణను నేటికి వాయిదా వేసింది. కాగా, వాస్తవానికి పిటిషనర్లు లేఖ రాయడం ద్వారా సీజేను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. పేదలకు ప్రభుత్వం ఇవ్వదలచిన 1,134 ఎకరాల్లో ప్రస్తుతం జంగిల్‌ క్లియరెన్స్‌ పనులు జరుగుతున్నాయి. టీడీపీ నాయకులు నిత్యం అక్కడకు వెళ్లి పనులను అడ్డుకుంటున్నారు. ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం ప్రారంభించిందంటూ హైకోర్టును తప్పుదోవ పట్టించేలా లేఖలు రాయడం వెనుక పెద్ద వ్యూహమే ఉందని న్యాయవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

లాట్‌ మొబైల్స్‌లో ఇక ఏసీలూ విక్రయం

కేవలం 90 నిమిషాల్లో హోమ్‌ డెలివరీ



సాక్షి, హైదరాబాద్‌: తెలుగురాష్ట్రాల్లో మొబైల్‌ ఫోన్ల విక్రయాల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్న లాట్‌ మొబైల్స్‌ సంస్థ తన స్టోర్స్‌లో ఏసీల విక్రయం ప్రారంభించింది. ప్రముఖ కంపెనీలతో పాటు వివిధ బ్రాండ్లకు చెందిన ఏసీలను అమ్ముతున్నట్లు అధీకృత ప్రతినిధి ఎం.అఖిల్‌ ప్రకటించారు. తమ వద్ద ఏసీ ఖరీదు చేసిన వారికి కేవలం 90 నిమిషాల్లోనే హోమ్‌ డెలివరీ చేసే సదుపాయం ఉందని చెప్పారు. తమ దగ్గర ఏసీ కొనుగోలుపై 45 శాతం వరకు తగ్గింపు, 20 శాతం వరకు క్యాష్‌ బ్యాక్‌ సహా అనేక ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయని సంస్థ వెల్లడించింది.

ఈతకు వెళ్లి తండ్రీకొడుకుల మృతి

- ఈత నేర్చుకుంటూ మునిగిన పిల్లాడు
- కాపాడబోయి తండ్రి సైతం మృత్యువాత
- చిత్తూరు జిల్లాలో విషాదం


ధనుష్‌(ఫైల్‌)


సెల్వరాజు(ఫైల్‌)

పెనుమూరు(చిత్తూరు అగ్రికల్చర్‌): వేసవి సెలవుల్లో సరదాగా గడుపుదామని గ్రామానికి వచ్చిన ఆ కుటుంబం రెండు రోజులు కూడా గడవకుండానే తండ్రీకొడుకుని పోగొట్టుకుంది. కుమారుడికి ఈత నేర్పించడానికని బావిలోకి దిగిన తండ్రి, కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. పెనుమూరు మండలంలో సోమవారం జరిగిన ఈ ఘటన ఆ గ్రామంలో విషాదాన్ని నింపింది. ఎర్రమట్టిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన సెల్వరాజు(40) వృత్తి రీత్యా తిరుపతిలో కారు డ్రైవర్‌. అతనికి భార్య కోకమ్మ, ఆరో తరగతి చదివే కుమారుడు ధనుష్‌(12), ఇద్దరు కుమార్తెలున్నారు. అందరూ తిరుపతిలో ఉండగా.. పాఠశాలకు వేసవి సెలవులివ్వడంతో రెండు రోజుల కిందట స్వగ్రామానికి చేరుకున్నారు. సోమవారం విడిదిపల్లె సమీపంలోని ఓ వ్యవసాయబావి వద్దకు సెల్వరాజు తన కుమారుడు ధనుష్‌కు ఈత నేర్పడానికి మరో వ్యక్తితో కలిసి వెళ్లాడు. ధనుష్‌ను బావిలో దింపిన సెల్వరాజు నెమ్మదిగా ఈత నేర్పుతున్నాడు. ఒక్కసారిగా ధనుష్‌ నీటిలో మునిగిపోయాడు. అతడిని పైకి తీసుకురావడానికి ప్రయత్నించిన సెల్వరాజ్‌ కూడా నీటిలో మునిగి పైకి రాలేదు. ఎంతసేపటికీ తండ్రీకొడుకులు పైకి రాకపోవడంతో గట్టుపై ఉన్న మరో యువకుడు ఏడుస్తూ కేకలు వేయడంతో అటుగా వెళుతున్న వారు బావిలో దూకి వారి కోసం గాలింపు చేపట్టినా ప్రయోజనంలేకపోయింది. పెనుమూరు ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ ఘటన స్థలానికి చేరుకుని.. అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. వారివల్ల కూడా కాకపోవడంతో గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లను బావిలోకి దించి మృతదేహాలను వెలికితీశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌ విజయభాస్కర్‌ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలకు పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా..

తండ్రి కొడుకు బావిలో పడి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టారు. సీఎం వైఎస్‌ జగన్‌ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీంతో సీఎం స్పందించి సెల్వరాజ్‌కు రూ.5 లక్షలు, ధనుష్‌కు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

ఢిల్లీలో వ్యాపారం.. హైదరాబాద్‌లో ఆస్తులు

- ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌కు ప్రమేయం
- ఫీనిక్స్‌ సంస్థ, క్రియేటివ్‌ డెవలపర్స్‌ను చార్జిషీట్‌లో ప్రస్తావించిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ (ఈడీ) మరో ఆసక్తికర అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఢిల్లీలో మద్యం వ్యాపారంలో సాధించిన లాభాలతో హైదరాబాద్‌లో భూములు కొనుగోలు చేశారని, ఇందులో సౌత్‌ గ్రూపుదే కీలక పాత్ర అని పేర్కొంది. భూముల కొనుగోలు వ్యవహారంలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌కుమార్‌ ప్రమేయం ఉందని తెలిపింది. గౌతమ్‌ మల్హోత్రా, అమన్‌దీప్‌, మాగుంట రాఘవ, అరుణ్‌ పిళ్లై వాంగ్మూలాల ఆధారంగా రెండు చార్జిషీట్లను సోమవారం ఈడీ ప్రత్యేక కోర్టుకు సమర్పించింది. మరిన్ని వివరాలు రాబట్టేందుకు నిందితుల్ని కస్టడీలోకి ఇవ్వాలని కోరింది. రౌజ్‌ అవెన్యూ ప్రత్యేక కోర్టు జడ్జి ఎంకే నాగ్‌పాల్‌ ఈడీ చార్జిషీట్లను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ చార్జిషీట్లలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్‌ సిసోడియా, ఆప్‌ ఎంపీ సంజయ్‌ సింగ్‌, శరత్‌చంద్రారెడ్డి, కవిత సన్నిహితుడు వి.శ్రీనివాసరావు, ఆంధ్రప్రభ పబ్లికేషన్స్‌, ఇండియా అహెడ్‌, ఫీనిక్స్‌ గ్రూపు, ఎన్‌గ్రోత్‌ క్యాపిటల్‌, క్రియేటివ్‌ డెవలపర్స్‌ తదితరుల పేర్లను ప్రస్తావించింది. నిందితుల వాంగ్మూలాల ఆధారంగా అసాధారణ అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పింది.

మేడే శుభాకాంక్షలు కూడా చెప్పని మోదీని సాగనంపాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: మేడే శుభాకాంక్షలు కూడా చెప్పని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని కార్మికులు, శ్రామికులు కలిసి కుల, మతాలకు అతీతంగా పోరాడి సాగనంపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మికవర్గ దీక్షాదినం మేడే సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యాలయం వద్ద శ్రీనివాసరావు సోమవారం కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్‌కీ బాత్‌ 100 ఎపిసోడ్‌లో మాట్లాడిన ప్రధాని మోదీకి మేడే శుభాకాంక్షలు చెప్పాలనే స్పృహ కూడా లేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే మేడేని పక్కనబెట్టారని విమర్శించారు. అదానీ, అంబానీల హక్కులు తప్ప మోదీకి మరొకటి పట్టడం లేదని విమర్శించారు.

ఒకప్పుడు సంగటి అంటే చులకనగా చూసేవారు. పేద, మధ్యతరగతి వారే సంగటి అధికంగా తీసుకుంటారని భావించేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది. కరోనా తర్వాత పోషకాలపై అన్వేషణ పెరిగింది. జనం చిరు ధాన్యాలపై మొగ్గుచూపుతున్నారు. ఇందులో భాగంగా రాగి, సజ్జ పిండితో చేసిన అంబలిపై మనసు పారేసుకుంటున్నారు. వేసవిలో చల్లదనంతోపాటు కావాల్సిన పోషకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




చిత్తూరులో జాతర సందర్భంగా అమ్మవారికి నైవేద్యంగా ఏర్పాటు చేసిన అంబలి

పోషకాల బాహుబలి..అంబలి

- రాగి, సజ్జ పిండితో తయారీ
- ఉదయం ప్రత్యేక అల్పాహారం
- గంగమ్మకు ఇష్టమైన ఆహారం
- జాతరలో ప్రత్యేకంగా భక్తులకు పంపిణీ
- పట్టణాలకు పాకిన వైనం
- వేసవిలో ఆరోగ్యానికి.. చల్లదనానికి పెట్టిందిపేరు

సాక్షి, తిరుపతి: రాగి.. సజ్జ సంగటి.. సీమ పల్లె ప్రజలకు ప్రియమైన ఆహారం. రోజులో ఒక్క పూటైనా ఈ మెనూ ఉండాల్సిందే. లేదంటే ఆహారంలో ఏదో వెలితి ఉన్నట్టు భావిస్తారు. ఇందులో కొందరు రాగి సంగటి.. మరి కొందరు సజ్జ సంగటి తింటారు. ఈ రెండింటినీ కలిపి సంగటి చేసి తినేవారు కూడా ఉన్నారు. రాయలసీమలో నాడు ప్రజలు కరువు పరిస్థితుల దృష్ట్యా తాము పండించిన రాగి, సజ్జ, జొన్నలనే సంగటిగా తయారు చేసుకుని ఆహారంగా తీసుకునేవారు. అయితే ఇది వారి పాలిట దివ్యౌషధంగా మారింది. అందులో అనేక పోషకాలు ఉండడంతో వైద్యులు రాగి, సజ్జ సంగటిని తీసుకోమని రోగులకు సూచించేవారు. అలా ఇప్పుడు జనం విధిగా ఈ సంగటిని తయారు చేసుకుని తింటున్నారు. ఈ సంగటి తినే సంస్కృతి పట్టణాలకు పాకింది. చిరు ధాన్యాల పోషకాలపై చైతన్యం పెరిగాక శుభకార్యాల్లోనూ రాగి సంగటి ప్రత్యేక డిష్‌గా వడ్డిస్తున్నారు. సంగటి సంగతి పక్కనపెడితే.. రాగి, సజ్జ అంబలి కొన్ని దశాబ్దాల క్రితం రాయలసీమ పల్లెల్లో ఉదయం అల్పాహారంగా తీసుకునేవారు. ముందు రోజు మధ్యాహ్నం లేదా రాత్రి పూట వండిన ఈ సంగటిలో నీళ్ల పోసి ఉంచుతారు. ఉదయాన్నే ఈ సంగటిలో పెరుగు కలుపుకుని అల్పాహారంగా తీసుకుంటారు. ఒకటి లేదా రెండు చెంబులు అంబలి తీసుకుని పొలం పనులకు వెళ్లేవారు. ఈ అంబలిలోకి తెల్ల ఉల్లిపాయ లేదా పచ్చి మిరపకాయ, గోంగూరు పచ్చడి, మామిడి కాయ, కిచ్చిలి, నారదబ్బ ఊరగాయను నంజుకుంటారు.

జాతరలో అంబలి మస్ట్‌

ఏటా నిర్వహించే గంగ జాతరకు స్థానికులు ఈ అంబళ్ల పోయడం ఆనవాయితీగా వస్తోంది. జాతరంటే అంబలి తప్పని సరిగా ఉంటుంది. గంగమ్మ వద్ద ఉదయం పూజకు ముందు నిర్వాహకులు పెద్ద డ్రమ్ములు, గిన్నెలు, మటఇట కుండలకు వేపాకు చుట్టి అందులో అంబలి నింపి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. తర్వాత తిరిగి భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తారు. త్వరలో ప్రారంభం కానున్న తిరుపతి గంగమ్మ జాతరలో ఈ అంబళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

పెరిగిన రాగి, సజ్జ పిండి విక్రయాలు

వినియోగం పెరగడంతో రాగి, సజ్జ పంటల సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. వ్యాపారులు రైతుల నుంచి రాగులు, సజ్జలు కొనుగోలు చేసుకుని పిండి తయారుచేసి విక్రయిస్తున్నారు. ఈ రాగి, సజ్జ పిండి అధికంగా ఆయుర్వేద మందుల దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఆర్గానిక్‌ దుకాణాల్లో కూడా దొరుకుతున్నాయి.

పట్టణాల్లోనూ అంబలి


అంబలి విక్రయిస్తున్న కుమారి

కరోనా తర్వాత ప్రజల జీవన విధానంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ఆరోగ్యం పట్ల శ్రద్ధపెరిగింది. అందులో భాగంగా అంబలి పట్టణ వాసులు సైతం అల్పాహారంగా తీసుకుంటున్నారు. నివాసాలకే పరిమితమైన ఈ అంబలి ఇప్పుడు ఉదయం స్థానికులు వాకింగ్‌ చేసే ప్రాంతంలో గ్లాసుల చొప్పున విక్రయిస్తున్నారు. ఈ అంబలిని కొందరు మట్టి కుండల్లో చేసుకుంటే.. మరి కొందరు సాధారణ పాత్రలో తయారు చేస్తున్నారు.

ఆరోగ్యమైన ఆహారం



రాగి, సజ్జ అంబలి ఆరోగ్యకరమైన ఆహారం. ఇందులో క్యాల్షియం, ఐరన్‌ ఎక్కువగా లభిస్తాయి. మొలకెత్తిన గింజలను ఎండబెట్టి పిండి చేసి అంబలి తయారు చేసుకుని తింటే బీ కాంప్లెక్స్‌, విటమిన్‌ సీ కూడా లభిస్తుంది.

– ఎం సునీతాదేవి, డైటీషియన్‌ చీఫ్‌, స్విమ్స్‌ ఆస్పత్రి

చల్లదనం కోసమే



అంబలి రాయలసీమలో ప్రత్యేకం. జాతరలో అమ్మవారికి అంబలి పోయడానికి ప్రత్యేక కారణాలంటూ ఏమీ ఉండవు. అమ్మవారి శక్తి స్వరూపిణి. ఆగ్రహంగా ఉంటారు. గంగమ్మకు అంబలి అంటే చాలా ఇష్టం. అమ్మవారిని శాంతింపజేసేందుకు భక్తులు అంబలి సమర్పిస్తారు.

– శ్రీనివాసులురెడ్డి (పేటశ్రీ), ప్రొఫెసర్‌, ఎస్వీయూ

ఇష్టంగా తీసుకుంటున్నారు

నేను తుడా కార్యాలయం వద్ద 20 ఏళ్లుగా అంబలి విక్రయిస్తున్నాను. అంబలి తక్కువ ధర కావడంతో కూలీలు ఎక్కువ మంది వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అప్పట్లో ముంత (చెంబు) రూ.2కు విక్రయించేదాన్ని. ఇప్పుడు రూ.10కి విక్రయిస్తున్నా.

– కుమారి, అంబలి అంగడి నిర్వాహకురాలు, తిరుపతి

అంబలి అమృతంతో సమానం



అంబలి తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఉదయాన్నే ఇడ్లీ, దోసె వంటి ఆహారం తీసుకున్న వెంటనే రక్తంలోకి చేరి షుగర్‌ లెవల్స్‌ పెరుగుతాయి. అంబలితో ఎలాంటి మార్పులుండవు. అంబలిని పులియబెట్టటం వల్ల యూస్‌ఫుల్‌ బ్యాక్టీరియా ఉంటుంది. ఇందులో ఐరన్‌, జింక్‌, మెగ్నీషియన్‌, పాస్ఫరస్‌ వంటివి ఉంటాయి.

– డాక్టర్‌ బీ హరినాథ్‌ఆచారి, అసోసియేట్‌ ప్రొఫెసర్‌, ఎస్వీయూ ఆయుర్వేద కళాశాల, టీటీడీ

డాక్టర్ శ్రీ కీర్తి పల్మనాలజిస్ట్...
మరో కీర్తికిరీటం 'మిసెస్ తెలంగాణ'.
'మిసెస్ వోగ్‌స్టార్ ఇండియా' విజేత.
మహిళ ఎలా ఉండాలో చెప్పింది.
మనిషి ఎలా జీవించాలో చెప్పింది.
'మంచిని తీసుకోవాలి... చెడును వదిలేయాలి'
ఇదీ ఆమెను విజేతగా నిలిపిన సమాధానం.
'మా ఊరికి వస్తే మా ఇంటికి రండి'
మరో ప్రశ్నకు బదులుగా ఆత్మీయ ఆహ్వానం.
బ్యూటీ కంటెస్ట్ నాడి పట్టుకుంది.
సంపూర్ణతకు ప్రతీకగా కిరీటధారి అయింది.





డాక్టర్ శ్రీ కీర్తి

ప్రొఫెషన్ | ప్యాషన్

మిసెస్ వోగ్‌స్టార్ ఇండియా 2023 (జి-1) తెలంగాణ

బ్యూటీ స్టార్

ఏప్రిల్ 14,15,16 తేదీల్లో జైపూర్ వేదికగా వోగ్ స్టార్ పోటీలు జరిగాయి. ఆ పోటీల్లో విజేతగా నిలిచిన తెలుగమ్మాయి డాక్టర్ కీర్తి. దేశవ్యాప్తంగా పన్నెండు వందల మంది పాల్గొన్న పోటీల్లో 'మిసెస్ తెలంగాణ' కిరీటంతో హైదరాబాద్‌కి తిరిగి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె తన బాల్యం నుంచి వోగ్‌స్టార్ కిరీట ధారణ వరకు తన విజయాలను, ఎదుర్కొన్న సవాళ్లను 'సాక్షి'తో పంచుకుంది.

''అమ్మ ఉద్యోగ రీత్యా నేను పుట్టింది ఒంగోల్లో, కానీ మా మూలాలు నెల్లూరులో ఉన్నాయి. అమ్మ బీఎస్ఎన్ఎల్, నాన్న సిప్లాలో ఉద్యోగం చేసేవారు. బాల్యం నుంచి నా జీవితమంతా హైదరాబాద్‌తోనే మమేకమైపోయింది. సైనిక్‌పురిలోని భారతీయ విద్యాభవన్‌లో టెన్త్ టాపర్‌ని. ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో చురుగ్గా ఉండడానికి స్కూలే కారణం. నాలుగు రకాల డాన్స్‌లు ప్రాక్టీస్ చేశాను. యాక్టింగ్‌లోనూ శిక్షణ తీసుకున్నాను. త్రో బాల్ ఆడేదాన్ని. ఖోఖో స్టేట్ లెవెల్ ప్లేయర్‌ని. ఇదంతా ఒక దశ. నాకు చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనే ఆకాంక్ష ఉండేది. రెండో ఆలోచన లేకుండా కాకతీయ కాలేజ్‌లో బైపీసీలో చేరిపోయాను. సీనియర్ ఇంటర్‌లో ఉండగా ఓ యాక్సిడెంట్. మల్టిపుల్ ఫ్రాక్చర్స్, తలకు కూడా గాయమైంది. సర్జరీలతో దాదాపు నాలుగు నెలలు బెడ్ మీదనే ఉన్నాను. పరామర్శకు వచ్చిన వాళ్లు సానుభూతి కురిపిస్తూ 'నడవడం కూడా కష్టమే, ఆరోగ్యం ఒకింత కుదుటపడిన తర్వాత ఏదో ఓ సంబంధం చూసి పెళ్లి చేసేయండి' అనే సలహా ఇచ్చేవాళ్లు. ఏఎస్‌రావు నగర్‌లో మా కాలనీ వాళ్లు నాకు చాలా సహాయం చేశారు. హాస్పిటల్‌లో ఎప్పుడూ ఎవరో ఒకరు తోడుగా ఉండేవారు. మా అమ్మానాన్న చిన్నప్పుడు చేయి పట్టుకుని నడిపించిన రోజులు నాకు గుర్తు లేవు, కానీ నన్ను మామూలు మనిషిని చేయడానికి మా తమ్ముడు కార్తీక్ నన్ను చేయి పట్టి నడిపించిన రోజుల్ని మాత్రం మర్చిపోలేను. అలాగే చదివి ఎమ్‌సెట్‌లో రెండు వేల ర్యాంకు తెచ్చుకుని ఎంబీబీఎస్‌లో సీటు తెచ్చుకున్నాను. టాప్ టెన్‌లో ర్యాంకు నా కల, యాక్సిడెంట్ వల్ల ఆ కల నెరవేరలేదు.

ఎంపిక ఇలా!

స్వయం శక్తితో జీవితంలో ఎదిగిన వాళ్లు, జీవితంలో పడిలేచిన వాళ్లు, సామాజికంగా సవాళ్లను ఎదుర్కొని నిలిచిన వాళ్లు... ఇలా ఉంటుంది. అలాగే అందరిలో ఒకరిగా జీవించడం కాకుండా ప్రొఫైల్‌లో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి. నేను పర్యావరణం కోసం చేసిన పనులు, కోవిడ్ వారియర్, జగిత్యాలలో ఐదేళ్లు సామాన్యులకు వైద్యం చేయడంతో సరిపెట్టుకోకుండా హెల్త్ ఎడ్యుకేషన్ కౌన్సెలింగ్ ఇవ్వడం వంటివి నాకు ఉపకరించాయి.

- డాక్టర్ ఎం.వి. శ్రీకీర్తి, సీనియర్ కన్సల్టెంట్, ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజిస్ట్, టీఎక్స్ హాస్పిటల్స్, హైదరాబాద్.

... డాన్స్ మానలేదు!

కుప్పంలో ఎంబీబీఎస్ చేశాను. అప్పుడు కూడా డాన్స్ ప్రాక్టీస్ మానలేదు. నేను స్టేజ్ మీదకు వెళ్లకుండా కొరియోగ్రఫీ చేసి షోలు నిర్వహించాను. ఇక పీజీలో చదువు తప్ప మరిదేనికీ టైమ్ ఉండేది కాదు. పల్మనాలజీ తర్వాత కేరళలో ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజీ చేశాను. పెళ్లి తర్వాత మళ్లీ కొత్త ఉత్సాహం వచ్చింది. మాది లవ్ మ్యారేజ్. డాక్టర్ శశిధర్ ఎంబీబీఎస్‌లో నా సీనియర్. ఆయన గాయకుడు. ఇల్లు, హాస్పిటల్‌తో జీవితాన్ని పరిమితం చేసుకోవడం నాకే కాదు ఆయనకూ నచ్చదు. డాన్స్ కాకపోతే మరేదైనా ఆసక్తిని అభివృద్ధి చేసుకోమనేవారు. అలా గత ఏడాది మిస్ హైదరాబాద్ పోటీలకు నా ఫొటోలు పంపించాను. టాలెంట్ రౌండ్‌లో ర్యాంప్ వాక్, డాన్స్ వీడియోలు పంపించాను. అందులో ఫస్ట్ రన్నర్ అప్‌ని. ఆ తర్వాత కొన్నాళ్లకు 'మిసెస్ తెలంగాణ ఆడిషన్' పిలుపు వచ్చింది. డెలివరీ తర్వాత సెలవులో ఉండడంతో ఆ పోటీల్లో పాల్గొనే వీలు దొరికింది. గత ఏడాది నవంబర్ నుంచి దశల వారీగా అనేక సెషన్‌లు జరిగాయి. అన్నీ వర్చువల్‌గానే.

పోటీల నుంచి నేర్చుకున్నాను!

ఈ పోటీలో ఒకరికొకరు నేరుగా కలిసింది జైపూర్‌లో కిరీటధారణ సమయంలో మాత్రమే. ప్రతి రాష్ట్రం నుంచి విజేతలకు కిరీట ధారణ జరిగింది. విజేతల్లో నాతోపాటు మరో ఇద్దరు డాక్టర్లున్నారు. మనుమళ్లు, మనుమరాళ్లున్న మహిళలు కూడా పాల్గొన్నారు. ఈ పోటీల ద్వారా అనేక స్ఫూర్తిదాయకమైన జీవితాలను దగ్గరగా చూశాను. ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఒక్కో ఎదురీత ఉంది. ఈ సందర్భంగా నేను మహిళలకు చెప్పేదొక్కటే... జీవితాన్ని నిత్యనూతనంగా ఉంచుకోవాలి. పెళ్లయిందనగానే ఇక జీవితం అయిపోయిందని, తమనెవరూ పట్టించుకోవట్లేదని ఇంట్లో వాళ్లను వేలెత్తి చూపుతూ తమను తాము నైరాశ్యంలోకి నెట్టేసుకుంటూ ఉంటారు. నిర్లిప్తతను దగ్గరకు రానివ్వకూడదు, ఒకవేళ ఆందోళన, ఆవేదనలు చుట్టు ముట్టినా సరే వాటి నుంచి బయటపడడానికి తమను తాము ఉత్తేజితం చేసుకోవాలి''

- ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి

లక్నో సాంస్కృతిక వైభవ మణిపూసలలో రంగస్థలం ఒకటి.
ఆ వెలుగు మరింత ప్రజ్వరిల్లేలా ఔత్సాహికులు నాటకరంగంలో భాగం అవుతున్నారు.
అయితే రంగస్థలం అంటే యువతరం మాత్రమేనా?
'కానే కాదు' అంటోంది 'పీపుల్స్ ఇన్షియేటివ్' అనే స్వచ్ఛందసంస్థ.
రచనల నుంచి నటన వరకు పెద్దలలోని సృజనాత్మక శక్తులను రంగస్థలంపైకి సాదరంగా తీసుకురావడానికి 'థియేటర్ ఫర్ ఎల్డర్లీస్' పేరుతో నాటకరంగ వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది...

అనుభవమే వారి బలగం



ప్రతీకాత్మక చిత్రం

థియేటర్ గ్రూప్ 'మంచ్‌కీర్తి సమితి' లక్నో (ఉత్తరప్రదేశ్)లో నిర్వహించిన '30 డేస్ 30 ప్లేస్'కు అనూహ్యమైన స్పందన లభించింది. విశేషం ఏమిటంటే ఆ జామ్ ప్యాక్‌డ్ థియేటర్‌లలో ఎక్కువమంది వృద్ధులు కనిపించారు. నాటకాలు చూస్తున్నప్పుడు వారిలో వయసు భారం మాయమైపోయింది. ప్రదర్శన పూర్తయిన తరువాత టీ తాగుతూ వారు ఆ నాటకాన్ని లోతుగా విశ్లేషించుకునే దృశ్యాలు ఎన్నో కనిపించాయి... దీన్ని దృష్టిలో పెట్టుకొని లక్నోకు చెందిన 'పీపుల్స్ ఇన్షియేటివ్' అనే స్వచ్ఛందసంస్థ 'థియేటర్ ఫర్ ఎల్డర్లీస్' అనే వినూత్న కాన్సెప్ట్‌తో సీనియర్ సిటీజన్‌లతో నలభైరోజుల పాటు థియేటర్ వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది.

'వారి కోసం వారి చేత' ట్యాగ్‌లైన్‌తో నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లలో రచన, నటన, దర్శకత్వం, సంగీతం... మొదలైన అంశాలలో శిక్షణ ఉంటుంది. దీంతో పాటు తమ ఏరియాలో తమ వయసు ఉన్న వ్యక్తులను సమీకరించి 'స్టోరీ టెల్లింగ్'లాంటి కార్యక్రమాలు ఎలా నిర్వహించాలో చెబుతారు.

'సీనియర్ సిటిజన్స్ కోసం థియేటర్ అనేది మంచి కాన్సెప్ట్. అది వారిలో ఉత్సాహాన్ని నింపుతుంది. కొత్త శక్తిని ఇస్తుంది' అంటున్నాడు థియేటర్ డైరెక్టర్ సలీమ్ ఆరీఫ్. 'నాటకరంగం అనేది అత్యంత ప్రభావశీలమైనది. ఈ బలమైన మాధ్యమం పెద్దల నీడలో మరింత బలం పుంజుకుంటుంది. వయసు ఎన్నో అనుభవాలను ఇస్తుంది. ఆ అనుభవ జ్ఞానం నాటకాల్లో ప్రతిఫలిస్తుంది. వృద్ధులు అనగానే ప్రేక్షకుల్లో కూర్చుని నాటకం వీక్షించడానికే పరిమితం కానవసరం లేదు. ఇప్పుడు వారిని రంగస్థలం ప్రేమగా, అభిమానంగా ఆహ్వానిస్తోంది'' అంటున్నాడు రంగస్థల ప్రముఖుడు సంగమ్ బహుగుణ.

పెద్దల చేత రూపుదిద్దుకుంటున్న నాటకాలు, పెద్దలు నటించే నాటకాలు ఎలా ఉండబోతున్నాయి? కేవలం.. ఒంటరి ఏకాంతాలు, వయసు సమస్యలు, కుటుంబ సమస్యలు... ఇలా ఏవోవో సమస్యలు ఉండబోతున్నాయా?

'కానే కాదు' అంటుంది పీపుల్స్ ఇన్‌షియేటివ్.

నాటకాల పాఠశాల

వయసు పైబడినంత మాత్రాన అది నటనపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపదని నిరూపిస్తున్న ప్రతిభావంతులలో సోహైలా కపూర్ ఒకరు. ఘనమైన ఖాన్‌దాన్ నుంచి వచ్చిన కపూర్ నటి, రచయిత్రి, మోడ్రన్ థియేటర్ వ్యవస్థాపకురాలు. ఈ తరం నటులతో కలిసి రంగస్థలం, జీ థియేటర్‌లలో నటిస్తోంది కపూర్.



ఆమెతో నటించడం అంటే ఔత్సాహిక నటులకు ఒక విశ్వవిద్యాలయంలో చదువుకున్నంత అదృష్టం. ఢిల్లీలో పుట్టిన కపూర్ హైస్కూల్ రోజుల్లోనే రంగస్థలంపై అడుగుపెట్టింది. 'వయసు పైబడగానే విషాదం మూర్తీభవించే పాత్రలకు మాత్రమే మహిళా నటులు పరిమితం అవుతున్నారు. ఇది సరికాదు. వృద్ధాప్యం అంటే విషాదం మాత్రమే కాదు. ఎన్నో బలమైన పాత్రలు మన కోసం ఎదురుచూస్తున్నాయి. ఓటీటీ పుణ్యమా అని సీనియర్ నటీమణులకు మూస పాత్రలు కాకుండా భిన్నమైన పాత్రలలో నటించే అవకాశం దొరుకుతుంది' అంటోంది కపూర్.

వారు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తారు. తాము నడిచొచ్చిన బాటను గుర్తు చేస్తూ ఈ తరానికి సానుకూలశక్తిని పంచుతారు. ఇంతకంటే కావాల్సినదేముంది!

సాగుబడి

భరణి కార్తె: మే 10 వరకు

కిసాన్ ఎక్స్‌పో నిరవధిక వాయిదా

గ్రామభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మే 5,6,7 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్‌లో జరగవలసిన కిసాన్ ఎక్స్‌పో–2023ను ఎడతెగని అకాల వర్షాల కారణంగా నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు గ్రామ భారతి కార్యదర్శి సామ ఎల్లారెడ్డి తెలిపారు.

7న బసంపల్లిలో రైతు శిక్షణ

ప్రకృతి వ్యవసాయంపై శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలో ఈ నెల 7(ఆదివారం)న ఉ. 9 నుంచి సా. 4 వరకు సీనియర్ రైతు నాగరాజు తన తోటలోనే శిక్షణ ఇవ్వనున్నారు. ప్రవేశ రుసుం రూ.200. ధర్మవరం – పుట్టపర్తి రోడ్డులో నాగరాజు క్షేత్రం ఉంటుంది. వివరాలకు.. 91826 71819.

ఐదు దొంతర్ల సేద్యంపై నాసిక్‌లో పాలేకర్ శిక్షణ

ఐదు దొంతర్ల ప్రకృతి వ్యవసాయం (ఫైవ్ లేయర్ మోడల్)లో బహుళ పంటల సాగు ద్వారా ఎకరానికి ఏడాదికి రూ. 3 లక్షల ఆదాయం పొందే పద్ధతులపై నాసిక్ (మహారాష్ట్ర)లో ఈ నెల 13,14,15 తేదీల్లో ప్రకృతి వ్యవసాయవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ శిక్షణ ఇవ్వనున్నారు. 13, 14 తేదీల్లో శిక్షణా శిబిరం తర్వాత 15న ఐదు దొంతర్ల పంటల క్షేత్ర సందర్శన ఉంటుంది. పాలేకర్ కృషి పద్ధతిలో ఓ రైతు దంపతులు విభిన్నమైన ఉద్యాన పంటలను సాగు చేస్తూ ఎకరాకు ఏడాదికి రూ. 3 లక్షల ఆదాయం పొందుతున్నారు. సమీప రైతులతో పోల్చితే రెండింతల ఆదాయాన్ని పొందుతున్నారు. ప్రజలకు మంచి ఆహారాన్ని అందిస్తూ తాము ఆరోగ్యంగా జీవిస్తున్నారు. శిక్షణా శిబిరంలో పాల్గొనే వారికి పాలేకర్ స్వయంగా వీరి క్షేత్రాన్ని చూపిస్తారు. నాసిక్ శిబిరానికి వెళ్లదలచుకునే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రైతులకు సేవ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ విజయరామ్ (040 27654337) సహాయ పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కోసం.. సురేష్ జాదవ్ – 93739 91112. ఇతర వివరాలకు.. హితేష్ పటేల్ – 98232 90969


ముల్లంగి


అలసంద


నారాయణ తోటను ఇటీవల సందర్శించిన అధికారుల బృందం

● ప్రకృతిని నమ్ముకున్నారు..

40 సెంట్లు.. రూ.3 లక్షలు..

ఈ రైతు దంపతులు ప్రకృతిని, తనకున్న రెండు ఆవులను నమ్ముకున్నారు.. పేడ, గోమూత్రంతో ఘనజీవామృతం, జీవామృతాలను తయారు చేసుకొని ఏడేళ్లుగా శ్రద్ధగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.. వీరి స్వయం కృషికి పంచ భూతాలు సాయం చేస్తున్నాయి. మామిడి తోట మధ్యలో 40 సెంట్లలో ఫిబ్రవరి నుంచి అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ ప్రతి వారం మంచి ఆదాయం పొందుతున్నారు. అందుకే దీన్ని 'ఏటీఎం నమూనా'గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే రూ. 1,20,000 ఆదాయం వచ్చింది. కేవలం ఈ అంతర పంటల ద్వారా మొత్తం రూ.3 లక్షలకు పైగా ఆదాయం పొందే అవకాశం ఉందంటున్న నారాయణ, పార్వతి దంపతుల కృషిపై 'సాక్షి' ఫోకస్..

40 సెంట్లలో అంతర పంటల ద్వారా రూ. 3 లక్షల ఆదాయం

3.7 ఎకరాల మామిడిలో రూ. 3 లక్షల ఆదాయం

మక్కువతో ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతు దంపతులు


మామిడిలో అంతర పంటగా నారాయణ, పార్వతి దంపతులు సాగు చేసిన వివిధ రకాల కూరగాయలు


స్వయంకృషితో పాటు ప్రకృతిని నమ్ముకుంటే రైతు సుభిక్షంగా ఉంటాడనడానికి హెచ్. నారాయణ, పార్వతి దంపతులే నిదర్శనం. వీరి స్వస్థలం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం మల్లాపురం గ్రామం. తమకున్న 3.70 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. తమకున్న రెండు నాటు ఆవులను సంరక్షిస్తూ పేడ, గోమూత్రంతో ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం తయారు చేసుకొని పంటలకు వాడుతున్నారు. స్వయం కృషికి తోడుగా అతి తక్కువ పెట్టుబడితోనే మామిడిలో, అంతర పంటల్లోనూ మంచి ఆదాయం ఆర్జిస్తూ ఇతర రైతులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. మామిడి తోటలోని 40 సెంట్ల స్థలాన్ని ఫిబ్రవరి 13న ఎంపిక చేసుకొని బోదెలు సిద్ధం చేసుకున్నారు. ఐదు వరసల్లో 5 రకాల పంటలను విత్తుకున్నారు. గోరుచిక్కుడు, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, అలసంద, మొక్కజొన్నతో పాటు మెంతాకు, కొత్తిమీర, గోంగూర సాగు చేస్తున్నారు. బోరు నీటిని అందిస్తున్నారు. ఘనజీవామృతం వేస్తున్నందు వల్ల నీరు కూడా ఎక్కువ అవసరం రావటం లేదు. ఒక్క తడి ఇస్తే 15–20 రోజులు ఉంటుంది. కెమికల్ వేసిన పొలం అయితే ఐదారు రోజులకే నీరు మళ్లీ అడుగుతుంది. తోట పనులను నారాయణ, ఆయన భార్య కలసి చేసుకుంటున్నారు. ప్రతి శుక్రవారం మార్కెట్‌లో, ఇంటి దగ్గర కూరగాయలు అమ్ముతున్నారు. ఇప్పటివరకు గోరుచిక్కుడు (చోలా కాయల) ద్వారా రూ.30 వేలు, ముల్లంగి ద్వారా రూ.50 వేలు, కొత్తిమీరలో రూ.20 వేలు, మెంతాకు, గోంగూరలలో మరో రూ.20 వేలు ఆదాయం వచ్చింది. ముల్లంగి, ఆకుకూరలు తీసేవి తీస్తూ ఉంటే మళ్లీ విత్తుతున్నారు. మొక్కజొన్న, అలసంద, క్యారెట్, బీట్‌రూట్ పంటలు మరో ఒకటిన్నర నెలల్లో చేతికొస్తాయి. క్యారెట్, బీట్‌రూట్ మంచి ధర పలుకుతాయని, మొత్తంగా 40 సెంట్లకు రూ.3 లక్షలకు పైగానే ఆదాయం వస్తుందని, ఇదంతా నికరాదాయమేనని నారాయణ ధీమాగా చెబుతున్నారు. రూ. 1,500లతో విత్తనాలు కొనటం తప్ప వేరే ఏ ఖర్చూ లేదన్నారు. రసాయనాలు వేయకుండా పంటలను పసిబిడ్డల్ని చూసుకున్నట్లు చూసుకుంటున్నామని నారాయణ చెప్పారు. అంతర పంటల ద్వారా నిరంతరం ఆదాయం వస్తోందని చెబుతూ.. ఇదే ఏటీఎం మోడల్ పంటల వల్ల లాభం అన్నారు. తనను చూసి తన పక్క పొలం రైతు కూడా 20 సెంట్లలో ఈ నమూనాలో పంటలు వేశాడన్నారు. క్లస్టర్‌లో మరో 25 మంది రైతులు వేశారన్నారు.

మామిడిలోనూ మంచి ఆదాయం

మామిడి పంటను కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే నారాయణ దంపతులు సాగు చేస్తున్నారు. ఘనజీవామృతం, జీవామృతాన్ని వినియోగిస్తూ మంచి దిగుబడి, ఆదాయం పొందుతున్నారు. గత ఏడాది మామిడి 8 టన్నుల దిగుబడి రాగా రూ.2 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఇప్పటికే 6 టన్నులు పంట కోత కోశారు. మరో 3 టన్నులు పంట చేతికొస్తుంది. మామిడి ద్వారా రూ.3 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని నారాయణ చెబుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన పండ్లు, కూరగాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటున్నాయని, రుచిగా ఉంటున్నాయని వినియోగదారులు సంతోషంగా మంచి ధరకు తీసుకుంటున్నారని నారాయణ, పార్వతి ఆనందంగా చెబుతున్నారు. వీరి పొలాన్ని ఇటీవల పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి తదితరులు సందర్శించి అభినందించారు.

– ఈదుల శ్రీనివాసులు, సాక్షి, కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు


నారాయణ, పార్వతి

నేను అయిష్టంగానే ప్రకృతి వ్యవసాయాన్ని ఏడేళ్ల క్రితం మొదలు పెట్టాను. డీపీఎం లక్ష్మానాయక్, మాస్టర్ ట్రైనర్ శివశంకర్ అన్ని విషయాలూ అర్థమయ్యేలా చెప్పి సహకరించారు. ఘన, ద్రవ జీవామృతాలు తయారు చేసుకొని ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. పంటలకు ఎలాంటి తెగుళ్లు, వైరస్‌లు రాలేదు. పండ్ల తోటల్లో కూడా ఐదారు రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే ఒకదాని తర్వాత ఒకటి మనకు పంట చేతి కొస్తుంది. మంచి నికరాదాయం వస్తుంది. ఇది రైతులకు ఎంతో మేలైన పద్ధతి. భూమి కూడా గుల్లబారి బాగుంటుంది. వాన నీరు బాగా ఇంకుతుంది. సహజ సిద్ధమైన ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు తింటే మనిషి ఆరోగ్యం కూడా బాగుంటుంది. నన్ను చూసి కొందరు ప్రకృతి వ్యవసాయం ప్రారంభించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి.

- హెచ్.నారాయణ (95504 84675), ప్రకృతి వ్యవసాయదారుడు, మల్లాపురం గ్రా., కళ్యాణదుర్గం మం., అనంతపురం జిల్లా


మామిడి పండ్లను చూపుతున్న పార్వతి, నారాయణ

స్వయంగా చూస్తే గానీ నమ్మలేరు..



పది రకాల కూరగాయలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తూ అనంతపురం జిల్లాలో రైతులు సుమారు 400 మంది అత్యంత ఆశ్చర్యకరమైన రీతిలో అధికాదాయం పొందుతున్నారు. స్వయంగా వచ్చి చూస్తే గానీ ఇంత ఆదాయం వస్తున్నదని నమ్మకం కలగదు. నారాయణ, పార్వతి రైతు దంపతులు తమ మామిడి తోటలో 40 సెంట్లలో అంతర పంటలుగా కూరగాయలను సాగు చేస్తూ చక్కని ఆదాయం పొందుతున్నారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటికి రూ. 1,20,000 ఆదాయం వచ్చింది. మరో రెండు నెలల్లో ఈ ఆదాయం రూ. 3 లక్షలకు పెరుగుతుందని రైతు ధీమాగా ఉన్నారు. జిల్లా కలెక్టర్ గౌతమి, ఏపీ రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయకుమార్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ కూడా ఇటీవల నారాయణ తోటను సందర్శించారు. అంత ఆదాయాన్ని పొందే అవకాశాలు ప్రకృతి వ్యవసాయంలో ఉన్నాయన్నది ఈ తోటలను స్వయంగా చూసిన వారికి అర్థం అవుతుంది. వారానికి రెండు, మూడు సార్లు కూరగాయలను విక్రయిస్తూ నిరంతరం ఆదాయం పొందుతున్నారు. అందువల్లనే ఈ నమూనాను 'ఏటీఎం మోడల్' అని పిలుస్తున్నాం.

- లక్ష్మానాయక్ (83310 57583), ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్, అనంతపురం జిల్లా

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



మురళీ శ్రీశంకర్‌కు స్వర్ణం

ఎంబీపీ హై పెర్ఫార్మెన్స్ అథ్లెటిక్స్ మీట్‌లో భారత ప్లేయర్ మురళీ శ్రీశంకర్ లాంగ్‌జంప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. కాలిఫోర్నియాలో జరిగిన ఈ మీట్‌లో 24 ఏళ్ల శ్రీశంకర్ 8.29 మీటర్ల దూరం గెంతి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ మీట్‌లో శ్రీశంకర్ వచ్చే ఆగస్టులో బుడాపెస్ట్‌లో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అర్హత ప్రమాణాన్ని (8.25 మీటర్లు) అధిగమించాడు. అయితే మైదానంలో గాలివేగం నిర్ణీత ప్రమాణంకంటే ఎక్కువ ఉండటంతో శ్రీశంకర్ ప్రదర్శనకు ప్రపంచ చాంపియన్‌షిప్ బెర్త్ లభించలేదు.

బెంగళూరు జట్టులో కేదార్ జాదవ్



తాజా ఐపీఎల్ టోర్నీలో మైక్ పట్టుకొని మరాఠీ వ్యాఖ్యానం చేసుకుంటున్న భారత క్రికెటర్ కేదార్ జాదవ్‌కు బ్యాట్ పట్టుకొని మైదానంలోకి దిగే అవకాశం దక్కింది. గాయంతో జట్టుకు దూరమైన బౌలర్ విల్లీ స్థానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు కేదార్ జాదవ్‌ను అతడి కనీస ధర రూ. 1 కోటికి కొనుగోలు చేసింది. మహారాష్ట్రకు చెందిన 38 ఏళ్ల కేదార్ 93 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 1,196 పరుగులు చేశాడు.

హుసాముద్దీన్ శుభారంభం



తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తొలిరోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ (57 కేజీలు) శుభారంభం చేయగా... వరిందర్ సింగ్ (60 కేజీలు) మాత్రం తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. తొలి రౌండ్‌లో హుసాముద్దీన్ 5–0తో అలెన్ రుస్తెమోవ్‌స్కీ (మెసెడోనియా)పై గెలుపొందగా... వరిందర్ 0–5తో తుర్సునోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. ఈ మెగా ఈవెంట్‌లో భారత్ నుంచి 13 మంది బాక్సర్లు బరిలో ఉన్నారు.

'ఇది భారత కుర్రాళ్ల ఐపీఎల్'

ఎమ్మెస్కే ప్రసాద్ వ్యాఖ్య



ముంబై: గత సీజన్లతో పోలిస్తే ఐపీఎల్–2023 మరింత ఆసక్తికరంగా సాగుతోందని భారత మాజీ క్రికెటర్, సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అభిప్రాయపడ్డారు. అన్నింటికంటే ముఖ్యంగా లీగ్‌లో భారత యువ ఆటగాళ్లు సత్తా చాటడం మంచి పరిణామమని ఆయన అన్నారు. ఎమ్మెస్కే ఈ ఐపీఎల్ సీజన్‌లో స్టార్ స్పోర్ట్స్–తెలుగు చానెల్‌లో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. 'స్టార్' కార్యక్రమంలో ఆయన తాజా సీజన్ గురించి తన అభిప్రాయాలు వెల్లడించారు. 'సగం టోర్నమెంట్ ముగిసేసరికే ఈ ఐపీఎల్ గత సీజన్‌ల రికార్డులను అధిగమించింది. 200కు పైగా స్కోర్లు పెద్ద సంఖ్యలో నమోదు కాగా, సిక్సర్ల సంఖ్య కూడా చాలా ఎక్కువ. ఇది లీగ్ ఎంతగా విజయవంతం అయిందో చూపిస్తోంది' అని ప్రసాద్ అన్నారు. కొత్తగా తీసుకొచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్ అంశం మంచి ప్రభావం చూపిస్తోందని ప్రసాద్ చెప్పారు. 'ఇంపాక్ట్ ప్లేయర్ వల్ల ఈ సీజన్‌లో ఐపీఎల్ టీమ్ హోమ్ అడ్వాంటేజ్ పోయింది. ప్రత్యర్థి జట్టు వ్యూహాన్ని మార్చుకునే అవకాశం కలుగుతోంది. అందుకే చాలా మ్యాచ్‌లలో సొంత మైదానాల్లో జట్లు ఓడిపోతున్నాయి' అని ఎమ్మెస్కే విశ్లేషించారు. ప్రధానంగా భారత యువ ఆటగాళ్లు మంచి ప్రదర్శనలు ఇవ్వడం చెప్పుకోదగ్గ అంశమని ఈ భారత మాజీ వికెట్ కీపర్ వ్యాఖ్యానించారు. 'ఇది భారత క్రికెట్‌కు మేలు చేసే అంశం. తిలక్ వర్మ, సాయిసుదర్శన్, రింకూ సింగ్, యశస్వి, ధ్రువ్ జురేల్ తమ ఆటతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించడం సానుకూలాంశం.' అని ప్రసాద్ పేర్కొన్నారు.

లక్నో 'సూపర్' ఫ్లాప్

- 127 లక్ష్యాన్ని ఛేదించలేకపోయిన లక్నో సూపర్ జెయింట్స్
- 18 పరుగులతో నెగ్గిన బెంగళూరు
- రాణించిన డుప్లెసిస్, హాజల్‌వుడ్



లక్నో: లక్నో సూపర్ జెయింట్స్ చెత్తగా ఆడి చిత్తుగా ఓడింది. బెంగళూరు స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకొని తమ సొంతగడ్డపై ఎదురైన పరాజయానికి లక్నో గడ్డపై ప్రతీకారం తీర్చుకుంది. సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో 18 పరుగులతో బెంగళూరు గెలుపొందింది. తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 126 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డుప్లెసిస్ (40 బంతుల్లో 44; 1 ఫోర్, 1 సిక్స్) రాణించాడు. తర్వాత లక్నో 19.5 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటైంది.

బెంగళూరు జట్టు తరఫున ఓపెనర్లవే పరుగులు... ఆ తర్వాత కష్టాలే! కోహ్లి (30 బంతుల్లో 31; 4 ఫోర్లు), కెప్టెన్ డుప్లెసిస్ ఆడినంత వరకు స్కోరు బోర్డు నడించింది. పవర్‌ప్లేలో 42 పరుగులే అయినా వికెట్‌ను కాపాడుకుంది. అయితే రవి బిష్ణోయ్ కోహ్లిని స్టంపౌట్ చేయడంతో 61 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత దినేశ్ కార్తీక్ (16) మినహా ఇంకెవరూ పట్టుమని పది పరుగులైనా చేయలేదు. లక్నో కళ్ల ముందున్న లక్ష్యం చిన్నది. కానీ బ్యాటర్ల నిర్లక్ష్యం జట్టును పవర్‌ప్లేలోనే 'ఫ్లాప్' చేసింది. మేయర్స్ (0), కృనాల్ (14), బదోని (4), దీపక్ హుడా (1)లను బెంగళూరు బౌలర్లు సిరాజ్, మ్యాక్స్‌వెల్, హాజల్‌వుడ్, హసరంగ తలా ఓ దెబ్బ తీశారు. 5.1 ఓవర్లలో 27/4 స్కోరు వద్ద పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కృష్ణప్ప గౌతమ్ (13 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు), మిశ్రా (30 బంతుల్లో 19; 2 ఫోర్లు) చేసిన పరుగులు లక్నోను కష్టంగా 100 దాటించాయే తప్ప లక్ష్యాన్ని చేర్చలేదు. ఫీల్డింగ్ సమయంలో కెప్టెన్ కేఎల్ రాహుల్ (0 నాటౌట్) తొడ కండరాలు పట్టేయడంతో ఓపెనింగ్ చేయలేదు. 11వ స్థానంలో వచ్చి నాటౌట్‌గా నిలిచాడంతే!

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (స్టంప్డ్) పూరన్ (బి) బిష్ణోయ్ 31; డుప్లెసిస్ (సి) కృనాల్ (బి) మిశ్రా 44; అనూజ్ (సి) మేయర్స్ (బి) గౌతమ్ 9; మ్యాక్స్‌వెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 4; ప్రభుదేశాయ్ (సి) గౌతమ్ (బి) మిశ్రా 6; దినేశ్ కార్తీక్ (రనౌట్) 16; మహిపాల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నవీనుల్ 3; హసరంగ (నాటౌట్) 8; కరణ్ శర్మ (సి) గౌతమ్ (బి) నవీనుల్ 2; సిరాజ్ (సి) పూరన్ (బి) నవీనుల్ 0; హాజల్‌వుడ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 126. వికెట్ల పతనం:** 1–62, 2–75, 3–80, 4–90, 5–109, 6–114, 7–117, 8–121, 9–121. **బౌలింగ్:** కృనాల్ పాండ్యా 4–0–21–0, స్టొయినిస్ 1–0–11–0, నవీనుల్ హక్ 4–0–30–3, రవి బిష్ణోయ్ 4–0–21–2, అమిత్ మిశ్రా 3–0–21–2, యశ్ 2–0–12–0, గౌతమ్ 2–0–10–1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) అనూజ్ (బి) సిరాజ్ 0; బదోని (సి) కోహ్లి (బి) హాజల్‌వుడ్ 4; కృనాల్ (సి) కోహ్లి (బి) మ్యాక్స్‌వెల్ 14; హుడా (స్టంప్డ్) కార్తీక్ (బి) హసరంగ 1; స్టొయినిస్ (సి) ప్రభుదేశాయ్ (బి) కరణ్ శర్మ 13; పూరన్ (సి) మహిపాల్ (బి) కరణ్ శర్మ 9; గౌతమ్ (రనౌట్) 23; బిష్ణోయ్ (రనౌట్) 5; మిశ్రా (సి) కార్తీక్ (బి) హర్షల్ 19; నవీనుల్ (సి) కార్తీక్ (బి) హాజల్‌వుడ్ 13; రాహుల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 108. వికెట్ల పతనం:** 1–0, 2–19, 3–21, 4–27, 5–38, 6–65, 7–66, 8–77, 9–103, 10–108. **బౌలింగ్:** సిరాజ్ 3–0–24–1, హాజల్‌వుడ్ 3–0–15–2, మ్యాక్స్‌వెల్ 1–0–3–1, హసరంగ 4–0–20–1, కరణ్ శర్మ 4–0–20–2, హర్షల్ పటేల్ 3.5–0–20–1, మహిపాల్ 1–0–4–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	8	6	2	12	0.638
రాజస్తాన్	9	5	4	10	0.800
లక్నో	9	5	4	10	0.647
చెన్నై	9	5	4	10	0.329
బెంగళూరు	9	5	4	10	-0.038
పంజాబ్	9	5	4	10	-0.447
ముంబై	8	4	4	8	-0.502
కోల్‌కతా	9	3	6	6	-0.147
హైదరాబాద్	8	3	5	6	-0.577
ఢిల్లీ	8	2	6	4	-0.898

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ x ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'బ్రిజ్‌భూషణ్‌ను రక్షించే ప్రయత్నమిది'

- నవజోత్ సింగ్ సిద్ధూ విమర్శ
- కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన



న్యూఢిల్లీ: తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ జంతర్ మంతర్ వద్ద నిరసన కొనసాగిస్తున్న భారత అగ్రశ్రేణి రెజ్లర్లకు అన్ని వైపుల నుంచి సంఘీభావం లభిస్తోంది. తాజాగా కాంగ్రెస్ నేత, భారత మాజీ క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ కూడా వేదిక వద్దకు వచ్చి తన మద్దతు ప్రకటించాడు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అతనిపై చర్యకు వెనుకాడుతోందని సిద్ధూ విమర్శించాడు. 'ఎఫ్ఐఆర్ ఎందుకు ఆలస్యం చేశారు. అందులో వివరాలు ఎందుకు బయటపెట్టడం లేదు. దానిని బలహీనంగా తయారు చేశారని అర్థమవుతోంది. అన్నీ దాచేసి బ్రిజ్‌భూషణ్‌ను రక్షించే ప్రయత్నమే ఇదంతా. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తే ఇప్పటి వరకు అరెస్ట్ ఎందుకు చేయలేదు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలి' అంటూ సిద్ధూ వ్యాఖ్యానించాడు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా కూడా రెజ్లర్లకు సంఘీభావం పలకగా... రేడియోలో 'మన్‌కీ బాత్' కాదు, రెజ్లర్ల వద్దకు వచ్చి వారి మన్‌కీ బాత్ వినాలని ప్రముఖ న్యాయవాది కపిల్ సిబాల్ సూచించారు. మరోవైపు తనను ఉరి తీసినా పర్వాలేదని, రెజ్లింగ్ పోటీలు మాత్రం ఆగరాదని బ్రిజ్‌భూషణ్ అన్నాడు. 'గత నాలుగు నెలలుగా రెజ్లింగ్ కార్యకలాపాలు ఆగిపోయాయి. పిల్లల భవిష్యత్తుతో ఆడుకోకండి. తక్షణం ఎవరి ఆధ్వర్యంలోనైనా క్యాడెట్ నేషనల్స్ నిర్వహించండి. లేదంటే వయసు పెరిగి కుర్రాళ్లు అవకాశం కోల్పోతారు. నన్ను ఉరి తీయండి కానీ ఆట మాత్రం ఆగవద్దు' అని బ్రిజ్‌భూషణ్ చెప్పాడు.

కోహ్లి X గంభీర్



లక్నో, బెంగళూరు జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ ముగిసిన తర్వాత కోహ్లి, లక్నో కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్రంగా వాదించుకోవడం కనిపించింది. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లో వీరిద్దరి మధ్య జరిగిన గొడవను ఇది గుర్తుకు తెచ్చింది. అయితే ఇందులో నేరుగా గంభీర్ పాత్ర లేకపోయినా...అతని జోక్యంతో పరిస్థితి కాస్త వేడిగా మారింది. బెంగళూరు విజయం తర్వాత షేక్ హ్యాండ్‌ల సమయంలో కోహ్లి, లక్నో పేసర్ నవీనుల్ హక్ (అఫ్గానిస్తాన్) మధ్య ఏదో వాదన జరిగింది. చేతులు విసిరికొట్టి మరీ ఇద్దరూ విడిపించుకున్నారు. అయితే ఆ తర్వాత నవీన్‌ను పిలిచి కోహ్లి ఏదో చెప్పేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ముందుగా కైల్ మేయర్స్ (వెస్టిండీస్), ఆ తర్వాత గంభీర్ తమ ఆటగాడికి అండగా నిలుస్తూ మధ్యలోకి వచ్చారు. దాంతో కోహ్లి, గంభీర్ తీవ్రంగా వాదించుకున్నారు. చివరకు రాహుల్, మిశ్రా జోక్యం చేసుకొని విడిపించాల్సి వచ్చింది. ఆ తర్వాతా కోహ్లి పదే పదే ఇదే విషయాన్ని రాహుల్‌కు ఫిర్యాదు చేయడం కనిపించింది. నిజానికి గత మ్యాచ్‌లో గెలిచిన తర్వాత చిన్నస్వామి స్టేడియంలో నోరు మూయమంటూ ప్రేక్షకులను ఉద్దేశించి గంభీర్ సైగ చేయగా... ఈసారి గెలుపు బాటలో కోహ్లి అదే తరహాలో సైగ చేస్తూ దానిని గుర్తు చేయడం కూడా ఒక కారణం కావచ్చు!

ఆసియా క్రీడలకు సైనా దూరం!



న్యూఢిల్లీ: భారత మహిళా స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఈ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లలో చైనాలో జరిగే ఆసియా క్రీడలకు దూరం కానుంది. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే భారత బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక కోసం ఈనెల 4 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న సెలెక్షన్‌ట్రయల్స్ టోర్నీలో సైనా నెహ్వాల్ పాల్గొనడంలేదు. 'ఫిట్‌నెస్ సంబంధిత సమస్యల కారణంగా సైనా ట్రయల్స్‌లో బరిలోకి దిగడంలేదు. సైనాతోపాటు పురుషుల డబుల్స్ జోడీ కుశాల్ రాజ్, ప్రకాశ్ రాజ్ కూడా ట్రయల్స్ టోర్నీ నుంచి వైదొలిగారు' అని భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) కార్యదర్శి సంజయ్ మిశ్రా తెలిపారు.

సినిమా



● చిరంజీవి

పక్కా మాస్ డ్రైవర్

ఇక్కడున్న చిరంజీవి ఫొటో చూశారు కదా.. టాక్సీ డ్రైవర్ గెటప్‌లో మాస్‌గా కనిపిస్తున్నారు. జస్ట్ 30 ఏళ్లు వెనక్కి వెళితే 'రౌడీ అల్లుడు'లో ఆటో డ్రైవర్ జానీగా చిరంజీవి మాస్ గెటప్‌లో అలరించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు 'భోళా శంకర్'లో టాక్సీ డ్రైవర్‌గా మాస్ లుక్‌లో కనిపించనున్నారు చిరంజీవి. సోమవారం మే డే సందర్భంగా ఈ టాక్సీ డ్రైవర్ లుక్‌ని విడుదల చేసింది చిత్ర యూనిట్. చిరంజీవి, తమన్నా జంటగా మెహర్ రమేష్ తెరకెక్కిస్తున్న చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి చెల్లెలిగా కీర్తీ సురేష్ నటిస్తున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవల చిత్రీకరించిన ఇంటర్వెల్ ఎపిసోడ్‌తో ఈ చిత్రం 80 శాతం పూర్తయింది. ''నెక్ట్స్ షెడ్యూల్‌ను కోల్‌కతాలో ఆరంభిస్తాం. ఆ తర్వాత చిరంజీవి, తమన్నాపై యూరప్‌లో ఒక పాటను చిత్రీకరిస్తాం. అక్కడ నుంచి వచ్చాక కొంత టాకీ, క్లయిమాక్స్, ఒక సెట్ సాంగ్ చిత్రీకరణను ప్లాన్ చేశాం. జూన్ నెలాఖరుకు షూటింగ్ పూర్తవుతుంది. ఆగస్టు 11న చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: డడ్లీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కిషోర్ గరికిపాటి, లైన్ ప్రొడక్షన్: మెహెర్ మూవీస్, నిర్మాత: రామబ్రహ్మం సుంకర.

నా ఉగ్ర రూపం చూస్తారు - 'అల్లరి' నరేశ్



● హరీష్ పెద్ది, సాహు, విశ్వక్ సేన్, సందీప్ కిషన్, 'అల్లరి' నరేశ్, విజయ్, మిర్నా

''ఇప్పటి వరకూ మిమ్మల్ని (ప్రేక్షకుల్ని) కితకితలు పెట్టించాను.. మరికొన్ని సినిమాల్లో కన్నీళ్లు పెట్టించాను. కానీ, 'ఉగ్రం' చిత్రంలో నా ఉగ్ర రూపం చూస్తారు. 'నాంది' సినిమాని ఎంత ఆదరించారో అంతకుమించి పదిరెట్లు 'ఉగ్రం' ని ఆదరించాలని కోరుకుంటున్నాను'' అని హీరో 'అల్లరి' నరేశ్ అన్నారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్, మిర్నా మీనన్ జంటగా నటించిన చిత్రం 'ఉగ్రం'. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ – ''ఉగ్రం' నా కెరీర్‌లో 60వ సినిమా. 'అల్లరి' నుంచి 'ఉగ్రం' వరకూ నా జర్నీలో ఉన్న దర్శకులు, నిర్మాతలకు థ్యాంక్స్. నేను, విజయ్ 'నాంది' చేస్తున్నప్పుడు ఎలాంటి అంచనాలు లేవు. కానీ, 'ఉగ్రం' మూవీకి అంచనాలు పెరుగుతాయి.. వాటిని కచ్చితంగా చేరుకోవాలని యూనిట్ అంతా కష్టపడ్డాం. నాకు, విజయ్‌కి సింక్ బాగా కుదిరింది. మా కమిట్‌మెంట్స్ అయిపోయాక మూడో సినిమా కలిసి చేస్తాం. బడ్జెట్ ఎక్కువ అవుతున్నా మా నిర్మాతలు ఎప్పుడూ చర్చ పెట్టలేదు. సినిమాకి ఎంత ఖర్చు పెట్టారో, పబ్లిసిటీ కోసం కూడా బాగా ఖర్చు చేస్తున్నందుకు థ్యాంక్స్. ఈ మూవీ కోసం ప్రతిరోజూ దాదాపు 16 నుంచి 18 గంటలు పనిచేశాం''అన్నారు.

సాహు గారపాటి మాట్లాడుతూ– ''నరేశ్‌గారు ఇప్పటి వరకూ చేయని పాత్రని 'ఉగ్రం' సినిమాలో చేశారు. మేమంతా ఎంత థ్రిల్ అయ్యామో సినిమా చూశాక ప్రేక్షకులు కూడా అంతే థ్రిల్ అవుతారు. ఆయన కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ మూవీ అవుతుంది'' అన్నారు.

హరీష్ పెద్ది మాట్లాడుతూ– ''విజయ్‌గారు అనుకున్నది సాధించుకునే వరకూ నిద్రపోడు.. ఎవర్నీ నిద్రపోనివ్వడు. ఆయనపై మేము పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాడు. ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ అవుతుంది'' అన్నారు.

విజయ్ కనకమేడల మాట్లాడుతూ– ''శ్రీచరణ్ పాకాల ఇప్పటి వరకూ కొంచెం క్లాస్ టచ్‌లో ఉన్న స్పై, థ్రిల్లర్ సినిమాలు చేశాడు. 'ఉగ్రం' తర్వాత 'మనకి పోటీగా ఇంకొకడు వచ్చాడ్రా' అంటూ మాస్ మ్యూజిక్ డైరెక్టర్స్‌కి కొంచెం భయం మొదలవుతుంది.. ఇది నిజం. 'ఉగ్రం' బడ్జెట్ ఎక్కువ అయినా నన్ను నమ్మి సపోర్ట్ చేసిన నిర్మాతలకు థ్యాంక్స్. ఈ సినిమా కోసం రాత్రిపూట వానలో తీసిన ఓ ఫైట్ కోసం నరేశ్‌గారు ఎంత కష్టపడ్డారో సినిమా చూస్తే తెలుస్తుంది'' అన్నారు. ''ఉగ్రం' సినిమా ఘన విజయం సాధించాలి'' అని హీరోలు అడివి శేష్, నిఖిల్, విశ్వక్ సేన్, సందీప్ కిషన్, దర్శకులు హరీష్ శంకర్, శివ నిర్వాణ, వశిష్ఠ, అనిల్ రావిపూడి, వీఐ ఆనంద్ అన్నారు. ఈ వేడుకలో కెమెరామేన్ సిద్, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల, కథ, మాటల రచయితలు తూము వెంకట్, అబ్బూరి రవి పాల్గొన్నారు.



● తమ్మారెడ్డి భరద్వాజ, అశ్వనీదత్, ఆదిశేషగిరి రావు, రామలింగేశ్వర రావు

కొత్త హంగులతో మోసగాళ్లకు మోసగాడు రిలీజ్

- నిర్మాత ఆదిశేషగిరి రావు

''పద్మాలయ పిక్చర్స్‌కి పునాది 'మోసగాళ్లకు మోసగాడు' చిత్రం. మా బ్యానర్‌లో ఎన్నో విజయవంతమైన సినిమాలు తీసినప్పటికీ ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రం ఇది. అభిమానుల కోరిక మేరకు సూపర్‌స్టార్ కృష్ణగారి పుట్టినరోజు సందర్భంగా మే 31న 'మోసగాళ్లకు మోసగాడు' చిత్రాన్ని సరికొత్త హంగులతో మళ్లీ విడుదల చేస్తున్నాం'' అని నిర్మాత ఆదిశేషగిరి రావు అన్నారు. సూపర్ స్టార్ కృష్ణ హీరోగా పద్మాలయ పిక్చర్స్‌లో రూపొందిన 'అల్లూరి సీతారామరాజు' చిత్రం విడుదలై సోమవారంతో 49 ఏళ్లు (1974 మే 1) పూర్తయింది. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో నిర్మాత అశ్వనీదత్ మాట్లాడుతూ– ''కృష్ణగారి వంటి నటులు మళ్లీ రారు. 'మోసగాళ్లకు మోసగాడు' సినిమాతో ఎప్పుడో పాన్ వరల్డ్ సినిమా చేశారాయన'' అన్నారు. ''పద్మాలయ పిక్చర్స్‌పై తీసిన తొలి కౌబాయ్ చిత్రం 'మోసగాళ్లకు మోసగాడు'' అన్నారు దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. ''మోసగాళ్లకు మోసగాడు' ట్రెండ్ సెట్టర్'' అని డైరెక్టర్ బి. గోపాల్ అన్నారు.

కృష్ణగారు అవార్డుల పట్ల ఆసక్తి చూపేవారు కాదు. కానీ, ప్రభుత్వం గుర్తించి అవార్డులు ఇస్తే తీసుకునేవారు. ఇప్పుడు కూడా ఆయనకి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు కోసం నేను ప్రయత్నం చెయ్యను.. ఎవరైనా చేస్తే సంతోషం. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రకటించే అవార్డులకు చాలా ప్రాముఖ్యత ఉండేది.. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తెలుగు రాష్ట్రాలు విడిపోయాక ఆయా ప్రభుత్వాల నుంచి నంది అవార్డుల ప్రస్తావనే రావడం లేదు.

– ఆదిశేషగిరి రావు



● రష్మిక

అందుకే కొన్ని రోజులు మిస్సయ్యా!

''అందరూ క్షమించాలి. కొన్ని రోజులుగా మిమ్మల్ని మిస్సవుతూ వచ్చాను. ఎందుకంటే నెట్‌వర్క్ లేని ప్రాంతంలో షూటింగ్ చేస్తున్నాను'' అని రష్మికా మందన్నా సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. ఆమె కథానాయికగా తెలుగు, తమిళ భాషల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రెయిన్ బో'. ఇందులో దేవ్ మోహన్ హీరో. ఈ చిత్రం షూటింగ్ కొన్నాళ్లు నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో జరిగింది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ పూర్తయి, నెట్‌వర్క్ ఉన్న ప్రాంతానికి రావడంతో రష్మిక పై విధంగా పేర్కొన్నారు. ఇంకా ఈ చిత్రం గురించి రష్మికా మందన్నా మాట్లాడుతూ – ''ఫస్ట్ చెన్నైలో కొన్ని రోజులు 'రెయిన్ బో' షూటింగ్ చేశాం. ఆ తర్వాత కొడైకెనాల్ వెళ్లాం. అక్కడ షూట్ చేసి, మున్నార్‌లో మొదలుపెట్టాం. ఈ రెండు ప్రాంతాల్లోనూ నెట్‌వర్క్ లేదు. అయితే షెడ్యూల్ చాలా కూల్‌గా జరిగింది. కొడైకెనాల్‌లో నా గది నుంచి సూర్యోదయాన్ని తిలకించడం ఓ అందమైన అనుభూతి. మంచుకి తడిచిన పువ్వులు కంటికి హాయినిచ్చాయి. మున్నార్ కూడా అంతే. అందమైన, ఆహ్లాదకరమైన ప్రాంతాల్లో షూటింగ్ చేయడం మనసుకి ఉల్లాసంగా అనిపించింది'' అన్నారు.

కొత్తదనం లేకపోతే ప్రేక్షకులు చూడరు - 'దిల్' రాజు



● కాశీ విశాల్, 'దిల్' రాజు, ఆశిష్

''ప్రేక్షకులకు విజయవంతమైన సినిమా ఇవ్వడం అంత తేలిక కాదు. 'బలగం, దసరా, విరూ పాక్ష'.. ఇలా కొత్తదనంతో నూతన దర్శకులు తీసిన చిత్రాలు ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నాయి. కొత్తదనం లేని సినిమాలు చూడటానికి రెడీగా లేరు.. అది ఇవ్వడానికి రాత్రీపగలు కష్టపడాల్సిందే'' అన్నారు 'దిల్' రాజు. ఆశిష్, ఇవానా జంటగా కాశీ విశాల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సెల్ఫిష్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, సుకుమార్ రైటింగ్స్‌పై 'దిల్' రాజు–శిరీష్ నిర్మిస్తున్నారు. ఆశిష్ పుట్టినరోజు (మే 1)ని పురస్కరించుకుని 'సెల్ఫిష్'లోని 'దిల్ ఖుష్..' అంటూ సాగే పాటని విడుదల చేశారు. మిక్కీ జె. మేయర్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, జావేద్ అలీ పాడారు. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ– ''నేను, సుకుమార్ సపోర్ట్‌గా ఉంటాం. కానీ, ప్రేక్షకులకు నచ్చాల్సింది మాత్రం ఆశిష్. దాని కోసం తను కష్టపడాలి'' అన్నారు. ''సెల్ఫిష్' కోసం నేను, కాశీ ప్రాణం పెట్టి కష్టపడుతున్నాం'' అన్నారు ఆశిష్. ''మాస్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోన్న చిత్రం ఇది'' అన్నారు విశాల్ కాశీ. ఈ చిత్రానికి సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అశోక్ బండ్రెడ్డి.

వాస్తవ ఘటనలతో...

అనిరుధ్, యశస్విని జంటగా భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో చంద్రకళ పందిరి నిర్మించిన చిత్రం 'యాద్గిరి అండ్ సన్స్'. మే 5న విడుదల కానున్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న 'భీమ్లా నాయక్' చిత్ర దర్శకుడు సాగర్ కె. చంద్ర ట్రైలర్‌ని ఆవిష్కరించారు. అనంతరం సాగర్ కె. చంద్ర మాట్లాడుతూ– ''ఈ చిత్రం ట్రైలర్ కొత్తగా ఉండటంతో దర్శకుడిని కథ అడిగాను. వాస్తవ ఘటనలతో మంచి ప్రయత్నం చేశారు. ఈ సినిమా సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''హీరోగా నాకిది తొలి సినిమా'' అన్నారు అనిరుధ్. ''యాద్గిరి అండ్ సన్స్' ఇంటెలిజెంట్ మూవీ. చాలా సిన్సియర్‌గా మ్యూజిక్ చేశాను'' అన్నారు విజయ్ కురాకుల. ''ప్రేక్షకులకు మంచి సినిమా ఇస్తున్నాం. చూసి, నచ్చితే మరో పది మందికి చెప్పి, సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు భిక్షపతి రాజు.



● అనిరుధ్, సాగర్, భిక్షపతి

పురుషోత్తముడు షురూ



● రాజ్ తరుణ్, హాసినీ సుధీర్

రాజ్ తరుణ్ హీరోగా 'పురుషోత్తముడు' చిత్రం షురూ అయింది. రామ్ భీమన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో హాసినీ సుధీర్ కథానాయిక. రమేష్ తెజావత్, ప్రకాష్ తెజావత్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి డైరెక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సి. కల్యాణ్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. రామ్ భీమన మాట్లాడుతూ– ''ఆకతాయి' చిత్రం తర్వాత నేను చేస్తున్న సినిమా 'పురుషోత్తముడు'. హైదరాబాద్, రాజమండ్రి, కేరళలో ఈ చిత్రం షూటింగ్‌ని ప్లాన్ చేశాం'' అన్నారు. ''ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు చక్కటి ఫ్యామిలీ డ్రామా, ఎమోషన్స్ ఉన్న చిత్రం ఇది'' అన్నారు రాజ్ తరుణ్. ''అమలాపురంలో పుట్టి కాకినాడలో పెరిగి ముంబైలో సెటిల్ అయ్యాం. రామ్‌గారు చెప్పిన కథ ఆకట్టుకోవడంతో ఈ సినిమా తీస్తున్నాం'' అన్నారు రమేష్ తెజావత్, ప్రకాష్ తెజావత్. సినిమాటోగ్రాఫర్ పీజీ విందా, సంగీత దర్శకుడు గోపీసుందర్, గీత రచయిత రామజోగయ్య శాస్త్రి, నిర్మాతలు దామోదర్ ప్రసాద్, దాసరి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: వెంగళరావు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	463	61,112
నిఫ్టీ ▲	150	18,065

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,252	▲	25
డోజోన్స్	34,162	▲	63
ఎఫ్‌టీఎస్‌ఈ 100 (శుక్రవారం ముగింపు)	7,871	▲	39
డాక్స్ (శుక్రవారం ముగింపు)	15,922	▲	122
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,323	▲	37
నికాయ్	29,123	▲	267

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో (శుక్రవారం ముగింపు) — ముంబై

బంగారం (24 క్యారట్)	60,168	▼	347
బంగారం (22 క్యారట్)	59,927	▼	346
వెండి (కిలో)	73,868	▼	547

4 నెలల గరిష్టానికి తయారీ

ఏప్రిల్‌లో పీఎంఐ సూచీ @ 56.4



న్యూఢిల్లీ: కొత్త ఆర్డర్ల వృద్ధి, ధరలపరమైన ఒత్తిళ్లు తగ్గుతుండటం తదితర సానుకూల అంశాల ఊతంతో దేశీయంగా తయారీ కార్యకలాపాలు ఏప్రిల్‌లో పుంజుకున్నాయి. నాలుగు నెలల గరిష్టానికి చేరాయి. ఇందుకు సంబంధించిన పీఎంఐ సూచీ (ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్) మార్చిలో 56.4 పాయింట్లు ఉండగా ఏప్రిల్‌లో 57.2 పాయింట్లకు పెరిగింది. సూచీ 50కి ఎగువన ఉంటే వృద్ధిని, దానికి దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. అంతర్జాతీయంగా అమ్మకాలు పెరుగుతుండటం, సరఫరా వ్యవస్థపరమైన పరిస్థితులు మెరుగుపడుతుండటం వంటివి కూడా ఇందుకు దోహదపడినట్లు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోల్యానా డి లిమా తెలిపారు. దీనికి సంబంధించిన సర్వే ప్రకారం.. ఈ ఏడాది ఇప్పటివరకు ఫ్యాక్టరీ ఆర్డర్లు, ఉత్పత్తి వృద్ధి రేటు పటిష్టంగా ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో మరిన్ని ఉద్యోగాల కల్పన జరిగిందని, తగ్గిపోయే నిల్వలను భర్తీ చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా కంపెనీలు కూడా మరింతగా ముడి సరుకులను కొనుగోలు చేస్తున్నాయని లిమా వివరించారు. భారతీయ తయారీ సంస్థలు ముందుకు దూసుకెళ్లడానికి పుష్కలమైన అవకాశాలు కనిపిస్తున్నాయని లిమా పేర్కొన్నారు. మార్కెట్లో సానుకూల పరిస్థితులు, డిమాండ్ మెరుగ్గా ఉండటం వంటి అంశాలు కొత్త ఆర్డర్లకు దోహదపడుతున్నాయని చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-5-2023	
విశాఖ	430-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	66.00
1-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

జీఎస్‌టీ వసూళ్లు.. రికార్డు శుభారంభం

- ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లో రూ.1.87 లక్షల కోట్లు
- 2017 జూలైలో ప్రారంభమైన తర్వాత భారీ వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లోనే రికార్డు సృష్టించాయి. ఏకంగా రూ.1.87 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. అన్ని పరోక్ష పన్నులనూ ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ, 2017 జూలైలో కొత్త పన్ను విధానం ప్రారంభమైన తర్వాత ఈ స్థాయి వసూళ్లు జరగడం ఇదే తొలిసారి. 2022 ఇదే నెలతో పోల్చితే వసూళ్లు 12 శాతం పెరిగాయి. 2022 ఏప్రిల్‌లో రూ.1.68 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి. ఇప్పటివరకూ ఈ అంకెలే రికార్డు స్థాయి కావడం గమనార్హం.

విభాగాల వారీగా...

- మొత్తం పన్ను వసూళ్లు రూ.1,87,035 కోట్లు
- సెంట్రల్ జీఎస్‌టీ రూ.38,440 కోట్లు
- స్టేట్ జీఎస్‌టీ రూ. 47,412 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.89,158 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.34,072 కోట్లుసహా)
- సెస్ రూ.12,025 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.901 కోట్ల వసూళ్లుసహా)

భారత్ ఎకానమీకి గొప్ప వార్త



రికార్డు స్థాయిలో జీఎస్‌టీ వసూళ్లు ప్రశంసనీయం. భారత ఆర్థిక వ్యవస్థకు ఇది గొప్ప వార్త. తక్కువ పన్ను రేట్లు ఉన్నప్పటికీ, పన్నుల వసూళ్లు నెలవారీగా ఈ స్థాయికి పెరగడం జీఎస్‌టీ పట్ల వ్యవస్థలో పెరిగిన విశ్వాసాన్ని, ఆమోదనీయతను, సమ్మతిని సూచిస్తోంది.

– ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్

- దేశీయ లావాదేవీల (సేవల దిగుమతులతో సహా) ద్వారా వచ్చే ఆదాయాలు గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 2023 ఏప్రిల్‌లో 16% వృద్ధి.
- ఏప్రిల్ 20 ఒకే రోజున అత్యధికంగా రూ. 68,228 కోట్ల చెల్లింపులు జరిగాయి.
- 2022–23లో జీఎస్‌టీ వసూళ్లు రూ.18.10 లక్షల కోట్లు. 2021–22 కంటే 22% అధికం.

కొనసాగిన ఆటో అమ్మకాల జోరు

- ఎస్‌యూవీలకు పెరిగిన డిమాండ్ ప్రభావం
- పెరిగిన మారుతీ, హ్యుందాయ్, టాటా మోటార్స్ విక్రయాలు
- దూసుకెళ్లిన ద్విచక్ర వాహనాల అమ్మకాలు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి నెల ఏప్రిల్‌లో ఆటో అమ్మకాల్లో మెరుగైన వృద్ధి నమోదైంది. ప్రధానంగా స్పోర్ట్స్ యుటిలిటి వాహనాల(ఎస్‌యూవీ)కు డిమాండ్ కలిసొచ్చింది. దిగ్గజ కంపెనీలైన మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్ సంస్థలు డీలర్లకు అధిక సంఖ్యలో వాహనాలను సరఫరా చేశాయి. మారుతీ సుజుకీ గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో మొత్తం 1,50,661 వాహనాలను విక్రయించగా, ఏప్రిల్‌లో ఈ సంఖ్య 7 శాతం మేర పెరిగి 1,60,529 యూనిట్లకు చేరింది. ''చిప్ కొరతతో గత నెలలో కొంత ఉత్పత్తి నష్టం జరిగింది. అయితే ఎస్‌యూవీ విభాగంలో 21 శాతం వృద్ధి నమోదు కావడంతో మొత్తం అమ్మకాల పరిమాణం పెరిగింది. ద్రవ్యోల్బణ సమస్య, గ్రామీణ ప్రాంతాల్లో విక్రయాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉండటంతో రానున్న రోజుల్లో సెంటిమెంట్ స్తబ్దుగా ఉండొచ్చు'' అని ఎంఎస్‌ఐ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు.

- ద్విచక్ర వాహన విక్రయాలకు డిమాండ్ కొనసాగడంతో చెప్పుకోదగిన స్థాయిలో విక్రయాలు జరిగాయి. హీరో మోటోకార్ప్(5% క్షీణత) మినహా టీవీఎస్ మోటార్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, హెచ్ఎంఎస్ఐ అమ్మకాలు వరుసగా 4%, 18%, 6% చొప్పున పెరిగాయి.

కంపెనీ	ఏప్రిల్ 2023	ఏప్రిల్ 2022	క్షీణత/వృద్ధి(శాతాల్లో)
మారుతీ సుజుకీ	1,60,529	1,50,661	(+)7
హ్యుందాయ్ మోటార్స్	58,201	56,201	(+)4
టాటా మోటార్స్	69,599	72,468	(-)4
ఎంఅండ్ఎం	58,801	54,455	(+)8
హోండా కార్స్	5,313	7,874	(-)33
ఎంజీ మోటార్స్	4,193	4,528	(-)7
టయోటా కిర్లోస్కర్	14,162	15,086	(-)6
కియా ఇండియా	23,216	19,019	(+)22
నిస్సాన్ మోటార్	2,617	2,110	(+)24
ద్విచక్ర వాహనాలు			
హీరో మోటోకార్ప్	3,96,107	4,18,622	(-)5
టీవీఎస్ మోటార్స్	3,06,224	2,95,308	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	73,136	62,155	(+)18
హెచ్ఎంఎస్ఐ	3,38,289	3,18,734	(+)6
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,567	5,525	(+)19
ఎస్కార్ట్స్	7,252	7,676	(-)9

- విద్యుత్ ద్విచక్ర వాహన అమ్మకాలు ఏప్రిల్‌లో గణనీయంగా తగ్గాయి. నెల ప్రాతిపదికన మార్చిలో 82,292 యూనిట్లు అమ్ముడయ్యాయి. అవి ఈ ఏప్రిల్‌లో 62,581 యూనిట్లకు తగ్గాయి.

జేపీ మోర్గాన్ చేతికి ఫస్ట్ రిపబ్లిక్



న్యూయార్క్: ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌లో తలెత్తిన సంక్షోభం మొత్తం వ్యవస్థకు వ్యాపించకుండా చూసేందుకు అమెరికా బ్యాంకింగ్ రంగ నియంత్రణ సంస్థలు రంగంలోకి దిగాయి. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌ను తమ అధీనంలోకి తీసుకున్నాయి. బ్యాంకు డిపాజిట్లు, అసెట్లలో చాలా మటుకు భాగాన్ని జేపీ మోర్గాన్ చేజ్ బ్యాంక్‌నకు విక్రయించాయి. అమెరికా చరిత్రలో ఓ భారీ స్థాయి బ్యాంకు విఫలం కావడం ఇది రెండోసారి. 2008లో అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో వాషింగ్టన్ మ్యూచువల్ కుప్పకూలింది. ప్రస్తుత ఫస్ట్ రిపబ్లిక్ తరహాలోనే అప్పట్లో వాషింగ్టన్ మ్యూచువల్‌ను కూడా జేపీ మోర్గాన్ చేజ్ బ్యాంకే టేకోవర్ చేసింది. సోమవారం నుంచి ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌కు ఎనిమిది రాష్ట్రాల్లో ఉన్న 84 శాఖలు .. జేపీమోర్గాన్ చేజ్ బ్యాంక్ బ్రాంచీలుగా పనిచేయడం ప్రారంభమవుతుందని ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డీఐసీ) వెల్లడించింది. ఏప్రిల్ 13 గణాంకాల ప్రకారం ఫస్ట్ రిపబ్లిక్‌కు 229 బిలియన్ డాలర్ల అసెట్లు, 104 బిలియన్ డాలర్ల మేర డిపాజిట్లు ఉన్నాయి. పరిమాణం ప్రకారం అమెరికన్ బ్యాంకుల్లో 14వ స్థానంలో ఉంది. సిలికాన్ వ్యాలీ బ్యాంకు సమస్య పరిష్కారానికి డిపాజిట్ ఇన్సూరెన్స్ ఫండ్‌పై 20 బిలియన్ డాలర్ల భారం పడగా, ఫస్ట్ రిపబ్లిక్‌పరంగా మరో 13 బిలియన్ డాలర్ల మేర ప్రభావం పడవచ్చని ఎఫ్‌డీఐసీ అంచనా వేసింది. సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్‌లు సంక్షోభంలో చిక్కుకున్న ప్రభావంతో మార్చి నుంచి ఫస్ట్ రిపబ్లిక్ సైతం సవాళ్లు ఎదుర్కొంటోంది. తక్కువ వడ్డీ రేట్లకు ఎక్కువగా రుణాలివ్వడం, అధిక శాతం డిపాజిట్లకు బీమా భద్రత లేకపోవడం వంటి అంశాల కారణంగా బ్యాంకుపై డిపాజిటర్లలో నమ్మకం సన్నగిల్లింది. ఫలితంగా బిలియన్ల కొద్దీ డాలర్ల విత్‌డ్రాయల్స్ వెల్లువెత్తాయి. ఒక దశలో ఫస్ట్ రిపబ్లిక్‌కి సహాయం చేసేందుకు ఇతర బ్యాంకులు కూడా ముందుకు వచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో గత వారాంతంలో భేటీ అయిన అమెరికా నియంత్రణ సంస్థలు పరిష్కార మార్గాన్ని అమలు చేశాయి.

ఏప్రిల్‌లో పెరిగిన ఇంధన డిమాండ్

7.15 మిలియన్ టన్నులకు డీజిల్ అమ్మకాలు; 6.7 శాతం అప్



న్యూఢిల్లీ: రబీ పంటల కోత పనులు ప్రారంభం కావడం, ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం వంటి అంశాల దన్నుతో ఏప్రిల్‌లో ఇంధనాలకు డిమాండ్ పెరిగింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే డీజిల్ అమ్మకాలు 6.7% పెరిగి 7.15 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. నెలవారీగా చూస్తే మార్చితో పోల్చినప్పుడు 4.8% వృద్ధి నమోదైంది. సోమవారం వెలువడిన గణాంకాల ప్రకారం.. పెట్రోల్ అమ్మకాలు ఏప్రిల్‌లో వార్షికంగా 2.5% పెరిగి 2.64 మిలియన్ టన్నులకు చేరగా, నెలవారీగా మాత్రం స్వల్పంగా 0.5% మేర తగ్గాయి. రబీ పంటల కోతకు ట్రాక్టర్లను ఉపయోగిస్తుండటం వల్ల డీజిల్ వినియోగం పెరుగుతుంది.

ఫ్యాప్సీలో లలితా జ్యువెల్లరి చైర్మన్‌కు ఘన సత్కారం



విశాఖపట్నం: లలితా జ్యువెల్లరి చైర్మన్ ఎం.కిరణ్ కుమార్‌ను ఏపీ మంత్రులు ఘనంగా సత్కరించారు. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్(ఫ్యాప్సీ) ఎక్సలెన్స్ అవార్డుల లాంచింగ్ కార్యక్రమం విశాఖపట్నంలో జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 11 రంగాలలో రాణించిన వారికి ఫ్యాప్సీ ఎక్సలెన్స్ అవార్డులు అందజేశారు. 2023 నుంచి 2033 వరకు పదేళ్ల కాలానికి అగ్రి, ఆక్వా ఆధారిత పరిశ్రమల్లో ఎక్సలెన్స్‌ను నెలకొల్పినందుకుగానూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌లు కిరణ్‌కుమార్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, ఫ్యాప్సీ అధ్యక్షుడు కరుణేంద్ర జాస్తి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ గురుకులాల్లో 434 లైబ్రేరియన్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం , మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థ(పాఠశాలలు)ల్లో డైరెక్ట్ ప్రాతిపదికన లైబ్రేరియన్(స్కూల్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 434

సొసైటీల వారీగా ఖాళీలు

» తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు–54.
» మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు–180.
» తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు–200.
» **అర్హత:** డిగ్రీతోపాటు లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.38,890 నుంచి రూ.1,12,510 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(పేపర్–1, పేపర్–2), సర్టిఫికేట్ల వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2023.
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

రాయలసీమ యూనివర్శిటీలో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

కర్నూలులోని రాయలసీమ యూనివర్శిటీ, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాలు/సబ్జెక్టుల్లో తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26
» **సబ్జెక్టులు/స్పెషలైజేషన్:** సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు బోధన /పరిశోధనానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** గేట్–2023/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్ 2023 స్కోరు, స్క్రీనింగ్ టెస్ట్, సెమినార్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2023.
» **వెబ్‌సైట్:** www.rayalaseemauniversity.ac.in

గణాంక శాస్త్రం..ఘనమైన కొలువు

ఇండియన్ ఎకనామిక్ సర్వీస్.. ఐఈఎస్‌గా సుపరిచితం! ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్.. సంక్షిప్తంగా ఐఎస్ఎస్!! ఈ రెండు సర్వీసుల్లో పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఐఈఎస్/ఐఎస్ఎస్–2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారు మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్; అలాగే కేంద్ర ఆర్థిక శాఖలో జూనియర్ టైమ్ స్కేల్‌తో అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ కొలువులు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఐఈఎస్/ఐఎస్ఎస్–2023 పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్, కెరీర్ స్కోప్ తదితర వివరాలు..

» ఐఈఎస్, ఐఎస్ఎస్–2023 నోటిఫికేషన్ విడుదల
» ఎకనామిక్స్‌లో పీజీ, స్టాటిస్టిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పీజీ అర్హత
» మొత్తం 51 పోస్టులకు రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

రెండు సర్వీసుల్లో.. 51 పోస్టులు

ఐఈఎస్/ఐఎస్ఎస్–2023 నోటిఫికేషన్ ద్వారా.. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 33 పోస్టులను భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- ఐఈఎస్ అభ్యర్థులు ఎకనామిక్స్ లేదా అప్లైడ్ ఎకనామిక్స్ లేదా బిజినెస్ ఎకనామిక్స్ లేదా ఎకనోమెట్రిక్స్ స్పెషలైజేషన్లతో పీజీ ఉత్తీర్ణత సాధించాలి.
- ఐఎస్ఎస్ అభ్యర్థులు స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్‌లలో ఏదో ఒక సబ్జెక్ట్‌తో బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత(లేదా) స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఈ ఏడాది చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

- ఆగస్ట్ 1, 2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి(ఆగస్ట్ 2,1993–ఆగస్ట్ 1, 2002 మధ్యలో జన్మించి ఉండాలి).
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఇస్తారు.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

యూపీఎస్సీ.. ఐఈఎస్/ఐఎస్ఎస్ ఎంపిక ప్రక్రియ రెండంచెలుగా ఉంటుంది. మొదటి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఒక్కో పోస్టుకు 2.5 నిష్పత్తిలో తదుపరి దశలో పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల్లో పొందిన మార్కుల ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు.

రాత పరీక్షలు.. వేర్వేరుగా

- ఐఈఎస్, ఐఎస్ఎస్‌లకు సంబంధించి ఉమ్మడి నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ.. రాత పరీక్షలు మాత్రం రెండు సర్వీసులకు వేర్వేరుగా ఉంటాయి.
- ఐఈఎస్ రాత పరీక్షను ఆరు పేపర్లుగా వేయి మార్కులకు నిర్వహిస్తారు. అవి..
- పేపర్–1 జనరల్ ఇంగ్లిష్ 100 మార్కులు; పేపర్–2 జనరల్ స్టడీస్ 100 మార్కులు; పేపర్–3 జనరల్ ఎకనామిక్స్–1, 200 మార్కులు; పేపర్–4 జనరల్ ఎకనామిక్స్–2, 200 మార్కులు; పేపర్–5 జనరల్ ఎకనామిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 ఇండియన్ ఎకనామిక్స్ 200 మార్కులు. ఇలా మొత్తం 1,000 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఐఈఎస్ పరీక్ష పేపర్లన్నీ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలోనే ఉంటాయి.
- పరీక్షకు కేటాయించిన సమయం 3 గంటలు.

ఐఎస్ఎస్‌కు ఇలా

- ఐఎస్ఎస్ రాత పరీక్షలోనూ ఆరు పేపర్లు ఉంటాయి. వేయి మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఐఈఎస్‌తో పోల్చితే.. ఐఎస్ఎస్ రాత పరీక్ష కొంత భిన్నంగా ఉంటుంది. ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలతో ఆయా పేపర్లు ఉంటాయి.
- పేపర్–1 జనరల్ ఇంగ్లిష్–100 మార్కులు; పేపర్–2 జనరల్ స్టడీస్–100 మార్కులు; పేపర్–3 స్టాటిస్టిక్స్–1, 200 మార్కులు; పేపర్–4 స్టాటిస్టిక్స్–2, 200 మార్కులు; పేపర్–5 స్టాటిస్టిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 స్టాటిస్టిక్స్–4, 200 మార్కులు; మొత్తం మార్కులు 1000.
- స్టాటిస్టిక్స్–1, స్టాటిస్టిక్స్–2 పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. వీటిలో 80 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. వీటికి కేటాయించిన సమయం రెండు గంటలు. మిగతా పేపర్లకు కేటాయించిన సమయం మూడు గంటలు.
- స్టాటిస్టిక్స్–3, 4 పేపర్లు డిస్క్రిప్టివ్ విధానంలోనే నిర్వహిస్తున్నప్పటికీ.. వీటిలో షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్, స్మాల్ ప్రాబ్లమ్ కొశ్చన్స్ ఉంటాయి. మొత్తం ప్రశ్నల్లో ఈ తరహా ప్రశ్నలు 50 శాతం మేరకు ఉంటాయి. మరో 50 శాతం ప్రశ్నలు దీర్ఘ సమాధాన ప్రశ్నలు, కాంప్రహెన్షన్ ప్రాబ్లమ్ ప్రశ్నలుగా ఉంటాయి.
- స్టాటిస్టిక్స్ పేపర్–4లో మొత్తం ఏడు సెక్షన్లలో ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఛాయిస్ విధానంలో ఏదైనా రెండు సెక్షన్లు ఎంచుకుని.. ఆ రెండు సెక్షన్లలోనే పరీక్ష రాసే అవకాశం ఉంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో చివరి దశ..పర్సనల్ ఇంటర్వ్యూ. తొలిదశ రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పోస్ట్‌ల సంఖ్య, రిజర్వేషన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఇందులో చోటు సంపాదించిన వారికి మలిదశలో 200 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ కనబరిస్తే.. రాత పరీక్షలో మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులను క్రోడీకరించి తుది విజేతలను ఖరారు చేసి.. ఆయా సర్వీసులకు ఎంపిక చేస్తారు.

విజయానికి అడుగులు ఇలా

ఐఈఎస్, ఐఎస్ఎస్ పరీక్షల్లో విజయం సాధించడానికి అభ్యర్థులు ప్రధానంగా.. పీజీ స్థాయి పుస్తకాలను చదవడం ఎంతో ఉపకరిస్తుంది. అదే విధంగా ప్రీవియస్ పేపర్లు, మోడల్ పేపర్ల సాధన కూడా సత్ఫలితాలకు దోహదం చేస్తుంది.

జనరల్ ఇంగ్లిష్

రెండు సర్వీసులకు ఉమ్మడిగా ఉండే పేపర్ ఇది. ఇందులో ప్రశ్నల క్లిష్టత బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఉంటుంది. మంచి మార్కుల సాధనకు వొకాబ్యులరీని, రీడింగ్ కాంప్రహెన్షన్ టెక్నిక్స్‌ను పెంచుకోవాలి. ఇంగ్లిష్‌లో ఎక్కువగా ప్యాసేజ్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ స్టడీస్

రెండు సర్వీసుల అభ్యర్థులకూ ఉండే మరో పేపర్.. జనరల్ స్టడీస్. ఇందులో అధిక శాతం ప్రశ్నలు.. కరెంట్ ఈవెంట్స్, జనరల్ నాలెడ్జ్ నుంచి అడుగుతున్నారు. ఇందులో రాణించేందుకు తాజా పరిణామాలతోపాటు శాస్త్రసాంకేతిక రంగం, భారత రాజ్యాంగం, భారతదేశ చరిత్ర, జాగ్రఫీలపై పట్టు సాధించాలి. అభ్యర్థులు సివిల్స్ జనరల్ స్టడీస్ పేపర్లు, ప్రిలిమ్స్ పేపర్లు అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది.

ఐఈఎస్ సబ్జెక్ట్ పేపర్లకు ఇలా

జనరల్ ఎకనామిక్స్–1

సూక్ష్మ అర్థశాస్త్రం, మ్యాథమెటిక్స్, స్టాటిస్టికల్ ఎకనోమెట్రిక్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. సూక్ష్మ అర్థశాస్త్రానికి సంబంధించి వినియోగదారుని డిమాండ్ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ, పంపిణీ అంశాలు తెలుసుకోవాలి. అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ఉండే ఈ పేపర్ కోసం లాగ్రెంజ్ వక్ర రేఖ, ఏంజెల్ సూత్రం, షాడో ప్రైస్, పారెటో పంపిణీ సిద్ధాంతం, స్వల్ప కాల–దీర్ఘకాల వ్యయ రేఖలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ ఎకనామిక్స్–2

స్థూల అర్థశాస్త్రం, ఎకనామిక్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్, అంతర్జాతీయ అర్థశాస్త్రం తదితర అంశాల కలయికగా ఉండే ఈ పేపర్ కోసం ప్రతి అంశాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ చదువుకోవాలి. జాతీయాదాయం కొలమానం, గ్రీన్ నేషనల్ ఇన్‌కమ్, సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం, ఫిలిప్స్ రేఖ, ద్రవ్యరాశి సిద్ధాంతం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రపంచ వాణిజ్య సంక్షోభాలు–కారణాలు, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల తాజా కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఎకనామిక్స్–3

ఈ పేపర్ ప్రభుత్వ విత్త శాస్త్రం, పర్యావరణ అర్థశాస్త్రం, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాల సమ్మిళితంగా ఉంటుంది.ఇందులో మంచి మార్కుల కోసం పన్ను సంస్కరణలు, గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం, ప్రభుత్వ వ్యయ సిద్ధాంతం, గ్రీన్ జీడీపీ, క్యోటో ప్రోటోకాల్, బాలి యాక్షన్ ప్లాన్, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాలపై అవగాహన పొందాలి.

ఇండియన్ ఎకనామిక్స్

సిలబస్‌లోని ముఖ్యాంశాలను వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ నోట్స్ రూపొందించుకోవాలి. దీన్ని పదే పదే చదవాలి. అలాగే స్థిరీకరణ–నిర్మాణాత్మక సర్దుబాటు ప్యాకేజీ, విత్తరంగ సంస్కరణలు, నీతి ఆయోగ్ సిఫార్సులు, టోకు ధరల సూచీ–రిటైల్ ధరల సూచీ, భారత ద్రవ్య మార్కెట్, ఎఫ్‌డీఐ, డిజిన్వెస్ట్‌మెంట్ పాలసీ తదితర తాజా అంశాలపై దృష్టి సారించాలి.

ఐఎస్ఎస్ సబ్జెక్ట్ పేపర్లకు ఎలా

స్టాటిస్టిక్స్–1

ఈ పేపర్‌లో రాణించాలంటే..పలు సిద్ధాంతాలపై పట్టు సాధించాలి. స్టాటిస్టికల్ మెథడ్స్, న్యూమరికల్ అనాలిసిస్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.

స్టాటిస్టిక్స్–2

ఈ పేపర్‌లో లీనియర్ మోడల్స్, ఎస్టిమేషన్, హైపోథిసిస్ టెస్టింగ్, మల్టీవెరైటీ అనాలిసిస్(ఎస్టిమేషన్ ఆఫ్ మీన్ వెక్టార్ అండ్ కో వేరియన్స్ మ్యాట్రిక్స్ తదితర) అంశాలపై దృష్టిసారించాలి.



స్టాటిస్టిక్స్–3

శాంప్లింగ్ టెక్నిక్స్, ఎకనామిక్ సాటిస్టిక్స్, డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్, ఎకనోమెట్రిక్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

స్టాటిస్టిక్స్–4

- స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఆపరేషన్స్ రీసెర్చ్, డెమోగ్రఫీ అండ్ వైటల్ ఛార్ట్స్, కంప్యూటర్ సిస్టమ్–సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కంప్యూటర్ సంబంధ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- డేటా ఆధారిత అంశాలు అధికంగా ఉండే స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ పేపర్లలో మంచి స్కోర్ చేయాలంటే.. వేగంతోపాటు కచ్చితత్వం, సునిశిత పరిశీలన అవసరం. ప్రిపరేషన్ సమయంలోనే ప్రతి అంశాన్ని నిర్దిష్ట కాలపరిమితి విధించుకుని చదవాలి. ముఖ్యంగా ఆయా సిద్ధాంతాలు..వాటిని వినియోగించి డేటా రూపకల్పన, ఛార్ట్స్, గ్రాఫ్స్ రూకల్పన వంటి అంశాలపై పట్టు సాధించాలి.

జూనియర్ టైమ్ స్కేల్

ఐఈఎస్, ఐఎస్ఎస్‌లకు ఎంపికైన వారికి జూనియర్ టైమ్ స్కేల్ హోదాతో కెరీర్ ప్రారంభమవుతుంది. ఆర్థిక వ్యవహారాల సంబంధ శాఖల్లో అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ కొలువు లభిస్తుంది. నీతి ఆయోగ్, నేషనల్ శాంపుల్ సర్వే, లేబర్ బ్యూరో, ఆర్థిక సంఘం, గ్రామీణాభివృద్ధి, విద్య, వ్యవసాయం, వాణిజ్యం తదితర విభాగాల్లో నియమిస్తారు. అనుభవం, పనితీరు ఆధారంగా డిప్యూటీ డైరెక్టర్/అసిస్టెంట్ అడ్వైజర్(సీనియర్ టైం స్కేల్), జాయింట్ డైరెక్టర్/డిప్యూటీ అడ్వైజర్, సీనియర్ ఎకనమిక్ అడ్వైజర్ తదితర హోదాల నుంచి అత్యున్నత స్థాయి ప్రిన్సిపల్ అడ్వైజర్ లేదా చీఫ్ అడ్వైజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మే 9, 2023
- **దరఖాస్తు సవరణ అవకాశం:** మే 10–మే 16
- **పరీక్ష తేదీ:** జూన్ 23 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తు, పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https//www.upsconline.nic.in, https://www.upsc.gov.in

క్లుప్తంగా...

స్పీకర్‌తో ఎంపీ విజయసాయిరెడ్డి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ : లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాతో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయ సాయి రెడ్డి భేటీ అయ్యారు. సోమవారం పార్ల మెంట్‌లోని స్పీకర్ కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా స్పీకర్‌కు విజయసాయిరెడ్డి తిరుమల శ్రీవారి ప్రతిమను అందజేశారు.

ఏపీలో ఏప్రిల్ జీఎస్టీ వసూళ్లు రూ.4,329 కోట్లు

గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే 6 శాతం అధికం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ.4,329 కోట్ల మేర వస్తుసేవల పన్ను (జీఎస్టీ) వసూలైంది. గత ఏడాది ఏప్రిల్‌లో రూ.4,067 కోట్లున్న జీఎస్టీ వసూళ్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో 6 శాతం పెరిగి రూ.4,329 కోట్లకు చేరినట్లు కేంద్ర ఆర్థికశాఖ సోమవారం వెల్లడించింది. తెలంగాణలో గత ఏడాది ఏప్రిల్‌లో రూ.4,955 కోట్లున్న జీఎస్టీ వసూళ్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో 13 శాతం మేర పెరిగి రూ.5,622 కోట్లకు చేరినట్లు తెలిపింది. ఇక దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లలో ఆల్‌టైమ్ రికార్డు నమోదైందని పేర్కొంది. గడిచిన ఏప్రిల్ నెలలో అత్యంత అధికంగా రూ.1,87,035 కోట్లు వసూలైందని, ఇది గత ఏడాది ఏప్రిల్ వసూళ్ల కన్నా రూ.19,495 కోట్లు అధికమని వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ రూ.38,440 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ.47,412 కోట్లు , ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.89,158 కోట్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన మొత్తం రూ.34,972 కోట్లతో కలిపి), సెస్ రూ.12,025 కోట్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన రూ.901 కోట్లతో కలిపి) ఉందని వివరించింది. ఈ ఏడాది ఏప్రిల్ ఆదాయం గత ఏడాది ఏప్రిల్ ఆదాయం కన్నా 12 శాతం ఎక్కువగా ఉండగా, విదేశీ లావాదేవీల ఆదాయంతో పోలిస్తే 16 శాతం ఎక్కువని తెలిపింది.

రూ.569.54 కోట్ల ఆస్తిపన్ను వసూలు

సాక్షి, అమరావతి: మున్సిపాలిటీల్లోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకున్నారు. 2023–24 సంవత్సరానికి మొత్తం పన్ను ఒకేసారి చెల్లించే వారికి 5 శాతం రాయితీనిస్తూ ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రూ.569.54 కోట్లు వసూలైంది. గతేడాది ఇదే కాలానికి రూ.498.26 కోట్లు పన్నుల రూపంలో వచ్చింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నెలలో రూ.71.28 కోట్లు అధికంగా వసూలవడం విశేషం.

కర్ణాటక సరిహద్దుల్లో 45 చెక్‌పోస్టులు

- సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఈ నెల 10న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్రమ మద్యం, డబ్బు వంటివాటి అక్రమ రవాణా నియంత్రించేందుకు ఏపీ సరిహద్దుల్లో 45 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్.. కమిషనర్లు గోయల్, పాండేలతో కలిసి కర్ణాటక, ఆ రాష్ట్రంతో సరిహద్దు కలిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గోవా, కేరళ, తమిళనాడు సీఎస్‌లు, డీజీపీలు, సీఈవోలు, ఇతర సీనియర్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జవహర్‌రెడ్డి మాట్లాడుతూ 45 చెక్‌పోస్టుల ద్వారా ఇప్పటివరకు 3,008 లీటర్ల అక్రమ ఐఎంఎఫ్ఎల్ లిక్కర్‌ను, ఒక్కొక్కటి 90 మిల్లీలీటర్లున్న 444 టెట్రాప్యాక్‌లను, రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ మద్యం, నగదు అక్రమ రవాణా కాకుండా సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టుల ద్వారా నిరంతర నిఘాపెట్టాలని ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూడాన్ నుంచి ఏపీకి క్షేమంగా 65 మంది

సాక్షి, అమరావతి : అంతర్గత యుద్ధాలతో సతమతమవుతున్న సూడాన్ నుంచి ఇప్పటి వరకు 65 మంది క్షేమంగా రాష్ట్రానికి చేరుకున్నారు. మిగిలిన ఆరుగురిని త్వరలో తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీఎన్ఆర్టీఎస్ సీఈవో వెంకట్ మేడపాటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 71 మందిలో ఎంబసీ వద్ద 58 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వీరిలో ఇప్పటి వరకు 47 మంది రాష్ట్రంలోని స్వగ్రామాలకు చేరుకోగా ఐదుగురు ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ సర్టిఫికెట్ లేకపోవడంతో క్వారంటైన్‌లో ఉన్నట్లు తెలిపారు. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, కొచ్చి విమానాశ్రయాల ద్వారా దేశానికి చేరుకున్న వారిలో 24 మందిని రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులతో స్వగ్రామాలకు చేర్చగా, మిగిలిన వారు, వారు పనిచేస్తున్న సంస్థలు ఏర్పాటు చేసిన సౌకర్యాలతో వారి వారి ఇళ్లకు చేరుకున్నట్లు తెలిపారు.

ప్రాణులకు 'ప్లాస్టికోసిస్' ముప్పు

- ఆస్ట్రేలియా తీరంలోని పక్షుల్లో గుర్తించిన శాస్త్రవేత్తలు
- హవాయి ద్వీపంలో ఏటా 2.50 లక్షల అల్‌బట్రాస్ పక్షి పిల్లల దుర్మరణం
- దీనిని 'ప్లాస్టికోసిస్' వ్యాధిగా పేర్కొన్న నేచురల్ హిస్టరీ మ్యూజియం
- మనుషుల జీర్ణవ్యవస్థలోనూ మైక్రోప్లాస్టిక్ కణాల గుర్తింపు
- నిత్యం సముద్రంలో చేరుతున్న 8 మిలియన్ల ప్లాస్టిక్ ముక్కలు
- రీసైక్లింగ్ ఒక్కటే మార్గమంటున్న పర్యావరణవేత్తలు

ప్లాస్టిక్ వ్యర్థాలతో వచ్చే వ్యాధి తొలిసారి గుర్తింపు



సాక్షి, అమరావతి: మానవాళి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ప్లాస్టిక్.. సముద్ర పక్షులను పొట్టన పెట్టుకుంటోంది. సముద్ర జలాల్లోకి చేరుతున్న చిన్న చిన్న ప్లాస్టిక్ ముక్కలను ఆహారంగా భావించి తింటున్న పక్షులు మూకుమ్మడిగా మరణిస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇటీవల ఆస్ట్రేలియా సమీపంలోని లార్డ్ హోవ్ ద్వీపంలో బ్రౌన్ సీగల్స్‌పై అధ్యయనం చేసి.. మరణించిన పక్షుల శరీరాలను పరీక్షించగా కడుపులో ప్రమాదకరమైన స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్టు తేలింది. అక్కడి ద్వీపంలోని 90 శాతం పక్షుల్లో ప్లాస్టిక్ ఆనవాళ్లు ఉన్నట్టు తేల్చారు. లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం శాస్త్రవేత్తలు ఈ పరిస్థితికి 'ప్లాస్టికోసిస్' వ్యాధిగా నామకరణం చేశారు. వర్తమాన ప్రపంచంలో ప్లాస్టిక్ ద్వారా వచ్చే సమస్యకు పేరు పెట్టడం ఇదే తొలిసారి. ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజు దాదాపు 8 మిలియన్ ప్లాస్టిక్ ముక్కలు సముద్రాల్లోకి చేరుతున్నాయని, అందులో ఎక్కువ భాగం సముద్ర పక్షులు ఆహారంగా తీసుకున్నప్పుడు వాటి జీర్ణవ్యవస్థను నాశనం చేసి మరణానికి దారి తీస్తున్నట్టు తేల్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న పక్షులు చూడ్డానికి ఆరోగ్యంగా కనిపించినా తక్కువ కాలంలోనే జీర్ణ వ్యవస్థ పనిచేయక చనిపోతున్నట్టు నేచురల్ హిస్టరీ మ్యూజియం జీవశాస్త్రవేత్త అలెక్స్ బాండ్ ప్రకటించారు.

తరుణోపాయం ఇదొక్కటే

ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగం భవిష్యత్‌లో మరింత ప్రమాదకారిగా మారుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ)–2022 నివేదిక ప్రకారం మనం వినియోగిస్తున్న ప్లాస్టిక్‌లో కేవలం 9 శాతం మాత్రమే రీసైకిల్ చేస్తున్నట్టు తేలింది. ఇప్పటివరకు ఉత్పత్తి చేసిన 10 బిలియన్ టన్నుల ప్లాస్టిక్‌లో దాదాపు 6 బిలియన్ టన్నులు భూమిని, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నట్టు తేల్చారు. సాధ్యమైన మేర ప్లాస్టిక్‌ను వాడకుండా ఉండటమే ఉత్తమ జాగ్రత్తగా పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికే యూరోపియన్ యూనియన్ ప్రభుత్వాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్లు, కట్లర్లు, స్ట్రాలు, బెలూన్ స్టిక్స్, కాటన్ బడ్స్‌ను పూర్తిగా నిషేధించాయి. గతేడాది 175 దేశాలు 2024 నాటికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి చట్టబద్ధమైన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. భారతదేశంలో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించారు. అయినప్పటికీ మార్కెట్‌లో దాని వినియోగం మాత్రం తగ్గలేదు.



ప్లాస్టికోసిస్ అంటే..

పక్షులు ఆహారంగా భావించి తింటున్న ప్లాస్టిక్ వాటి జీర్ణ వ్యవస్థను దెబ్బతీసి ప్రాణాలను హరిస్తోంది. ఇది పక్షి కడుపులోని గ్రంథులను, జీర్ణ ప్రక్రియను నాశనం చేసి మరణానికి చేరువ చేస్తోందని శాస్త్రవేత్తలు తేల్చారు. ఈ మొత్తం ప్రక్రియకు 'ప్లాస్టికోసిస్'గా పేరు పెట్టారు. హవాయి ద్వీపంలోని అల్‌బట్రాస్ పక్షులు కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు తిని మరణిస్తున్నాయని, ఏటా 2.50 లక్షల అల్‌బట్రాస్ పక్షి పిల్లలు ఇలా ప్రాణాలు కోల్పోతున్నాయని గుర్తించారు. ఈ తరహా లక్షణాలు చాలా సముద్ర జంతువులు, జీవుల్లో కూడా కనిపించాయని పేర్కొన్నారు. ప్లాస్టికోసిస్ లక్షణాలు మానవుల్లోనూ కనిపించాయని, ఇటీవల ఆస్ట్రేలియాలో 52 మంది ప్రేగుల్లో మైక్రోప్లాస్టిక్ కణాలను గుర్తించడంతో శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆకలి మందగించడంతో పాటు ఇతర పరాన్నజీవులు శరీరంలోకి ప్రవేశించి మరణానికి దారితీయవచ్చని చెబుతున్నారు.

1,200కు పైగా జీవుల ఉనికి ప్రశ్నార్థకం



లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం నుంచి వెళ్లిన శాస్త్రవేత్తల బృందం ఆస్ట్రేలియాకు 600 మైళ్ల దూరంలోని లార్డ్‌హోవ్ ద్వీపంలో పక్షుల మరణాలపై అధ్యయనం చేపట్టింది. అక్కడ డజన్లకొద్దీ చనిపోయి పడి ఉన్న బ్రౌన్ సీగల్స్ పక్షుల కళేబరాలను ల్యాబ్‌లో పరీక్షించి ఒక్కో పక్షి కడుపులో దాదాపు 200కు పైగా ప్లాస్టిక్ ముక్కలను వెలికి తీశారు. ఈ తరహా ప్లాస్టిక్ ముక్కలు కేవలం సముద్ర పక్షులనే కాకుండా దాదాపు 1200కు పైగా సముద్ర జీవుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నట్టు గుర్తించారు. వాస్తవానికి 5 మి.మీ. కంటే చిన్న పరిమాణంలో ఉండే ప్లాస్టిక్ ముక్కలు జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తున్నట్టు రెండేళ్ల క్రితం ఎలుకలపై జరిపిన పరిశోధనల్లో తేలింది. కానీ.. బయట వాతావరణంలో ఇలాంటి జబ్బును లార్డ్ హోవ్ ద్వీపంలోనే మొట్టమొదటిసారి గుర్తించడం ఆందోళన కలిగిస్తోంది. పైగా.. జీవించి ఉన్న చాలా పక్షులు బరువు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు, వాస్తవానికి 2010లోనే ఈ పక్షులు తక్కువ బరువు ఉన్నట్టు గుర్తించినా కారణాలను మాత్రం అంచనా వేయలేకపోయారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన పరిశోధనల ప్రకారం వాటి కడుపులోని ప్లాస్టిక్ ముక్కలు జీర్ణం కాకపోవడం వల్లనే అవి ఆహారం తీసుకోవడం లేదని, ఫలితంగా రోజుల వ్యవధిలోనే మరణిస్తున్నట్టు గుర్తించారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

- రాష్ట్ర వ్యాప్తంగా 1,300 క్యాంపుల నిర్వహణకు శాప్ ఏర్పాట్లు
- 15 నుంచి 25 క్రీడాంశాల్లో శిక్షణ
- మే నెలంతా క్రీడా సందడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మట్టిలో మాణిక్యాలను వెలికితీయడంతోపాటు విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో మే నెలంతా ఆసక్తి కలిగిన విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించనుంది. ఇందులో భాగంగా 8 ఏళ్ల నుంచి 14 ఏళ్ల మధ్య వయసు కలిగిన బాలబాలికలకు 15 నుంచి 25 క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తారు. తొలి రోజు వర్షం కారణంగా కొన్ని జిల్లాల్లో శిక్షణ శిబిరాల ప్రారంభానికి ఆటంకం ఏర్పడింది. ఈ నెల 5వ తేదీలోపు పూర్తిస్థాయిలో శిక్షణను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) 26 జిల్లాల్లోని ఎస్ఎస్ఏలు, చీఫ్ కోచ్‌లకు ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాకు 50 శిబిరాలు

ఈ ఏడాది శాప్ రాష్ట్ర వ్యాప్తంగా 1,300 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసింది. ప్రతి జిల్లాలో కచ్చితంగా 50 క్యాంపులు నిర్వహించేలా పర్యవేక్షిస్తోంది. మొత్తం 26 జిల్లాల్లో కలిపి గ్రామీణ ప్రాంతాల్లో 682, పట్టణ ప్రాంతాల్లో 618 శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసింది. క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాల కొనుగోలు, సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

ఉదయం.. సాయంత్రం వేళల్లో...

రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుంది. 16 ఏళ్లు వయసు గల బాలబాలికలకు రెగ్యులర్ కోచింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ శిక్షణ శిబిరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే పీడీలు, పీఈటీల సేవలను వినియోగించుకోనున్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్: శాప్ ఆధ్వర్యాన తిరుపతిలో ఈ నెల 5 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభించారు. సీఎం జగన్ క్రీడలకు, క్రీడాకారులకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలను రూ.1.40కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇప్పటి వరకు శాప్ లీగ్స్, జగనన్న క్రీడా సంబరాలు, జగనన్న సంక్రాంతి సంబరాలు, సీఎం కప్ పోటీలను నిర్వహించినట్లు వివరించారు. రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు అన్ని జిల్లాల నుంచి సుమారు 2,700మంది బాలురు, 1,800మంది బాలికలు హాజరై 14 రకాల క్రీడల్లో పాల్గొంటున్నారని తెలిపారు. శాప్ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్, ఎండీ, వీసీ హర్షవర్ధన్, కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం కప్ టోర్నీని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

పోటీలు ఇలా...

ఫుట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడల్లో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలను ఎస్వీయూ స్టేడియం, ఎస్వీ ఆర్ట్స్, ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్వీయూ, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నారు. తొలిరోజు బాలికల విభాగం, బాలుర విభాగంలో 14 క్రీడాంశాల్లోనూ పోటీలను ప్రారంభించారు.

వెంటనే విడాకులు

న్యూఢిల్లీ:వివాహ బంధం పునరుద్ధరించలేనంతగా దెబ్బ తింటే దంపతులు పరస్పర అంగీకారంతో తక్షణం విడాకులు తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ఇలాంటి సందర్భాల్లో హిందూ వివాహ చట్టం (1955)లో విధించిన ఆరు నెలల తప్పనిసరి వెయిటింగ్ పీరియడ్ వర్తించదని స్పష్టం చేసింది. ఆర్టికల్ 142 (1)కింద ఉన్న అసాధారణ అధికారాలతో వెంటనే విడాకులు మంజూరు చేసే విచక్షణాధికార పరిధి అత్యున్నత న్యాయస్థానానికి ఉందని తేల్చి చెప్పింది. ఫ్యామిలీ కోర్టులతో నిమిత్తం లేకుండా సుప్రీంకోర్టు నేరుగా విడాకులు మంజూరు చేయడంపై పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఆర్టికల్ 142(1) కింద తక్షణం విడాకులు మంజూరు చేసే అధికార పరిధి సుప్రీంకోర్టుకు ఉందా వంటి ప్రశ్నలను లేవనెత్తాయి. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ విక్రం నాథ్, జస్టిస్ జె.కె.మహేశ్వరిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. వాదనలు విన్న అనంతరం గత సెప్టెంబర్‌లో తీర్పును రిజర్వు చేసి సోమవారం తీర్పు వెలువరించింది.

ఆ అధికారాన్ని ఆచితూచి వాడాలి

ఆర్టికల్ 142(1) కింద దఖలు పడిన అసాధారణ అధికారాల ద్వారా సుప్రీంకోర్టు జారీ చేసే ఆదేశాలు దేశవ్యాప్తంగా అమలవుతాయి. వాటి పరిధి అత్యంత విస్తృతమైనదని ధర్మాసనం గుర్తు చేసింది. కనుక ఆ అధికారాలను ఆచితూచి వాడాలని అభిప్రాయపడింది. "వివాహ బంధం పూర్తిగా దెబ్బ తిన్న సందర్భాల్లో విడాకుల మంజూరు సుప్రీంకోర్టు అధికారానికి సంబంధించిన విషయం కాదు. విచక్షణకు సంబంధించినది. సుప్రీంకోర్టు సమస్యల పరిష్కర్తగా వ్యవహరిస్తుంది. కనుక ఇలాంటి విచక్షణాధికారాలను ఇరుపక్షాలకూ పరిపూర్ణ న్యాయం జరిగే రీతిలో అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటూ అత్యంత జాగరూకతతో వినియోగించాల్సి ఉంటుంది. వివాహం పూర్తిగా విఫలమైందని, దంపతులు ఇంకెంత మాత్రమూ కలిసి జీవించే పరిస్థితులు లేవని అసందిగ్ధంగా రుజువై, ఆ బంధాన్ని ఇంకా కొనసాగించడం అన్యాయమని న్యాయస్థానం విశ్వసిస్తే తక్షణం విడాకులు మంజూరు చేయవచ్చు" అని పేర్కొంది. భార్య, పిల్లలు, తల్లిదండ్రులకు భరణం (సీఆర్‌సీ సెక్షన్ 125), వివాహితపై గృహ హింస (ఐపీసీ 498–ఎ) తదితరాల నిబంధనలను కూడా ఇలాంటి సందర్భాల్లో సుప్రీంకోర్టు పక్కన పెట్టవచ్చని స్పష్టం చేసింది. అయితే 32, 226 అధికరణల కింద విడాకుల కోసం నేరుగా హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదని తీర్పులో పేర్కొంది.

పోలవరం పనుల పరిశీలన

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సోమవారం జలవనరులశాఖ కార్యదర్శి శశి భూషణ్‌కుమార్ పరిశీలించారు. ఈఎన్‌సీ నారాయణరెడ్డితో కలిసి డయాఫ్రమ్ వాల్ ప్రాంతంలో గోతులు పూడ్చే పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో పనులు జరుగుతున్న తీరును సమీక్షించారు.

నేటి నుంచి పులిచింతల గేటు అమర్చే పనులు

అచ్చంపేట: పల్నాడు జిల్లా అచ్చంపేట మండల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు అమర్చిన 16వ నంబరు రేడియల్ గేటు 2021 ఆగస్ట్ 5న కృష్ణా నది వరదలకు కొట్టుకుపోగా.. కొత్త గేటు అమర్చే పనులు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గేటు కొట్టుకుపోయిన నాటినుంచి ఇప్పటివరకు రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్‌తో 16వ నంబర్ గేటును బ్లాక్‌చేసి పులిచింతల ప్రాజెక్ట్‌లో సాగునీటిని నింపుతూ వచ్చారు. కాగా.. కొత్తగేటును అమర్చేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ రూ.22.05 కోట్లు మంజూరు చేసింది. వీటిలో రూ.7.53 కోట్లతో రేడియల్ గేటు తయారీ, రూ.1.73 కోట్లతో కాంక్రీట్ పనులు, రూ.9.57 కోట్లతో అన్ని గేట్లను క్రమబద్ధీకరించే పనులు చేపట్టాల్సి ఉంది. మరో రూ.3.20 కోట్లతో నడకదారిని ఏర్పాటు చేయవలసి ఉంది. ఆయా పనులు రెండు నెలలుగా యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఇప్పటివరకు కాంక్రీట్, గడ్డర్స్, ఆమ్స్, స్కిన్‌ప్లేట్స్ తదితర పనులను పూర్తి చేశారు. కొత్త రేడియల్ గేటును ప్రాజెక్టుకు అమర్చవలసి ఉంది. ఈ నెల 2 నుంచి 16వ తేది వరకు 16వ నంబర్ గేటు అమర్చే పనులు చేపట్టనున్నారు.



గేటు అమర్చేందుకు సిద్ధం చేసిన క్రాలర్ హెవీలోడ్ క్రేన్

ప్రాజెక్ట్ మీదుగా రాకపోకలు నిలిపివేత

పనులకు అంతరాయం ఏర్పడకుండా ప్రాజెక్ట్ మీదుగా మంగళవారం నుంచి 15 రోజులపాటు రాకపోకలను నిలిపివేశారు. రేడియల్ గేటు పైభాగంలో కోల్తార్ పెయింట్స్ వేసి రబ్బరు సీల్స్ బిగించి, గ్రీజింగ్ చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయిన వెంటనే రేడియల్ గేట్‌ను ప్రాజెక్టుకు బిగించేందుకు 100 టన్నుల క్రాలర్ హెవీలోడ్ క్రేన్, 80 టన్నుల టైర్‌మౌంటెడ్ క్రేన్‌లను సిద్ధం చేశారు. పనులను సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీరామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు అరుణకుమారి, అసిస్టెంట్ ఇంజినీర్లు విక్రమ్, వెంకటరెడ్డి పర్యవేక్షించనున్నారు.

తెలుసుకుందాం.. తెలివిగా నడుచుకుందాం

ఎండల్లో ఆటలు వద్దు

- చేతికి సెల్‌ఫోన్ సంకెళ్లు అసలే వద్దు
- భారత, భాగవత, ఇతిహాసాలపై అవగాహన కల్పిస్తే మేలు
- సెలవుల్లో పిల్లలపై అప్రమత్తత అవసరం



కొందరిని ఊరి చెరువు ఊరిస్తూ ఉంటుంది. ఇంకొందరికి ఊరవతల మైదానం కన్నుకొడుతూ ఉంటుంది. మరికొందరి చేతికి సెల్‌ఫోన్ సంకెళ్లు పడి ఉంటాయి. నిన్నమొన్నటి వరకు బడిలో బిజీబిజీగా గడిపిన బాలలను ఖాళీ సమయం కుదురుగా కూర్చోనీయదు. టూర్లు ప్లాన్ చేసినా, అమ్మమ్మతాతయ్యల ఇళ్లకు వెళ్లినా, సొంతూరికి బండి కట్టినా.. సెలవుల కాలం అంత తొందరగా కరిగిపోదు. అందుకే పిల్లలపై ఓ కన్ను వేయడం తప్పనిసరి. పరిమితికి మించి ఎండల్లో ఆటలు, సమయానికి మించి మొబైల్‌తో సావాసం, వయసుకు మించి సాహసాలు ప్రమాదాలను తెచ్చి పెడతాయి. మరైతే ఏం చేయాలి..? ఇలా కృశ్నేస్తే.. ఐదు మార్కుల ఆన్సర్లు సవాలక్ష ఉన్నాయి. కొన్ని తెలుసుకుందాం..

జాగ్రత్తలు తప్పనిసరి..

- ▲ పిల్లలను బావుల్లో, అలాగే చెరువుల్లో ఈత కొట్టేందుకు పంపించడం మంచిది కాదు. అవసరమైతే మీరే స్వయంగా వారికి తోడుగా వెళ్లండి.
- ▲ ద్విచక్రవాహనాలు నడపమని చేతికి తాళాలు ఇవ్వడం ప్రమాదాలను కొని తెచ్చుకోవడమే.
- ▲ మొబైల్ ఫోన్‌లు, ట్యాబ్‌ల వినియోగానికి ఓ టైమ్ సెట్ చేసుకోవడం ఉత్తమం.
- ▲ స్నేహితులతో కలిసి మరీ దూరప్రాంతాలకు పంపకూడదు.
- ▲ మధ్యాహ్న సమయంలో ఆటలు శ్రేయస్కరం కాదు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆడుకోనివ్వాలి.
- ▲ ఇంట్లో పెద్దలతో ఎక్కువ సమయం గడిపేలా చూడండి.
- ▲ రామాయణం, మహాభారతం, ఇతిహాస కథలు చెప్పే వారి వద్దకు పిల్లల్ని పంపించండి.
- ▲ పిల్లలు టీవీ ఎక్కువ సమయం చూడకుండా వారిని ఫిజికల్ గేమ్స్ వైపు మోటివేట్ చేస్తే మంచిది.
- ▲ యోగా, కరాటే, డ్రాయింగ్, నృత్యం, స్విమ్మింగ్, క్రికెట్, చెస్ వంటి ఇష్టమైన అంశాల్లో వారి అభిరుచి మేరకు శిక్షణ ఇప్పించాలి.
- ▲ మొబైల్ ఫోన్ బదులు మంచి కథల పుస్తకాలు, డ్రాయింగ్ పుస్తకాలు కొనివ్వండి. వారిలో సృజనాత్మకతను వెలికి తీసేలా వారితో బొమ్మలు వేయించండి.

టెక్కలి: బడులు నిశ్శబ్దమైపోయాయి. ఉదయం, సాయంత్రం, రాత్రి పిల్లలదే రాజ్యం. మరి ఇలాంటి సమయంలో ఇల్లు కిష్కింధ కాకుండా కాపాడుకోవడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయి. సెలవుల్లో సొంత గ్రామాలకు వెళ్లే సమయంలో పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండడం మంచిది. ఎండల బారిన పడి అనారోగ్యానికి గురికాకుండా, ఇతర ప్రమాదాల బారిన పడకుండా రక్షణ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఇలాంటి జాగ్రత్తలతో పాటు మన రాముడి మంచితనాన్ని, హనుమంతుడి భక్తిని, భీముడి బలాన్ని పిల్లలకు వివరించడానికి వేసవి సెలవులు అనుకూల సమయమని నిపుణులు సూచిస్తున్నారు.

బ్యాగులు సర్దాలి..

వేసవిలో కొత్త ప్రాంతాలు చూపిస్తే పిల్లలకు అవగాహన పెరుగుతుంది. సెలవుల్లో పిల్లలను వారి అమ్మమ్మ లేదా నాయనమ్మ ఇంటికి పంపించేందుకు ప్రయత్నించండి. సిటీలోని కాలుష్యానికి దూరంగా పిల్లలు పల్లెటూరి వాతావరణంలో హాయిగా పెరుగుతారు. అలాగే కొత్త కొత్త ప్రాంతాలను వీలును బట్టి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు తెలుస్తాయి.

కోపం వద్దు..

వేసవి సెలవుల్లో పిల్లలు బోర్ కొడుతుందని అల్లరి చేస్తారు. పిల్లలు అల్లరి చేస్తున్నారు కదా అని వారిపై అదే పనిగా కోపం తెచ్చుకోవద్దని బాలల నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలతో రోజులో ఏదో సమయం కేటాయించి వారితో ముచ్చటించాలి. పిల్లలకు నచ్చిన ఆహారాన్ని తయారు చేసి తినిపించాలి. గార్డెనింగ్ చేయించడం ద్వారా వారి అల్లరిని కట్టిపెట్టవచ్చు.

నైతిక విలువలు నేర్పాలి



వేసవి సెలవుల్లో పిల్లలకు నైతిక విలువలు నేర్పించే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. రామాయణం, మహాభారతంతో పాటు నీతికథలు బోధించే వారి వద్దకు పిల్లల్ని పంపించాలి. సాహిత్యంపై అవగాహన కల్పించాలి. ఇంట్లో ఎవరైనా వృద్ధులు ఉంటే వారిని గౌరవించే విధంగా వారితో మమేకం కావాలని పిల్లలకు చెప్పాలి.

– బి.అన్నపూర్ణమ్మ, సత్యసాయి బాల వికాస్ నిర్వాహకురాలు, టెక్కలి.

యోగా నేర్పాలి



యోగా సాధన ఎన్నో ఫలితాలను ఇస్తుంది. వేసవి సెలవుల్లో పిల్లలు యోగా సాధన చేయాలి. ముఖ్యంగా మెదడు మరింత పదునయ్యే విధంగా యోగా పై పిల్లలకు ఆసక్తి కలిగించాలి. దీనికి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి.

– జి.చంద్రశేఖర్, యోగా గురువు, టెక్కలి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943